# ఎం.ఏ. తెలుగు, రెండవ సంవత్సరం

## సెమిస్టర్-IV, పేపరు-III

## 403TL21- సంప్రదాయ సాహిత్య విమర్శ

## సిలబస్

1) విమర్శ స్వరూప స్వభావాలు-విమర్శనా రీతులు-విమర్శ ప్రయోజనం-విమర్శకుని లక్షణాలు-కావ్య స్వరూపం -ప్రాచ్య పాశ్చాత్య దృక్పథాలు-కావ్య ప్రయోజనం-కావ్య హేతువులు-కావ్యాత్మ-వాదాలు

2) కళలు-లలిత కళలు-దృశ్య, శ్రవ్య కళలు-లలిత కళల్లో కవిత్వ స్థానం

3) రస సిద్ధాంతం-లాక్షణికుల భిన్న దృక్పథాలు-భరతుని రస సిద్ధాంతం-రసరాజం-ధ్వని సిద్ధాంతం-ధ్వని భేదాలు

4) ప్రాచీన సాహిత్య ప్రక్రియలు-పురాణం-ఇతిహాసం-శతకం-ప్రబంధం-యక్షగానం-లక్షణాలు

5) దశరూపకాలు-నాటక లక్షణాలు-పాశ్చాత్య నాటకాలు-ట్రాజెడి-కామెడి-ఆవిర్భావ వికాసం-భారతీయ నాటకాలు-రూపక ప్రయోజనం

**ఆధార గ్రంథాలు:**

| | | |
|---|---|---|
| 1) | సాహిత్య శిల్ప సమీక్ష | - పింగళి లక్ష్మీకాంతం |
| 2) | సాహిత్య దర్శనం | - కె.వి.ఆర్. నరసింహం |
| 3) | సాహిత్య సోపానాలు | - దివాకర్ల వేంకటావధాని |
| 4) | కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్య | - సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి |
| 5) | తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు | - వెలమల సిమ్మన్న |
| 6) | An Information to the Study of Literature | - Hudson |
| 7) | Principles of Literary Criticism | - Richard |

## పాఠం - 1

# విమర్శ-స్వరూప స్వభావాలు

విషయ క్రమం:

- 1.1. ఉపోద్ఘాతము
- 1.2. నిర్వచనాలు
- 1.3. విమర్శ స్వరూప స్వభావం
- 1.4. విమర్శ స్వరూపం
- 1.5. నమూనా ప్రశ్నలు
- 1.6. ఆధార గ్రంథాలు

### 1.1. ఉపోద్ఘాతము:

లోకోత్తరంగా వర్ణించే వాడు కవి. కవి చేత సృష్టింపబడేది కావ్యం. కావ్యానికి కమనీయమైన వ్యాఖ్యానమే విమర్శ.

విమర్శ అంటే అనుశీలన, పరిశీలన, పర్యాలోచన, పరామర్శించు, పరిశోధించు, విచారించు, వివేచించు, శోధించు, అని రకరకాల అర్థాలు నిఘంటువుల్లో కన్పిస్తాయి.

విమర్శ అనే పదంలో వి అనేది ఉపసర్గ, మృశ్ అనే ధాతువు కలిసి విమర్శ అనే పదం ఏర్పడింది. అంటే ఒక అంశాన్ని చక్కగా విశ్లేషించి, వివరించి అందులోని గుణదోషాలను, మంచి చెడ్డలను, సర్వ విషయాలను వ్యాఖ్యానించేది విమర్శ అని అర్థం.

ప్రాచీన కాలంలో విమర్శ అంటే వ్యాగ్య, వివరణము, మీమాంస మొదలయిన అర్థాలు వ్యాప్తిలో ఉండేవి. ఐతే అప్పుడు శ్లోకార్థ వివరణ మాత్రమే ఉండేది. ఐతే అందులో అలంకారము. ధ్వని, రసము వ్యాకరణాది ఛందో విశేషాలు కూడా వివరించేవారు. వ్యాఖ్యాతలలో మల్లినాథుడు ప్రసిద్ధి గాంచిన వాడు. కాళిదాసు త్రయానికి తను వ్రాసిన వ్యాఖ్యలు సుప్రసిద్ధమైనవని అంటారు. భగవతానికి ముప్పై రెండు వ్యాఖ్యలు వచ్చాయి. అందులో శ్రీధరీయము సుప్రసిద్ధమైనది. వాల్మీకి రామాయణానికి గోవిందరాజు వ్యాఖ్య ప్రసిద్ధమైనది. భారతానికి నీలకంఠీయము ప్రముఖమైనది.

తెలుగులో వసు చరిత్రకు సోమనాథుడు రచించిన వ్యాఖ్య తొలి తెలుగు వ్యాఖ్యానము. అనంతరం వేదము వెంకట రామశాస్త్రి రచించిన శృంగార నైషధసర్వంకష ఆముక్త మాల్యద, సంజీవని, తాపీ ధర్మారావు విజయవిలాసానికి హృదయోల్లాస వ్యాఖ్య, మను చరిత్ర, వసు చరిత్రకు తంజనం తేవప్పెరు మాళ్ళయ్య తదితరులు రాసిన వ్యాఖ్యలు విశిష్టమైనవి.

### 1.2. నిర్వచనాలు:

**విమర్శకు పండితులు వివిధ రకాలుగా నిర్వచనాలు చేశారు. అందులో కొన్ని-**

"విమర్శ అనగా ఒకరు చేసిన పని యందలి బాగోగులను ఇంకొకరు వివేచించి తెలుపుట"

-పింగళి లక్ష్మీకాంతము.

"విమర్శ రూపిణీ విద్యా అని పరాదేవిని విమర్శ రూపిణిగా పూర్వులు వర్ణించారు. వేదాంతమునందు విమర్శయనగా ఆత్మానాత్మ వివేకము వాఙ్మయము నందు, నౌవ్య గత గుణ దోష విచారము విమర్శ నామముతో చెల్లుచున్నవి".

– ఖండవల్లి లక్ష్మీ రంజనము.

"ఒక గ్రంథమును గైకొని అందలి లోపములను, ఔచిత్యానౌచిత్యములను, భావ గంభీరతను, అలంకార రచనా పాటవమును, ధ్వని విశేషమును, శయ్యా సౌభాగ్యమును, వస్తు నిర్మాణ సౌష్ఠవమును, పాత్ర పోషణ, రస పోషణ, సన్నివేశ కల్పనాదులను వేయేల ఆ గ్రంథమునకు సంబంధించిన సర్వ విషయాలను కూలంకుషంగా చర్చించి వాఙ్మయమునకు గల స్థానమును నిరూపించుటయే విమర్శ యనబడును".

– కాకర్ల వేంకటరామ నరసింహం.

"ఒక కావ్యంలోని అట్టడుగు పొరల్లో దాగిన చేపుణిళ్ళాడే చీకటి తెరల నుంచి రత్నాల వంటి వినూత్న విషయాలను వెలికితీసి, చికిలీ చేసి, నకిషీలు దిద్దే ప్రయత్నమే విమర్శ".

– తూమాటి దొణప్ప.

"ఏ సాహితీ ప్రక్రియ అయినా అందులోని అంతర్యాన్ని, అంతర్నిగూఢమైన విషయాలను వివరించి, విశ్లేషించి వినూత్న భాష్యం చెప్పి సాహిత్యంపై ఆసక్తి కలిగించే వాడే విమర్శకుడు. అతని కృతమే విమర్శ, విమర్శ నల్ల సాహిత్యం వెలిగించబడాలి. అదే ఉత్తమ విమర్శ".

– గుజ్జర్లమూడి కృపాచారి.

ఇంగ్లీషులో CRITICISM తెలుగు విమర్శకు సమానార్థకంగా వాడుతున్నారు. గ్రీకు పదమైన HITI KORE కు Judgement అని అర్థం. దీని నుంచే Criticism వచ్చిందని అంటారు.

ఇంగ్లీషులో వచ్చిన నిర్వచనాల్లో ప్రముఖమైనవి Criticism may be regarded as having two different functions that of interpretation and that of judgement.

- Hud Son.

విమర్శకున్న రెండు ప్రయోజనాలలో వ్యాఖ్యానము, విలువల నిర్ణయం.

Criticism as I understand, it is an endeavour to discriminate between experiences and to evaluate them.

- Richerds.

అనుభూతుల తారతమ్యాలను వివేచన చేసి వాటి విలువలను అంచనా వేసేది విమర్శ.

Is the work good or bad that is the critics domain.

- Victor Hugo.

విమర్శకుడు ఇష్టా రాజ్యంగా మంచిగాని చెడుగాని చేసే పని విమర్శ.

Criticism is a distintrested endeavour to learn and propagate the best that is known and thought in the world.

- Mathew Arnold.

రాగ ద్వేషాల కతీతంగా ఉత్తమమైన దాన్ని అభ్యసించడం, దాన్ని విస్తృత వ్యాప్తి చేయడమే విమర్శ.

## 1.3. విమర్శ – స్వభావం:

ప్రాచీన కావ్యాల్లో కవి-పండిత శబ్దాలు తప్ప విమర్శ – విమర్శకుడనే శబ్ద ప్రయోగాలు కన్పించవు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలంలో "పండిత" శబ్దాన్ని విమర్శక శబ్ద పర్యాయపదంగా ప్రయోగించాడు. విమర్శకుడు విశ్లేషించేవాడు అర్వాచీన ప్రయోగాలు. ఇవి కావ్య శాస్త్ర సంబంధాలుగా ప్రాచీన ప్రయోగాల్లో లేవని స్పష్టం చేయవచ్చు.

**విమర్శను సూక్ష్మంగా రెండు రకాలుగా విభజించవచ్చు. అవి:**

1) సద్విమర్శ 2) అసద్విమర్శ.

**1) సద్విమర్శ:**

విమర్శకుడు సహృదయుడై, సర్వకాల, సర్వ దేశాలకు, రాగ ద్వేషాలకు అతీతంగా చేసేవాడే సద్విమర్శకుడు. ఈ విమర్శకుడు పర్వ సాహిత్యహితుడుగా, సహృదయవర్తిగా, సమాజ శ్రేయోభిలాషిగా ఉంటాడు. అదే సద్విమర్శ అవుతుంది.

**2) అసద్విమర్శ:**

కావ్య విమర్శను ఏక పక్షంగా చేయడం, తన క్లిష్టమైన అభిరుచిగల విషయాలను విస్తృత వ్యాప్తి చేయడం కోసం మూల రచనలను అనాదరించడం అసద్విమర్శ అవుతుంది. పైగా కావ్య గుణ నిర్దేశాన్ని తన స్వంత అభిప్రాయంతో ముడిపెట్టి అదే సరయిన విమర్శగా విశ్లేషించడమే అసద్విమర్శలోని ప్రధానాంశం.

పైన పేర్కొన్న విషయాలను దృష్టిలో ఉంచుకొని కవి కావ్య విమర్శకుడు ఇద్దరూ సమాజానికవసరమే. ఐతే విమర్శ ఎలా ఉండాలి అనేది చర్చనీయాంశం. దీన్నే విమర్శ స్వరూపం అని కూడా చెప్పవచ్చు.

విమర్శ ఎందుకనే ప్రశ్న కూడా ఉదయిస్తుంది. ఒక గ్రంథాన్ని పాఠకుడే స్వయంగా చదివి ఆనందించవచ్చు కదా! మరి విమర్శ దేనికి అనే ప్రశ్న. ఐతే గ్రంథం చదివేటప్పుడు సంపూర్ణంగా అవగాహనకాదు. అవగాహన అయినా అందులో కొన్ని తెలియని విషయాలు ఉండవచ్చు. పైగా కవి రచించిన లోతైన మార్మాలు గ్రహించగలిగే శక్తి అందరికీ ఉండదు. అటువంటి సమయంలో విమర్శ అవసరమౌతుంది. ఇది కవికి పాఠకునికి వారధిగా పని చేస్తుంది. ఉత్తమ విమర్శ వల్ల కావ్యానికి మరింత శోభ చేకూరుతుంది. విమర్శలో వచ్చిన సూచనల వల్ల భావి కవులకు-రచయితలకు ఉత్తమ మార్గ నిర్దేశనం కలుగుతుంది. అందువల్ల కావ్య విమర్శ కావ్యానికే కాక పాఠకులకు మేలు చేకూరుతుంది.

## 1.4. విమర్శ స్వరూపం:

1. విమర్శలో మూల గ్రంథాన్ని గూర్చిన సంపూర్ణ పరిశీలన ఉంటుంది.
2. మూల గ్రంథంలోని ఇతివృత్తం – కల్పితమా లేక అనువాదమా తెలిపే వివరణ ఉంటుంది.
3. గ్రంథ రచనలోని అధ్యాయాల వివరణ – సంకలనం చేసిన విధానం గమనించవచ్చు.
4. సాహిత్యపరమైన చర్చలో అది సామాజిక శ్రేయస్సుకు ఎంత వరకూ దోహదమో చర్చించవచ్చు.
5. కవి శిల్ప చాతుర్యము, నేర్పు గమనించవచ్చు. శైలీ విధానం కూడా వివరించవచ్చు.
6. కావ్య విమర్శలో రాగ ద్వేషాలకు అతీతంగా ఉండాలి.
7. అలంకారాది-చ్ఛందో శాస్త్ర నియమాలను గుర్తించవచ్చు.

8. గుణగణాలు నిర్ధారించవచ్చు.
9. ఇతర కావ్యాలతో పోల్చినపుడు మూల కావ్యం గొప్పదనాన్ని గుర్తించవచ్చు.
10. ఇదే ఆ ప్రక్రియలో తొలి కావ్యమైతే అందులోని ఉత్తమ లక్షణాలను, నవ్య పోకడలను విశ్లేషించవచ్చు.
11. సాహిత్య విలువలను అంచనా వేసి ఈ కావ్యం ఏ కోవలోకి వస్తుందో వివరించవచ్చు.
12. రచయిత / కవి ఆంతర్యాన్ని వివరించి అతని సందేశాన్ని బహిర్గతం చేయవచ్చు.
13. కవి సూక్ష్మంగా చెప్పిన ఉన్నతమైన, సమాజనిష్ఠమైన విషయాలను వివరణాత్మకంగా విమర్శించవచ్చు.
14. కవి గ్రహించలేని, చెప్పని విషయాలను విమర్శకుడు ప్రత్యేకించి సూచనలు చేయవచ్చు.
15. దోషాలను దోషాలుగానే పేర్కొని వాటి వల్ల కావ్యానికి కలిగే విపత్తును వివరించాలి.
16. వివిధ శాస్త్ర విషయాలు అయినట్లయితే వాటిని విశ్లేషించి సుబోధకం చేయాలి.
17. కవి ఆత్మీయతకు సంబంధించిన విషయాలయితే అవి సమాజ శ్రేయస్సుకు దోహదపడే తీరును వివరించాలి.
18. చారిత్రక సత్యాలను ఆవిష్కరించేటప్పుడు సరయిన చరిత్రను తెలియజేయడం విమర్శకుని పని.
19. విమర్శ కళాత్మకమైనదే కాబట్టి విరుద్ధ విషయాలకు తావివ్వకుండా సాగించాలి.
20. విమర్శ బుద్ధి వ్యాపారము కాబట్టి వస్తుతత్వ పరిశీలనకు ప్రాధాన్యమిచ్చి అందులోని శక్తిని వివరించే ప్రయత్నం చేయాలి.
21. స్వీయాభిప్రాయాలకు ప్రాధాన్యతను ఇవ్వకుండా, కావ్య సౌందర్యానికి తగు ప్రాధాన్యతనివ్వాలి.
22. విమర్శ సంపూర్ణంగా విశ్లేషణ చేస్తుంది. కాబట్టి అది ఉత్తమమైన తీర్పుగా తీర్చిదిద్దడం అవసరం.
23. స్వల్ప దోషాలను ఎత్తి చూపి కావ్య సౌందర్యానికి న్యూనతాభావాన్ని ఆపాదింపకూడదు.
24. మతపరమైనవైనా-అలౌక పరమైనవైనా అది కావ్య దృష్టితోనే స్వీకరించాలి కాని వాటికి మరోమతాన్నో మరొక సంప్రదాయాన్నో ఆపాదింపకూడదు.
25. కావ్యంలోని పాత్రల గుణశీలాదులను సామాజిక దృష్టితో బేరీజు వేయడం అది నిజ జీవితానికి అన్వయించడం అవసరం.
26. కావ్య ప్రయోజనం ఆనందమూ ఉపదేశమూ కాబట్టి సమాన ప్రాతినిధ్యం వహించే విధంగా విశ్లేషించాలి. ఉపదేశం వల్ల సన్మార్గ వర్తనానికి దారి తీసే విధంగా విమర్శను సాగించాలి.
27. పదగత వాక్యగత అర్థాలను వివరించవలసి వస్తే వాటి వ్యుత్పత్తులను కవి ఏ సందర్భంలో ఎందుకు ప్రయోగించవలసి వచ్చిందో వివరించడం ఎంతో ముఖ్యం.
28. అపురూపమైన నూతనమైన ఛందో ప్రక్రియలున్నపుడు వాటి వినిమయము ఉపయోగము విమర్శకునికి వివరించాలి.
29. ప్రతీకలున్నప్పుడు కవి ఎందుకు ప్రయోగించాడో వివరించే నేర్పు అవసరం.
30. విమర్శ రంధ్రాన్వేషణ కాకూడదు. ఉత్తమంగా భాసించాలి. మూల రచనను మరలా మరలా చదవాలనే కోరిక జనించే విధంగా ఉండాలి.

31. ప్రామాణికత లేని గ్రంథాన్ని అత్యుత్తమంగా విమర్శించి పాఠక లోకాన్ని వక్రమార్గంలోకి నడిపించడం కూడని పని.

పైన పేర్కొన్న విషయాలన్నీ కావ్యానుగుణంగా చేసినవే. అందువల్ల ఉత్తమ విమర్శనలో కావ్యగుణ బహుళ్యాన్ని వివరించి విశ్లేషించి ధర్మ ప్రతిపాదనకు తావిచ్చే విధంగా తీర్చిదిద్దాలి.

సహృదయ పాఠకుడు ఒక గ్రంథాన్ని చదివేటప్పుడు తనకు కలిగిన అనుభవాన్ని ఆ విమర్శతో పోల్చుకుంటాడు. తాను ఏకీభవించిన విషయాలను చదివి ఆనందిస్తాడు. భిన్నమైన విషయాలను పునఃస్సమీక్షించుకుని తాను చేసిన లోపాలను సరిదిద్దుకుంటాడు. ఇటువంటి విమర్శ పదికాలాల పాటు వర్ధిల్లుతుంది. అది ఉత్తమ పాఠకులను తయారు చేస్తుంది. సమాజాన్ని సన్మార్గంలో నడిపిస్తుంది. సామాజిక శ్రేయస్సుకు మార్గం వహించిన కవి-విమర్శకులు కలకాలం చిరంజీవులవుతారు. వారి రచనలు-విమర్శలు భావితరానికి మార్గదర్శకమై సమాజం సౌభాగ్యమై విలసిల్లుతుంది.

## 1.5. నమూనా ప్రశ్నలు:

1) విమర్శను నిర్వచనం చేసి స్వరూప స్వభావాలను వివరించండి?

2) విమర్శ స్వరూపాన్ని వివరించండి?

3) ఉత్తమ విమర్శ లక్షణాలను వివరించండి?

## 1.6. ఆధార గ్రంథాలు:

1) సాహిత్య దర్శనం - ఆచార్య కె.వి.ఆర్. నరసింహం.

2) తెలుగులో సాహిత్య విమర్శ - ఆచార్య యస్.వి. రామారావు.

3) తెలుగు సాహిత్య విమర్శ-సిద్ధాంతాలు - ఆచార్య కొలకలూరి ఇనాక్.

**- ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి.**

## పాఠం - 4

# ఉత్తమ విమర్శకుడు - లక్షణాలు

### 4.0. ఉత్తమ విమర్శకుడి లక్షణాలు:

సాహిత్య విమర్శ అంటే సాహిత్యంలోని గుణ దోషాలను తెలుసుకోవడమని అర్థం. ఈ విధంగా మంచి చెడులను నిర్ణయించే వాడిని విమర్శకుడు అంటాం. ఈ విమర్శ కావ్యాల్లోని కళలు, రసము, ధ్వని, అలంకారము, శైలి, శిల్పం, రచనా ప్రక్రియ తదితరమైన వాటిల్లో అన్నీ కాని, కొన్ని కాని విమర్శ చేయాలి. సంపూర్ణంగా విమర్శ చేసేవాడయితే సంపూర్ణ విమర్శ అవుతుంది. ఏవో కొన్ని విషయాలు మాత్రమే విమర్శ చేస్తే అసంపూర్ణ విమర్శ అవుతుంది. సంపూర్ణ విమర్శ చేయడానికి విమర్శకుడు సర్వజ్ఞాన సంపన్నుడు కావాలి. అపుడే సంపూర్ణంగా విమర్శ చేయగలుగుతాడు.

**విషయ క్రమం:**

4.1. కవి విమర్శకుడు

4.2. ఉత్తమ విమర్శకుడు

4.3. విమర్శకుడు నేర్పరి

4.4. రచనల పట్ల కుతూహలం

4.5. రచనలతో విస్తృత పరిచయం

4.6. మంచి చెడ్డలను నిర్ణయించే సమర్థత

4.7. సహృదయత

4.8. బహుముఖ ప్రజ్ఞ

4.9. విశాలదృక్పథం

4.10. రాగద్వేషాల కతీతం

4.11. ఋజువర్తనం

4.12. ధైర్యసాహసాలు

4.13. సునిసిత బుద్ధి

4.14. సూక్ష్మ దృష్టి

4.15. మిత భాషిత్వం

4.16. సమకాలీన దృక్పథం

4.17. ఆవేశరాహిత్యం

4.18. ప్రాపంచికానుభవం

**4.19.** పరిశ్రమించే సామర్థ్యం

**4.20.** ఓర్పు-నేర్పు

**4.21.** సులక్షణ వచన రచనా శైలి

**4.22.** నమూనా ప్రశ్నలు

**4.23.** ఆధార గ్రంథాలు

## 4.1. కవి – విమర్శకుడు:

కవికి విమర్శకునికి విడదీయలేని బంధం ఉంది. ఇద్దరూ సమ ఉజ్జీలుగా ఉంటారు. ఆయా సందర్భాల్లో కవి విమర్శకుడిగా విమర్శకుడే కవిగా సాక్షాత్కరిస్తారు. విమర్శ కన్నా కవి అధికుడైతే కవిగా కీర్తింపబడతాడు. కవి కన్నా విమర్శకుడు పెద్ద వాడైతే విమర్శకుడిగా గౌరవం లభిస్తుంది. రెండూ సమాన ప్రతిపత్తిగల వాడయితే కవి విమర్శకుడిగా సమాజంలో నిలబడతాడు. అందువల్ల కవి – విమర్శకుడు వేరు వేరయినా యిద్దరూ సమానమే. కావ్యం గొప్పదనం తెలియడానికి ఉత్తమ విమర్శకుడు అవసరం. ఉత్తమ విమర్శనం రావడానికి అత్యుత్తమ కావ్యం కూడా అవసరమే. అందువల్ల కవి విమర్శకుడు సమాజానికి రెండు కళ్ళు లాంటివారు. ఇక్కడ మరో విషయం గుర్తుంచుకోవాలి. బాటకయినా, కత్తిపీటకయినా గోడ చేరువ కావాలన్నట్టు కవి, విమర్శకుడి కయినా ఉత్తమ పాఠకుడి అవసరం ఉంది. పాఠకుడే లేకుంటే ఏదీ భాసించదు. అందుకే పాఠకుడు ప్రాణం లాంటి వాడు.

## 4.2. ఉత్తమ విమర్శకుడు:

కావ్యం సమాజహితము, ఉపదేశము ఆనందము కలిగించే విధంగా కవి కూర్చుతాడు. ఆ కావ్యంలోని మంచి చెడులను నిష్పక్ష పాతంగా వివరించేవాడు విమర్శకుడు. కావ్య ప్రమాణాలను నిర్ణయించేవాడయిన విమర్శకుడు ఆ కావ్య సౌందర్యాన్ని కొండను అద్దంలో చూపించే విధంగా విశ్లేషించాలి. పైపై మెరుగులు కాకుండా సార్వకాలికమైన సార్వజనీనతను స్థాపించే వాడుగా ఉండాలి. ఆ విమర్శను చదివి కావ్యం చదవాలనే కోరిక జనింపజేసే విధంగా సమాజాన్ని నడిపించే వాడే ఉత్తమ విమర్శకుడు. ఒక కావ్య సౌందర్యం విమర్శతో వికసించాలి.

## 4.3. విమర్శకుడు-నేర్పరి:

విమర్శకుడు సకల విద్యాపారంగతుడై సూక్ష్మ విషయాన్ని కూడా వివరించగల నేర్పరి అయితే కావ్యంతో పాటు విమర్శ కూడా రాణిస్తుంది. అందుకే ఉత్తమ విమర్శకుడు "నాన్ మూలం లిఖ్యతే కించిన్నానపేక్షిత ముచ్యతే" (మూలంలో లేనిది లిఖించను, అవసరం లేనిది చేర్చను) అని పూర్వ వ్యాఖ్యాతలు నిర్ధారించారు. అందువల్ల నేర్చరి అయిన ఉత్తమ విమర్శకుడికి రచనల పట్ల కుతూహలం, రచనలతో విస్తృత పరిచయం, అవగాహన, దార్శనిక దృష్టి, మంచి చెడ్డలను నిర్ణయించే సమర్థత, సహృదయత, బహుముఖ ప్రజ్ఞ, విశాల దృక్పథం రాగద్వేషాలకతీతం, ఋజు వర్తనుడిగా, ధైర్య సాహసాలుగల వాడిగా, సునిశిత బుద్ధి. సూక్ష్మ దృష్టి, మిత భాషిత్వం, సమకాలీన దృక్పథం, ఆవేశ రాహిత్యం, ప్రాపంచికానుభవం, పరిశ్రమించే సామర్థ్యం, ఓర్పు, నేర్పు సులక్షణమైన వచన రచనా శైలి మొదలయినవి ఉండాలని అటువంటి వాడే నేర్పరి అయి విమర్శకూర్పరి అవుతాడు.

## 4.4. రచనల పట్ల కుతూహలం:

విమర్శకుడిగా ఎదగాలంటే ముందుగా అతనికి వివిధ రచనలపట్ల కుతూహలం ఉండాలి. ఆయా రచనలను బాగా చదవాలి. ఆసక్తితో ఇష్టం ఏర్పరచుకోవాలి. కాలానుగుణంగా వచ్చే వివిధ ప్రక్రియలను కూలంకషంగా అధ్యయనం చేయాలి. సాహిత్యంలో వచ్చే అన్ని రంగాలనూ చదివి మంచి చెడ్డలను బేరీజు వేస్తూ ఒక ప్రణాళిక ప్రకారం విమర్శ చేయగలిగేవాడే ఉత్తమ విమర్శకుడవుతాడు.

## 4.5. రచనలతో విస్తృతి పరిచయం - అవగాహన:

ఉత్తమ విమర్శకుడికి కేవలం కుతూహలం ఉంటే చాలదు. విశ్వవ్యాప్తంగా వచ్చే రచనలతో పరిచయం ఉండాలి. పైగా ఆయా సమీప భాషలతో ఉండే ధోరణులను విశ్లేషించగలిగే మంచి పరిచయం అవసరం. ఎందుకంటే ఒక మంచి రచనను విమర్శించవలసి వస్తే ఇతర రచనలు చదివినందువల్ల తులనాత్మక జ్ఞానం ఏర్పడుతుంది. అందువల్ల వివిధ విమర్శనారీతుల్ని నూతన పోకడలను పరిచయం చేసే అవకాశం కలుగుతుంది. అప్పుడు విమర్శకుల దృష్టిలోనూ ఉత్తముడిగా కీర్తింపబడతాడు. పైగా ఆయా రచయితలతో ఉన్న పరిచయం వల్ల విభిన్న సంస్కృతులు, వివిధ ఆచారాలు ఆయా సాహిత్య విలువలను పరిచయం చేయవచ్చు. అందువలన మంచి అవగాహన కలిగి అత్యుత్తమ విమర్శకు దోహదకారి అవుతాడు.

## 4.6. మంచి చెడ్డలను నిర్ణయించే సమర్థత:

విమర్శ అంటే మంచి చెడులను బేరీజు వేయగల సమర్థత. మంచిని మంచిగా చెప్పాలి. చెడును చెడుగానే చెప్పాలి. దేనికదే ఉదాహరణలతో వివరించే స్థాయి కావాలి. అంతమాత్రం చేత పొగడ్తలను, తెగడ్తలను కొనసాగించడమూ సరికాదు. అంటే నిర్మొగమాటంగా చెప్పే సమర్థత అవసరం. ఉదాహరణకు కందుకూరి వీరేశలింగం రచించిన రాజశేఖర చరిత్ర తెలుగువారి ఆచార వ్యవహారాలకు దర్పణం పడుతుంది. ఆకాలం నాటి పరిస్థితులకు అది అద్దం వంటిది. ఐతే కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి వివేక చంద్రికా విమర్శనమని రాజశేఖర చరిత్రకు పై విమర్శన రాశాడు. కాని ఈ విమర్శలో అన్నీ దోషాలే చెప్పాడు. అందువల్ల అది విమర్శగా నిలిచింది.

అందువల్ల విమర్శ అంటే వ్యక్తిగత దూషణలు లేకుండా ఉండాలి. పొగిడినా తెగిడినా మృదువుగా ఉండాలి. పైగా ఏకపక్షంగా ఉండకూడదు.

## 4.7. సహృదయత:

విమర్శకుడిలో ఉండవలసిన లక్షణాల్లో సహృదయత చాల ముఖ్యం. ఏదో ఒక సిద్ధాంతానికో, ఇతరుల అభిప్రాయానికో కట్టుబడి ఉండకూడదు. కవి హృదయాన్ని ఆవిష్కరించే విధంగా ఉండాలి. కావ్యతత్త్వం తెలుసుకుని అంతర్లీనమైన సౌందర్యాన్ని ఆవిష్కరించాలి. ఇది ప్రయత్నం మీద అనుభవం మీద చేకూరుతుంది. సూక్ష్మమైన విషయాన్నయినా వీక్షించగలిగే జ్ఞాననేత్రం కావాలి అప్పుడే కవిత్వంలో దివ్య దర్శనం అవుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే కవి లౌకిక, అలౌకిక సౌందర్యాన్ని దర్శించి దానిని కావ్యంలో ప్రతిబింబింపజేసి దాన్ని విమర్శకుడు 'లోనారసి' దర్శించి ఆవిష్కరించినపుడే కావ్య ప్రయోజనం సిద్ధిస్తుంది. అంత సునిసితమైన పరిజ్ఞానంగల మేధతో పాటు సహృదయతతో ఆవిష్కరించగల వాడైనపుడే కావ్య ప్రయోజనం సిద్ధిస్తుంది.

## 4.8. బహుముఖ ప్రజ్ఞ:

విమర్శకుడు ఎంతటి వాడయినా బహుముఖ శాస్త్రాల పరిచయం అవసరం. సాధారణంగా కవి బహుముఖ ప్రజ్ఞ

కలవాడయి ఉంటాడు. అందుకే 'నానృషికురుతే కావ్యమని లోకంలో ఉంది. ఋషియైన వాడే కావ్య రచన చేయగలడు. అంత విజ్ఞాన జ్ఞాన సంపన్నుడయిన కవిని ఆవిష్కరించే విమర్శకుడూ అంతటి ప్రజ్ఞాశాలి కావాలి. ఇతివృత్తం నుంచి శిల్పం, ఛందో వ్యాకరణాది సమస్త విషయాలనూ పాత్రల ఔచిత్యాన్ని వెలికి తీసి నకషీ పట్టేవాడుగా ఉండాలి. కవి వివిధ శాస్త్ర పండితుడైతే ఆ విమర్శకుడు అంతకు మించిన శాస్త్ర కళ పరిజ్ఞానం కలవాడయితేనే కావ్యంతో పాటు విమర్శ భాసిస్తుంది. కొన్ని సందర్భాల్లో కవికి తన హృదయం తెలియకపోవచ్చు. దాన్ని కవి అభిప్రాయాన్ని అద్భుతంగా ఆవిష్కరించిన వాఖ్యాత వల్ల కవి కావ్య సౌందర్యం ఇనుమడిస్తుంది. ఉదాహరణకు మల్లినాథసూరి కాళిదాసు రచనలను అన్ని వర్గాల పాఠకులకు సులభ గ్రాహ్యమయేలా వాఖ్యానం చేశాడు. దీని వల్ల కవి, వ్యాఖ్యాత యిద్దరికీ మంచి పేరు ప్రతిష్ఠలు కలిగాయి.

## 4.9. విశాల దృక్పథం:

విమర్శకునికి విశాల దృష్టి చాలా అవసరం. అతని స్వంత అభిప్రాయాలను మాత్రమే చెప్పే సంకుచిత భావాలు ఉండకూడదు. అహంభావ దృష్టిని విడనాడాలి. నచ్చిన విషయాలను, నచ్చని విషయాలను సమదృష్టితో చూడాలి. చిన్న తప్పులను భూతద్దం వేసి చూపకూడదు. పైగా కావ్యం కన్నా తన విమర్శే మిన్నగా ఉందనే సంకుచిత భావం నుంచి బయటికి రావాలి. పైగా కవి కన్నా తనధికుడవనే అహం నుంచి బయటికి వచ్చినపుడే విమర్శ రాణిస్తుంది.

## 4.10. రాగద్వేషాల కతీతం:

విమర్శలో రాగద్వేషాలకు తావులేదు. తన పరభేదం లేని వాడుగా ఉండాలి. నచ్చిన పుస్తకాన్ని ఒక విధంగాను, నచ్చని పుస్తకాన్ని మరో విధంగానూ చూడకూడదు. కుల మత భేదం అసలు పనికిరాదు. సమదృష్టి కలవాడే ఉత్తమ విమర్శకుడు. పైగా సంప్రదాయం గొప్పదనో, ఆధునికతలో పసలేదనో అభాండాలు వేసి సమాజాన్ని వక్రమార్గంలో నడిపించకూడదు. తన అభిప్రాయాలను సమాజంపై బలవంతంగా మోపకూడదు.

## 4.11. ఋజు వర్తనం:

విమర్శకుడికి ఋజు వర్తనం ఎంతో అవసరం. వాస్తవ విషయాలను ఆవిష్కరించే వాడుగా ఉండాలి. అవాస్తవాలను, కల్పనలను చొప్పించకూడదు. పాఠకలోకాన్ని అపమార్గంలో నడిపించడం వల్ల తరతరాల్లో చెడు అభిప్రాయం ఏర్పడుతుంది. పాఠకులు ఏమీ తెలియని వాళ్ళనీ, తానేదో కొత్తగా ప్రవేశపెట్టే విషయాలు గొప్పవనే విధంగా తనను తాను మోసం చేస్తూ సమాజాన్ని మోసగించకూడదు. విమర్శకుడెపుడూ నీతి నియమాలు కలిగి సన్మార్గంలో ఇతరుల్ని, సమాజాన్ని నడిపించగల నాయకుడిగా ఎదగాలి. అది ఋత్వానికి దారి తీస్తుంది. అటువంటి విమర్శ లోకంలో నిలుస్తుంది.

## 4.12. ధైర్య సాహసాలు:

ఉత్తమ విమర్శకుడికి ధైర్యసాహసాలు ఎప్పుడూ కావాలి. మంచి చెడ్డల్ని పరామర్శించేటప్పుడు ప్రతి విమర్శలొచ్చినా ధైర్యంగా, స్థిరంగా నిలబడి వాదించగలవాడిగా ఉండాలి. తప్పును కప్పిపుచ్చే ప్రయత్నం చేయకూడదు. కావ్య గుణ దోషాలు ఎంతటి కవికయినా కొన్ని సందర్భాలలో ఉంటాయి. అలాంటప్పుడు పేరున్న కవి గదా అని దోష నిరూపణ చేయడానికి జంకకూడదు. లేని దోషాన్ని ఆరోపించి "తాత్కాలిక లబ్ధి పొందకూడదు". "సత్యాన్వేషణకు, సత్యశోధనకు ఎంతటి అవాంతరాలనయినా తట్టుకోగలవాడు" ఉత్తమ విమర్శకుడు.

## 4.13. సునిశిత బుద్ధి:

ఉత్తమ విమర్శకుడు సునిశిత బుద్ధి కలవాడై ఉండాలి. గ్రంథాలను పరిశీలించేటప్పుడు సునిసితమైన బుద్ధితో విమర్శించాలి. గ్రంథానికి సంబంధించి సర్వ విషయ గ్రహణ సంపన్నుడు కావాలి. గ్రంథాన్ని చదివినంతనే మంచి చెడ్డల్ని బేరీజు వేయగల మేధస్సు కావాలి. సునిసితమైన అంశాన్ని నిశితంగా విమర్శించగలగాలి. అంత మాత్రం చేత సున్నితమైన విషయాన్ని సౌమ్యంగా చెప్పాలే తప్ప బాధించే విధంగా చేయకూడదు.

## 4.14. సూక్ష్మ దృష్టి:

'విమర్శకుడికి సూక్ష్మ దృష్టి ఉన్నప్పుడే విమర్శ సంపూర్ణంగా సమగ్రంగా ఉంటుంది. రచనల్లోని స్థూల విషయాలను, అసంపూర్ణ విషయాలను, కవి దృష్టికి రాని అంశాలను వివరించేటంతటి సూక్ష్మ జ్ఞానము కావాలి. కొన్ని సందర్భాల్లో కావ్యంలోని అతి సూక్ష్మమైన అంశాలు అత్యంతమైనవిగా కావచ్చు. అటువంటప్పుడు అలాంటి మంచి విషయాన్ని వెలికితీసి వాటికి గొప్పదనాన్ని తేవాలి. అంటే దేనినీ తేలికగా వదల కూడదు. కవిలోని అంతర్గతమైనవీ, అంతర్లీనమైనవి ఆవిష్కరించగల సూక్ష్మదృష్టి విమర్శకుడికి ఎప్పుడూ అవసరమే.

## 4.15. మిత భాషిత్వం:

విమర్శకుడు తనకు అవకాశం లభించింది కదా అని వివిధ రచనలను, మంచి చెడ్డలను ఒకే మూసలో బేరీజు వేయకూడదు. అదే పనిగా యితర విషయాలను చెప్పి అసలు విషయాన్ని వదలడం ఎన్నటికీ మంచిదికాదు. అంటే అతివ్యాప్తి, అవ్యాప్తి దోషాలు చోటు చేసుకోకుండా ఉండాలి. వదరుబోతు కాకూడదనే భావం గుర్తుంచుకోవాలి. మిత భాషిత్వం అన్నిటా శ్రేయోదాయం. అధికమైన మాటల్లో దోషముండకనూనదనే పూర్వ ప్రవచనాన్ని ప్రతి విమర్శకుడూ ఆదర్శంగా తీసుకోవాలి.

## 4.16. సమకాలీన దృక్పథం:

విమర్శకుడికి సమకాలీన దృక్పథం అవసరం. సాహిత్య పద్ధతులు కాలానుగుణంగా మారుతూ ఉంటాయి. దేశీయమైన పద్ధతుల్లోనూ గణనీయమైన మార్పులు కన్పిస్తాయి. సాహిత్య విలువలు, ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమాలీన సమాజంలో వచ్చే మార్పులను అంచనా వేయగలవాడిగా ఉండాలి. కేవలం ఒక కాలానికి ప్రతినిధిగా ముద్ర వేసుకుని, గిరి గీసుకుని కూర్చోకూడదు. సాహిత్యం ఏకాలానిదయినా సందేశం అధునాతనమన్న నిత్య సత్యాన్ని మరువకూడదు. సమకాలీన సామాజిక ఆర్థిక, మత, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను అవగాహన చేసుకుని సమ సమాజక్షేమం కోసం సామాజిక స్పృహతో విమర్శ సాగించాలి.

## 4.17. ఆవేశరాహిత్యం:

ఆవేశం అన్ని అనర్థాలకూ దారి తీస్తుందనే విషయం నగ్న సత్యం. ఆవేశంలో బుద్ధి నశిస్తుంది. అది అనర్థాలకు దారి తీస్తుంది. ఉచితానుచితం కోల్పోతాడు. కావ్య ప్రయోజనాన్ని ఆవిష్కరించేవాడు ఆవేశం వల్ల అనర్థాలను కొని తెచ్చుకుంటాడు. అందువల్ల నిలకడ గుణంకావాలి. నెమ్మది, నిలకడ వల్ల వక్తిత్వ వికాసం వృద్ధి చెందుతుంది. ప్రేమ సర్వాన్ని జయిస్తుంది. సౌమ్యతగల వాడు ప్రపంచాన్నే జయించగలడు, విమర్శకుడూ నిలకడగల్గినట్లయితే కావ్యం ఉన్నతంగా నిలబడగలుగుతుంది. ఆవేశంవల్ల తొందరగా పూర్తయినా నిలకడ వల్ల ఆలస్యం జరిగినా మేలు కలుగుతుంది. సమయానికొక అభిప్రాయం వ్యక్తం చేయకూడదు.

### 4.18. ప్రాపంచికానుభవం:

విమర్శకునికి కేవలం తన ప్రాంతం, తన భాషలోని గ్రంథాల పరిచయం మాత్రమే కాదు వివిధ లోక జనవ్యవహారంతో పాటు అనుభవమూ అవసరమే. దీని వల్ల కావ్య విమర్శలో ప్రస్తావితమయే విషయాలు నిలకడగా స్థిరపడతాయి. బహుజనుల బహు బుధుల సేవించి 'విబుధవరుల వలన విన్నంత కన్నంత తెలియ వచ్చినంత తేట షరతు' ననే విధంగా ఉన్నప్పుడు ప్రాపంచిక అనుభవం ఏర్పడుతుంది. దీనివల్ల విశ్వవ్యాప్త విషయాలు ఆవిష్కరించడంతో పాటు పాఠకుడికి సరికొత్త విషయ పరిజ్ఞానం కలిగించినవాడవుతాడు. అది భవితకు మేలుగా పరిణమిస్తుంది.

### 4.19. పరిశ్రమించే సామర్థ్యం:

విమర్శ నిరంతరం కొనసాగే మంచి ప్రక్రియ. దానిని విమర్శకుడు శ్రమతో పరిశ్రమించాలి. సామర్థ్యంతో ఆవిష్కరించాలి. రచయితలు, కవులతో పోల్చితే విమర్శకులు చాలా తక్కువ. అయితే పరిశ్రమించగల విమర్శకుడే నిరంతరం గ్రంథ పఠనంతో పాటు నిత్య విమర్శన కూడా చేయగల సామర్థ్యం అవసరం. ఇక్కడ బద్దకం పనికిరాదు. వేగమూ కావాలి. నిలకడ గుణం తోడవాలి. ప్రశాంతంగా ఆలోచన చేసే సామర్థ్యమూ కావాలి.

### 4.20. ఓర్పు – నేర్పు:

విమర్శకుడిలో సహనం చాలా అవసరం. ఓర్పుగా నేర్పుతో కావ్య పరామర్శ చేయాలి. కావ్య పఠనం ఓర్పుతో జరగాలి. కష్టపడేతత్త్వం ఉన్నవాడు విజ్ఞానం గ్రహించాలనే తపన గలవాడు, సద్విషయ ఆవిష్కరణ చేయగల నేర్పు గలవాడు తనదయిన ధోరణితో విమర్శను తీర్చిదిద్దుతాడు. దీని వల్ల ఆశించిన ఫలితం సునాయాసమవుతుంది.

### 4.21. సులక్షణ వచన రచనా శైలి:

విమర్శకుడిలో ఎన్ని సుగుణాలున్నా సులభమైన, సులక్షణమైన వచన రచనా శైలి ఉన్నప్పుడు అది పాఠకుడికి సులభంగా చేరువ అవుతుంది. విమర్శకుడూ పండితుడైతన ప్రకార్షనూ, కఠిన పద రచననూ కొనసాగిస్తే ఆశించిన ప్రయోజనం నెరవేరదు. సాహిత్య విమర్శ సామాన్యుడికి చేరాలంటే సులభమైన సరళమైన వచన రచనా శైలి అవసరం. దీనివల్ల పాఠకుల సంఖ్య పెరుగుతుంది. విమర్శ అధిక శాతం పాఠకులకు చేరువ అవుతుంది. అది ప్రతిభ అంటే 'శక్తి, వ్యుత్పత్తి' అనే పాండిత్యం, అభ్యాసం అనే అలవాటు ఉత్తమ, విమర్శకుడిగా నిలబెడుతుంది. సమాజాని ప్రక్షాళనం చేసి నడిపిస్తుంది.

ఈ విధంగా ఉత్తమ విమర్శకుడు సాహిత్య లోకంలో కవితో పాటు ఆదర్శంగా వర్ధిల్లుతాడు. పాఠకుల ప్రశంసలతో పాటు సామాజిక అభివృద్ధికి సాహిత్య వికాసానికి తోడ్పడతాడు. దీనివల్ల ఉత్తమోత్తమ సాహిత్యం సాహిత్య విమర్శ పడుగు పేకల్లా పెనవేసుకుని సమాజాన్ని పరిరక్షించగలుగుతుంది. భావితరాలకు మార్గదర్శకమవుతుంది. ఉత్తమ విమర్శకుడు కవితో పాటు కవికాలం వర్ధిల్లుతాడు.

### 4.22. నమూనా ప్రశ్నలు:

1) ఉత్తమ విమర్శకుని లక్షణాలను వివరించండి?

2) విమర్శను నిర్వచనం చేసి ఉత్తమ విమర్శకుడెలా ఉండాలో తెలియజేయండి?

## పాఠం - 6

# అలంకారిక విమర్శ, స్వతంత్ర విమర్శ

### 6.0. లక్ష్యం:

ఈ పాఠంలో విమర్శ అంటే ఏమిటి? దాని స్వభావమేమిటి? అలంకారిక, స్వతంత్ర విమర్శ స్వరూప స్వభావాలు, వాటి పర్యవసానాల చర్చలుంటాయి.

**విషయ క్రమం:**

**6.1.** **విమర్శ**

**6.2.** **విమర్శ – నిర్వచనాలు**

**6.3.** **సాహిత్యం – విమర్శ**

**6.3.1. అలంకారిక విమర్శ**

**6.3.2. స్వతంత్ర విమర్శ**

**6.4.** **సాహిత్యం – కవిత్వాంశాలు**

**6.4.1. నైతిక విమర్శ**

**6.4.2. మనస్తత్వ విమర్శ**

**6.4.3. సాంఘిక విమర్శ**

**6.4.4. కళా విమర్శ**

**6.5.5. పౌరాణిక విమర్శ**

**6.5.** **సారాంశము**

**6.6.** **నమూనా ప్రశ్నలు**

**6.7.** **ఆధార గ్రంథాలు**

### 6.1. విమర్శ:

“వి” ఉపసర్గకు ‘మృశ్’ ధాతువు చేరి ‘విమర్శ’ అనే పదమేర్పడింది. విమర్శ అనే పదంలోని ధాతువుకు ఆలోచించుట, పరిశీలించుట అనే అర్థాలున్నాయి. విమర్శ అనే పదాన్ని సాహితీపరంగా మన ప్రాచీనాలంకారికులు ప్రయోగించినట్లు కనబడదు. ఆధునిక కాలంలోనే సాహితీపరంగా ‘విమర్శ’ అనే పదం మనకు కనబడుతుంది.

ఆధునిక కాలంలో ఆంగ్ల భాషా సంపర్కం చేత విమర్శ బహుముఖాలుగా వ్యాప్తి చెందింది. పూర్వకాలంలోని విమర్శకు ఇన్ని శాఖోపశాఖలు లేవు. ఆ రోజుల్లో వ్యాఖ్య, వివరణ, మీమాంస అనే పదాలు వ్యాప్తిలో ఉన్నట్లు తెలుస్తుంది. పూర్వాలంకారికులు చాలా గ్రంథాలకు ఈ అర్థంలోనే వ్యాఖ్యానాలు చేసేవారు. వ్యాఖ్యానం అంటే కేవలం శ్లోకంలోని అర్థ వివరణలకు మాత్రమే కట్టుబడి ఉండేది. విమర్శకు ఇదే మొదటి సోపానం. వస్తు స్వభావానికి అతీతంగా వస్తువును గూర్చి

చర్చించడం పూర్వుల మతానికి విరుద్ధం. కాబట్టి శ్లోకార్థ వివరణనే కూలంకషంగా చర్చించే దిశగా చాలా గ్రంథాలకు వ్యాఖ్యానాలు రాసినారు. ఇవే టీకలు. ఈ విధంగా శ్లోకార్థాన్ని చర్చించిన తర్వాత అందులోని లోతుల్ని గూర్చి ఆలోచించే బాధ్యతను సహృదయ పాఠకులకే వదిలినట్లు తెలుస్తుంది. ఇలాంటి వ్యాఖ్యల్లో సమగ్ర వ్యాఖ్యలతో పాటు అలంకారం, శయ్య, రీతి, ఎంకం మొదలైన భాషా విశేషాలు కూడా చోటు చేసుకొని ఉండేవి. పురాణ ఇతిహాస కావ్యాలకు కూడా ఇలాంటి వ్యాఖ్యానాలుండేవి. ఈ విధంగా వ్యాఖ్యానాలు రాసిన వారిలో మల్లినాథుడు ప్రసిద్ధుడుగా పండితులు అంగీకరించారు. ఇతడు నైషదీయ చరితానికి వ్యాఖ్య రాసినట్లు ప్రతీతి. నైషదీయ చరితానికి నారాయణీయమనే వ్యాఖ్యానం కూడా ప్రమాణమే. భాగవతానికి ముప్పదికి పైగా వ్యాఖ్యానాలు వచ్చాయి. అందులో భాగవతాన్ని అద్వైతపరంగా చూపిన శ్రీధరీయ వ్యాఖ్య, విశిష్టాద్వైత పరంగా చూపిన రాఘవీయ వ్యాఖ్యలూ ప్రసిద్ధాలే. రామాయణానికి వచ్చిన వ్యాఖ్యల్లో గోవిందరాజు రాసిన వ్యాఖ్య మిక్కిలి ప్రసిద్ధం. అలాగే నీలకంఠీయమనే వ్యాఖ్య ప్రసిద్ధం. పైవన్నీ సంస్కృత వ్యాఖ్యానాలే. అలాగే పురాణేతిహాసాలకే కాక అలంకార గ్రంథాలకు కూడా వ్యాఖ్యానాలు వచ్చాయి. అందులో అభినవ గుప్తుడు ధ్వన్యాలోకానికి 'లోచనం' పేరుతోనూ, నాట్య శాస్త్రానికి 'అభినవ భారతి' పేరుతోనూ వ్యాఖ్యానాలు రాశాడు. ఈ వ్యాఖ్యానాలు వల్లనే అభినవ గుప్తునికి అలంకారికుల్లో విశిష్ట స్థానం ఏర్పడింది.

సోమనాథుడనే కవి తెలుగులో మొట్టమొదట వసుచరిత్రకు వ్యాఖ్యానం రాశాడు. వసుచరిత్రకు రాసిన వ్యాఖ్యానం లభ్యమైన వాటిలో మొదటిది. తర్వాత శేషాద్రి రమణ కవులు కూడా వసు చరిత్రకు వ్యాఖ్యానాలు రాశారు. వేదం వేంకటరాయ శాస్త్రిగారు శృంగార నైషధానికి ఆముక్త మాల్యదకు రాసిన వ్యాఖ్యానాలు ఎక్కువ మంది పండితుల ఆమోదాల్ని పొందాయి. విజయ విలాస కావ్యానికి తాపీ ధర్మారావు రాసిన సహృదయోల్లాస వ్యాఖ్యానం నేటికీ పాఠకులకు శిరోధార్యంగా ఉంది.

పై వ్యాఖ్యానాలన్నీ కూడా నేటి పరిభాషలో చెప్పాలంటే విమర్శన గ్రంథాలే. అందులోనూ ప్రతి అంశానికీ సంబంధించిన కూలంకష వివరణలు పుష్కలంగా ఉన్నాయి.

క్రౌంచ వధను చూసిన వాల్మీకి శ్లోకం వాగ్రూపాన్ని దాల్చిన తర్వాతనే అది ఒక శ్లోకమనీ, అది సాహిత్యమని వాల్మీకికి అవగతమైనదనడంలోని అంతరార్థం ఇదే. వాల్మీకి తొలి కవికి ప్రతీక. అతని శ్లోకం మానవుని కరుణ రసాత్మకమైన ఆక్రోశం. దానిని అనుశీలన చేసిన వాల్మీకి తొలి విమర్శకుడు. రామాయణ కావ్యాన్ని రాస్తున్నప్పుడు ఆయన చేసింది సాహిత్య సృష్టే. ఈ సృష్టి లోకోత్తరంగా వికసించడానికి ఆయనకు సాయపడింది. ఆయనలో మేల్కొన్న విమర్శనాత్మక శక్తి. ఆ సృజన శక్తిలో విమర్శ ఒక భాగం అయితేనే కానీ సాహిత్యం రసవంతం అవదని ఆదికవి మనకు నిరూపించాడు. (సాహిత్యం-విమర్శ: వడలి మందేశ్వరరావు) ప్రస్తుతం విమర్శ, సాహిత్య విమర్శలను గురించి చెప్పుకుందాం.

## 6.2. విమర్శ- నిర్వచనాలు:

"Criticism may be regarded as having two different functions that of interpretation and that of Judgement"

- Hudson

"ఒక గ్రంథాన్ని తీసుకొని దాని లోపాల్ని ఔచిత్యానుచిత్యాల్ని భావగంభీరతను, అలంకార రచనా పాటవాన్ని, ధ్వని విశేషాల్ని, శయ్యా సౌభాగ్యాల్ని, వస్తు నిర్మాణ సౌష్టవాన్ని, పాత్ర పోషణ, రస పోషణ, సన్నివేశ కల్పనాదులు మొదలైన విషయాల్ని కూలంకషంగా చర్చించి సాహిత్యంలో ఆ గ్రంథ స్థానాన్ని నిరూపించడమే విమర్శ".

"Criticism as I understand it, is the endeavour to discriminate between experiences and to evaluate them".

- I.A. Richards

అనుభూతి విశేషాల్ని వివేచించి వాటి విలువలను నిర్ణయించడానికి చేసే ప్రయత్నమే విమర్శ.

విమర్శ కూడా కవిత్వం, నాటకం, నవల, కథ మొదలైన ప్రక్రియల లాగానే ఒక రకమైన సాహిత్య ప్రక్రియ. సృజనాత్మకతకు ఇందులో అవకాశం లేదు. అలాగని స్వతంత్ర ప్రక్రియా కాదు. ఏదో ఒక సాహిత్య రచనను ఆధారం చేసుకొని తన అస్థిత్వాన్ని కాపాడుకొనేది విమర్శ.

## 6.3. సాహిత్యం - విమర్శ:

సాహిత్యం- విమర్శ అనేది వేరు వేరు ప్రక్రియలుగా అనుకొన్నా, సాహిత్యంలో విమర్శ, విమర్శలో సాహిత్యం అనివార్యంగా అవిభాజ్య భాగాలుగా ఉంటాయి. సాహిత్య విమర్శ ఎంతో కొంత ప్రాచీన కాలం నుంచి ఉన్నా, అదొక ప్రత్యేక ప్రక్రియగా ఆవిర్భవించింది ఆధునిక కాలంలోనే. ఇది అచ్చు యంత్రం ప్రభావం. పాశ్చాత్య సాహిత్య ప్రభావం. మనకు అపారమైన సాహిత్య సిద్ధాంత గ్రంథాలున్నాయి. వాటినే అలంకార శాస్త్రాలంటున్నాం. సాహిత్య సిద్ధాంతం వేరు, సాహిత్య విమర్శ వేరు. సాహిత్య సిద్ధాంతం సాహిత్యం ఎలా ఉండాలో చెబుతుంది. సాహిత్య విమర్శ సాహిత్య ఎలా వుందో చెబుతుంది.

అందువల్ల 'సాహిత్య విమర్శ' అంటే ఏమిటో నిర్వచించుకుందాం. సాహిత్య విమర్శ సాహిత్య విమర్శకుని వ్యాపారం. సాహిత్యం రచయిత సామాజికానుభవానికి సృజనాత్మక రూపమైతే, సాహిత్య విమర్శ విమర్శకుని సాహిత్యానుభవానికి విశ్లేషణాత్మక రూపం, అంటే సాహిత్య పఠనం విమర్శకునిలో కలిగించిన కదలికలకు ప్రకంపనాలకు అభివ్యక్తి సాహిత్య విమర్శ. ఎప్పటి సాహిత్యాన్ని చదివినా, ఎవరి సాహిత్యాన్ని చదివినా, ఎలాంటి సాహిత్యాన్ని చదివినా చదివిన వ్యక్తిలో ఆ చదువు కొన్ని అనుభూతుల్ని కలిగిస్తుంది. ఆలోచనల్ని రేపుతుంది. అనుభవాలను మిగిలిస్తుంది. ప్రశ్నల్ని పుట్టిస్తుంది. సమాధానాలను చెబుతుంది. ఏ అనుభూతినీ ఏ ఆలోచననూ కలిగించని రచన రచన కాదు. రచయిత సమాజాన్ని దర్శించి విశ్లేషించి సూత్రీకరించి భావ చిత్రాల పాత్రల ద్వారా చిత్రిస్తాడు. పాఠకుడైన విమర్శకుడు దానిని చదివి దానిని విశ్లేషిస్తే సాహిత్య విమర్శ అవుతుంది. అయితే పాశ్చాత్య విమర్శకులు సాహిత్య విమర్శను Judgement తీర్పుగా భావించారు. "In its strict sense of the word criticism means judgement" అన్నారు - W.H. Hudson. ఇదే భావాన్ని Worsebold "Criticism is the excercise of judgement in the province of art and literature" అని నిర్వచించారు. (Judgement in Literature) కళా సాహిత్య సామ్రాజ్యంలో తీర్పు విధించడమే విమర్శ అని అర్థం, విమర్శకులు తీర్పరులైతే సాహిత్య విమర్శ తీర్పు అవుతుంది.

ఒక రచనను చదివిన తర్వాత ఆ రచనలో కనిపించే జీవితం, ఆ జీవితాన్ని రచయితే అర్థం చేసుకున్న తీరు. దానిని చిత్రించిన తీరు-వీటిని విమర్శకుడు విశ్లేషిస్తాడు. అంటే రచయిత తీసుకున్న జీవితం ఏది? దానిని ఆయనెలా అర్థం చేసుకున్నాడు? అందులోని శాస్త్రీయత ఎంత? అశాస్త్రీయత ఎంత? ఆ జీవితాన్ని చిత్రించడంలో కళా రూపాన్ని ఎలా వాడుకున్నాడు? వస్తువుకు రూపానికి మధ్య సమన్వయం సాధించాడా? లేదా? రూపంలోని కళాత్మక గుణం పరిపూర్ణంగా సిద్ధించిందా లేదా మొదలైన అంశాలను చర్చిస్తాడు. చర్చించి ఆ రచనలోని వస్తు రూపాలకు సంబంధించిన అనుకూల

అనుకూల పార్శ్వాలను స్పష్టం చేస్తాడు. రచనలో రచయిత సాఫల్య వైఫల్యాలను అంచనా కడతాడు. వాటికి కారణాలను చెబుతాడు. దీనినే 'గుణ దోష విచారణ' అంటారు. ఇదే తీర్పు. కవుల్ని శాసన కర్తలు అన్నాడు మాథ్యూ అర్నాల్డ్. విమర్శకులు తీర్పరులు. అందువల్ల సాహిత్య విమర్శ అంటే సాహిత్య రచన మీద పాఠకుడైన విమర్శకుడు చెప్పే తీర్పు.

విమర్శ అనేది పూర్తిగా ఆధునికమైంది. ఆంగ్లేయుల వైద్య విధానం భారతదేశమంతటికి విస్తరించి భారతీయుల ఆలోచనలో మార్పు తెస్తున్న కాలంలో సాహిత్య విమర్శ కూడా కొత్త రూపాన్ని పొందింది. ఈ దశలోనే కవుల కుల, ప్రాంతాలను గూర్చిన చర్చ, కవుల కాలాన్ని గూర్చిన చర్చ, శబ్దార్థ చర్చ. వ్యాకరణ విషయాల చర్చ సాహిత్య విమర్శగానే చలామణి అయ్యాయి. తర్వాత ఒక సాహిత్య గ్రంథాన్ని కథ. సన్నివేశాలు, దేశకాల, పాత్రల స్వరూప స్వభావ గుణాలతో పాటు కూలంకషంగా తెలియజేసే స్థాయికి విమర్శ ఎదిగింది. 1914వ సంవత్సరంలో కట్టమంచి రామలింగారెడ్డిగారు రాసిన 'కవిత్వ తత్త్వ విచారం' అనే గ్రంథంలో ఆధునిక విమర్శ ప్రారంభమైంది. అప్పటి నుండి ఇప్పటి వరకు సాహిత్య విమర్శ కొత్త పుంతలు తొక్కుతూ విస్తరిస్తూ వుంది.

**విమర్శ స్థూలంగా రెండు రకాలు:**

1. అలంకారిక విమర్శ (Judicial or deductive criticism)
2. స్వతంత్ర విమర్శ (Inductive criticism)

### 6.3.1. అలంకారిక విమర్శ:

ఇది చాలా ప్రాచీనమైంది. అలంకారిక నిబంధనల్ని ఆధారంగా తీసుకొని గ్రంథాన్ని విమర్శించడమే అలంకారిక విమర్శ. అలంకారిక నియమాలకు లోబడి రాయబద్ధ గ్రంథం మంచి గ్రంథమని ఆ నియమాలను అతిక్రమించి రాయబద్ధ గ్రంథం మంచి గ్రంథం కాదని అలంకారికులు నిర్ణయిస్తారు. పాశ్చాత్య దేశాల్లో కూడా ఈ అలంకారిక విమర్శ ప్రచారంలో ఒకప్పుడుండేది. ఈ పాశ్చాత్యులకు అరిస్టాటిల్ రాసిన పోయెటిక్స్ (Poetics) అనే గ్రంథం ప్రమాణం. అంతేకాక హోమర్, డేంటే, వర్జిల్ మొదలగు మహాకవులు గ్రీకు, లాటిన్ భాషల్లో రాసిన ఇతిహాసాలపై గూడా పాశ్చాత్యులకు ప్రామాణికత వుండేదని తెలుస్తుంది. మన దేశంలో అలంకార గ్రంథాలతో పాటు భారత రామాయణాది మహా కావ్యాలు గూడా ప్రమాణ గ్రంథాలే. సాహిత్యానికి సంబంధించిన అన్ని విషయాల్లోనూ అలంకారిక నిబంధనలున్నాయి. ఉదాహరణకు ఛందస్సు, అలంకారం, రీతి, శయ్య, పాకం మొదలైన అంశాలు. వీటితో పాటు రచనకు తీసుకొన్న వస్తువు నుంచి పద ప్రయోగం వరకు గూడా అన్ని విషయాల్లోనూ పరిమితులే నాటక విషయాల్లో ఈ నియమ నిబంధనలు మరీ ఎక్కువ.

విమర్శ అంటే గుణ దోష విచారణమని ఇది వరకే తెలుసుకున్నాం. అలంకార విమర్శకు విమర్శలోని గుణగణాల్ని వెల్లడించడంలో దాదాపు అగ్రస్థానముందని పండితుల అభిప్రాయం. కవికి ఉండే వివిధ శాస్త్ర పరిజ్ఞానాన్ని అంచనా వేయడానికి వ్యాఖ్యాత గొప్ప పండితుడై ఉండాలి. కవిని మించిన శాస్త్ర పరిజ్ఞానం కూడా అవసరం. వ్యాఖ్యాత గ్రంథంలో కనిపించే దోష విచారణ చేసే సమయంలో మిక్కిలి జాగ్రత్త వహించాలి. తనకు తోచినవన్నీ దోషాలని నిర్ధారించకుండా తన అభిప్రాయాల్ని వెల్లడించి వివిధ శాస్త్రాల సహాయంతో ఏవి దోషాలు కావో, ఏవి అవుతాయో నిరూపించాలి.

ఛందో వ్యాకరణాలంకారాల్ని ప్రధాన సాధనాలుగా తీసికొని అలంకారిక విమర్శకులు విమర్శ చేసే వారు. శాస్త్ర పఠనంతో తృప్తి పడకుండా వ్యాఖ్యాత ప్రాచీన వాఙ్మయమంతా మధించి, కావ్యం అమరత్వానికి కారణ భూతాలైన గుణ

విశేషాల్ని కూడా గ్రహించాలి. ఇతి వృత్తం, రసం, నాయికా నాయకులు, కావ్య గుణాలు, కావ్య దోషాలు, అలంకారాలు, వర్ణనలు, ఔచిత్యం మొదలైన అంశాల్ని ఆధారం చేసుకొని అలంకారిక విమర్శ సాగుతుంది. అలంకార శాస్త్ర వాక్యాల్ని ప్రమాణంగా తీసుకొని వాటికి అనుకూలమైన రచనల్ని పొగడటం, నాటికి భిన్నమైన రచనల్ని తెగడటమే అలంకారిక విమర్శ ఉద్దేశ్యం. అలంకారిక విమర్శన పద్ధతి పాశ్చాత్య దేశాల్లో కూడా ఉంది. ఆంగ్ల భాషలో కూడా కొందరు విమర్శకులు గ్రీకు, లాటిన్ భాషా లక్షణాల్ని ఆధారం చేసుకొని షేక్స్పియర్ నాటకాల్ని విమర్శించి లక్షణ విరుద్ధాలైన అంశాల్ని తిరస్కరించారు. ఏ కావ్యం కూడా ఎప్పుడూ లక్షణ విధేయంగా ఉండే అవకాశం తక్కువ. కాబట్టి లక్షణ కర్తలు తమ ఆజ్ఞలకు కట్టుబడే కావ్య రచనల్ని కోరకూడదు. కవి ఆత్మీయతకు సంబంధించిన ప్రేమ, ఈర్ష్య, అసూయ, క్రోధం మొదలైన గుణాల్ని విమర్శకులు సహృదయతతో గమనించాలి. కవి పుట్టి పెరిగిన సంఘం, ఆ సంఘానికి సంబంధించిన సంప్రదాయాలు కావ్యంలో ప్రతిబింబించడం సహజం. కాబట్టి ఆ కాలం నాటి సాంఘిక పరిస్థితుల్ని విమర్శకుడు గమనించాలి..

### 6.3.2. స్వతంత్ర విమర్శ:

స్వతంత్ర విమర్శ ముఖ్యంగా ఆది భౌతిక శాస్త్ర పరిశీలన విధానాన్ని అనుసరించి వుంటుందని పండితుల అభిప్రాయం. వృక్ష శాస్త్రజ్ఞునికి శాస్త్రీయంగా ఉమ్మెత్త పూవు, గులాబీ ఒకటే. భూగర్భ శాస్త్రజ్ఞునికి మసిబొగ్గు-రత్నాలు సమానమే. అంటే వాని శాస్త్ర దృష్టికి ఆ పదార్థంలోని భేదాలు గోచరింపవు, వస్తువు విలువ రీత్యా, స్వభావ రీత్యా ఏ పదార్థానికి ఆ పదార్థమే ప్రధానం, సాహిత్య విషయంలో గూడా ఈ దృక్పథాన్నే అనుసరించాలని స్వతంత్ర విమర్శకుల అభిప్రాయం. స్వతంత్ర విమర్శలో విషయ పరిశీలనమే ప్రధానం. ఒక గ్రంథాన్ని పరిశీలించి, దాన్ని విలువల్ని నిర్ణయించి తీర్పు (Judgement) చెప్పే అధికారం ఈ విమర్శకునికి వుండదు. ఈ గ్రంథాన్ని వేరే గ్రంథంతో పోల్చకూడదు. ఏ గ్రంధానికి ఆ గ్రంథమే ప్రమాణం. ఏ కవికి ఆ కవే ప్రమాణం. అలంకారిక నియమాల ప్రకారం ఇక్కడ విమర్శ చేయకూడదు.

ఆంగ్ల భాషలో మోల్టన్ (Molton) ఈ స్వతంత్ర మార్గాన్ని అనుసరించాడు. ఈ కోవకు చెందిన విమర్శలు కొన్ని వచ్చినా, మోల్టన్ ఆశించిన ఫలితాన్ని మాత్రం ఇది సాధించలేకపోయింది. వాస్తవానికి ఇందులో కొన్ని లోపాలున్నాయి. సాహిత్యం శాస్త్రం కాదు. అది ఒక కళ. సాహితీపరమైన ఈ సూత్రాన్ని ఈ విమర్శకులు విమర్శించినట్లు తెలుస్తుంది. భౌతికమైన వస్తు జాలాన్ని పరీక్షించే సమయంలో శాస్త్రజ్ఞునికి అలంకార మమకారాలతో అవసరం లేదు. అసలు మానవత అన్న మాటకే అక్కడ స్థానముండదు. అలాంటపుడు ఆత్మీయతా ముద్ర (భావన) కు గూర్చిన పై సంగమ సంగీతం శాస్త్రం వస్తుతత్వాన్ని యధాతథంగా వ్యక్తీకరిస్తుంది. దాని ప్రయోజనమదే. ఇందులో సాహిత్యం కళ కాబట్టి ఒక వస్తువునకు మానవ హృదయంపై గల ప్రభావాన్ని కళ వ్యక్తీకరిస్తుంది. కవిత్వం కూడా కళే కాబట్టి వస్తువుకు మానవ హృదయంపై వున్న ప్రభావాన్ని అది ప్రదర్శిస్తుంది. అంటే కళ లేదా కళా సృష్టిలో మానవ హృదయానికి వున్న ప్రాధాన్యం మరిదేనికీ లేదని తెలుస్తుంది. మానవతా సంబంధాలు ఎప్పుడు ఏర్పడతాయో అప్పుడే కళలో కూడా తరతమ భేదాలు ఏర్పడ్డాయనవచ్చు. మానవతా ముద్ర లేని కళే అసంభవం. మానవ జీవితానికి ప్రతిబింబమని చెప్పుకొంటున్న సాహితీ విషయంతో ఇది సత్యం. కాబట్టి ఒక కావ్యాన్ని విమర్శించే సమయంలో శాస్త్ర సదృశ్యా సంగతమైన విమర్శకాక కళా సంబంధమైన మంచి చెడ్డల్ని నిర్ణయించే అధికారం మాత్రం విమర్శకునికి వుంటుంది.

## 6.4. సాహిత్యం – కవిత్వాంశాలు:

1. కవిలేక కవిత్వం ఆత్మీయతకు సంబంధించింది. కవికి సహజంగా వున్నటువంటి ప్రేమ, ఈర్ష్య, అసూయ, క్రోధం మొదలగు గుణాలు ఇందులో చేరుతుంటాయి. ఈ గుణాలన్నీ కవి కావ్యంలో చేరడం కూడా సహజమే.

2. కవి పుట్టి పెరిగిన సమాజం, దాని సంప్రదాయం కావ్యంలో ప్రతిబింబిస్తాయి. ఇది సాంఘిక ధర్మం.

3. ఇంకొకటి విశ్వజనీనత, ఇది దేశ కాలాతీతమైన ధర్మం. ఇందులో సత్యం, అహింస, సర్వసమానత్వం మొ॥ ఉత్తమోత్తమ ధర్మాల ప్రసక్తి వుంటుంది. కవి యొక్క ఆత్మీయతా గుణాలు, సాంఘికత అనే రెండు అంశాలు కూడా బలీయమైనవే. వాక్చాతుర్యం గల వాళ్ళు మాత్రం తీసుకున్న గుణాల్ని నిర్భయంగా రచనల్లో వ్యక్తీకరించగలరు. కానీ ఇందులో కూడా తనకు కలిగిన భావాల్ని యధాతథంగా వ్యక్తీకరింపక ఆత్మవంచనకు పాల్పడే వాళ్ళు అరుదుగా కన్పిస్తారు. తమకు కలగని అనుభూతుల్ని వ్యక్తీకరించిన వాళ్ళూ లేకపోలేదు. అంటే వైయక్తికాలైన యిష్టాయిష్టాన్ని వ్యక్తీకరించే కవికంటేన సాంఘికాలైన సంస్కార సంప్రదాయాల్ని చిత్రించే కవి గొప్పవాడని నిస్సందేహంగా చెప్పవచ్చు. సాంఘికత్వం కంటే విశ్వజనీనత మిన్న. కాబట్టి కవి క్రాంత దర్శి, ఋషితుల్యుడు కాగలుగుతున్నాడు.

కవిత్వ సృష్టి, దాని బాగోగులు, తరతమ భేదాలు నిర్ణయించే అధికారం ప్రతి ఒక్కరికి వుంటుంది. ఆ విధంగా ఒక రచనను అంచనా వేయలేనినాడు ఆ రచనవల్ల అనర్థాలు కలిగే అవకాశం లేకపోలేదు. సమాజానికి ఒక రచన ద్వారా తప్పుడు సంకేతాలు పోకూడదు. కాబట్టి సాహిత్య విషయంలో కవి ఆత్మీయత, సాంఘికత, విశ్వజనీనతను దృష్టిలో పెట్టుకొనే విమర్శకుడు ప్రవర్తించాలి. స్వతంత్ర విమర్శలో పైవాటికి స్థానం లేదు. అయినా ఈ స్వతంత్ర విమర్శ వల్ల కొన్ని ప్రయోజనాలు లేకపోలేదు. ఒక కవి పూర్వ సంప్రదాయాల్ని తిరస్కరించి కొత్త రచన చేయవచ్చు అనుకుందాం. అలాంటప్పుడు అలంకారిక నియమానుసారంగా ఆ గ్రంథాన్ని సమీక్షించి, తదను గుణమైన నియమాలందులో లేవనే పాకుతో అది మంచి గ్రంథం కాదని పరిహసించడం సమంజసం కాదు. గ్రంథకర్త యొక్క దేశం, కాలం, సంస్కారం మొదలైన అంశాల్ని పరిశోధించి విమర్శించాలి. కవి ఏ సాహితీ ప్రక్రియ నాధారంగా కావ్యాన్ని రాశాడో ఆ ప్రక్రియా పరిశోధన విమర్శకునికి అవసరం. కవి ఆ ప్రక్రియానుసరణంలో వున్న లోపాల్ని మాత్రం ఖచ్చితంగా చెప్పొచ్చు. ఇలాంటి విషయాల్లోనే స్వతంత్ర విమర్శ ప్రశస్తమైందిగా కనిపిస్తుంది. కానీ ఈ మార్గం కూడా సార్వత్రికం కాదని, సర్వ సాధారణంగా అలంకారిక మార్గమే అనుసరణీయమని కె.వి.ఆర్. నరసింహంగారి అభిప్రాయం.

ఒక మనిషి తన జీవిత విధానంలో ఏదో ఒక ప్రమాణాన్ని (సిద్ధాంతాన్ని) అంగీకరించి, దాని పరిధిలో జీవించడం కద్దు. కాబట్టి సాహితీ విషయంలో కూడా అలాంటి ఖచ్చితంగా వుండి తీరుతుంది. అందులోనూ అలంకారికులు కూడా తమ కాలాల్లోని గ్రంథాల్ని పరిశోధించి వాటి అధ్యయనానికి కొన్ని నియమాల్ని ఏర్పరచుకున్నారు. విశృంఖలంగా ఎవరికి తోచిన రీతిగా వాళ్ళు వ్యవహరింపలేదు. కాబట్టి గ్రంథ అధ్యయనానికి అలంకారిక నియమాలూ, స్వతంత్ర నియమాలు రెండూ ఆవశ్యకాలే. గ్రంథ స్వభావాన్ని బట్టి వాటి అధ్యయనానికి అవలంభించవలసిన మార్గాన్ని ఎన్నుకోవడం సరియైన పద్ధతి.

**కాబట్టి ఈ అలంకారిక స్వతంత్ర విమర్శల్ని సూక్ష్మంగా ఆధునిక విమర్శను క్రింది భాగాలుగా చేసుకోవచ్చు.**

1. నైతిక విమర్శ (The Moral approach literature and moral ideals)
2. మనస్తత్వ విమర్శ (The Psychological approach literature in the light of psychological theam)
3. సాంఘిక విమర్శ (The Sociological approach, literature and social ideals)

4. కళాత్మక విమర్శ (The Formalistic approach, literature as aesthetic structure)

5. పౌరాణిక విమర్శ (The Archetyspol approach, literature in the light of myth)

ఈ విమర్శ పద్ధతులన్నీ శాస్త్రం లేక గ్రంథ అధ్యయన సౌలభ్యం కోసం చెప్పబడినవే కానీ వీటిలో ఒకదానికొకదానికి పరస్పర సంబంధాలు గానీ, ప్రత్యేకతలు గానీ లేవు. విమర్శకులు పై వాటిలోని ఐదింటిని గానీ లేదా కొన్ని మార్గాల్ని కానీ అనుసరింపవచ్చు. కాకపోతే సమగ్రమైన విమర్శలో ఐదు మార్గాలు ఖచ్చితంగా వాటి ప్రాధాన్యాన్ని బట్టి దర్శనమిస్తూనే ఉంటాయి. వాటిని గూర్చి తెలుసుకుందాం.

**6.4.1. నైతిక విమర్శ:**

నైతికమైన ఆదర్శాల్ని ఆధారం చేసుకొని సాహిత్యాన్ని విమర్శిస్తే అది నైతిక విమర్శ అవుతుంది. జీవితంలో మానవుడు ఏయే అంశాల్ని ఉత్తమోత్తమంగా ప్రధానంగా భావిస్తాడో ఆ అంశాలు ఇందులో ఉంటాయి. ప్రాచీన కాలంలో "ప్లేటో, హురేస్, సర్ ఫిలిప్ సిడ్నీ, రస్కిన్, జాన్సన్ మొదలగు పాశ్చాత్య విమర్శకులు ఈ మార్గాన్ని అవలంభించినారు. ఆధునికుల్లో టాల్‌స్టాయ్, టి.యస్. ఇలియట్, మేథ్యూ ఆర్నాల్డ్ మొదలగు వారి పద్ధతిని అనుసరించారు. భారతీయ అలంకారికులు నైతిక దృక్పథాన్ని అభిమానించారు. కాబట్టి ముమ్మటుడు మొదలగువారు నైతిక విమర్శకు ఎక్కువ ప్రాధాన్యాన్ని ఇచ్చారనిపిస్తోంది. "పుణ్య శ్లోకస్య చరిత ముదాహరణ మర్హతి" అనే వ్యాకరణ వ్యాకం కూడా ప్రాచీనులకు ఉన్న నైతిక దృష్టికి ఉదాహరణ.

ఒక గ్రంథంలో కవి వ్యక్తీకరించిన భావంలోని వస్తువును వీరు ప్రధానంగా గణిస్తారు. విషయ ప్రాధాన్యమున్న విమర్శ ఇది. వీరిని నవ్య మానవతా వాదులు (Neo- Humanists) అని కూడా అంటారు. Literature is a criticism of life అనే సాహిత్య నిర్వచనంలో మేథ్యూ ఆర్నాల్డ్ ఈ నైతిక విమర్శ పద్ధతినంతా సూత్రీకరించి యున్నాడని పండితుల ఊహ. నైతిక విమర్శకులు కవితా శిల్పానికి ప్రాధాన్యాన్ని ఇవ్వరు. భావ ప్రాధాన్యత. ఉన్నత జీవిత దృక్పథం, కవి వ్యక్తీకరించిన భావాల్లో మానవ జీవితంపై వాటి ప్రభావం, ఆ భావాలు మనిషిని ఉన్నత పథానికి తీసుకొని పోతుందా? లేదా నైతికంగా దిగజారుస్తుందా? అనే ప్రశ్నలకు వీళ్ళు ఆ కావ్యంలో సమాధానాల్ని ఆశిస్తారు. జీవితంలోని నైతిక విలువలే వీరికి ప్రధాన లక్ష్యం. మానవునికి నైతిక విలువలతో పాటు హేతువాద పరమైన బుద్ధి వుంటుంది. ఈ రెండూ మానవునికి, మృగానికి గల భేదాన్ని నిరూపిస్తాయి. మానవునకు స్వాతంత్ర్య విషయంలో విశృంఖలత్వాన్ని వీరు ఖండిస్తారు. పాశవిక ప్రవృత్తుల్ని మానవునికనుగుణంగా మలచుకోవలసిన ఆవశ్యకత మానవునికుంది అని వీరి భావన. మానవతా వాదానికి క్రమ స్థితి క్రమశిక్షణ, సంయమనం అనేవి ముఖ్య ధర్మాలు, కావ్యం ఖచ్చితంగా ఈ మూడు ధర్మాల్ని వ్యక్తీకరించాలి. ఇది నైతిక విమర్శవాదుల సిద్ధాంతం.

ఒక గ్రంథాన్ని సాహిత్యంలో దాని స్థానాన్ని నిర్ణయించడానికి దాని సాహితీ ప్రమాణాలు సమర్థనీయాలే. కానీ ఒక మహా కావ్యాన్ని సాహితీ ప్రమాణాల ఆధారంగానే కాకుండా దానికున్న నైతిక ప్రమాణాలను ఆధారంగా తీసుకున్నపుడే సాహిత్య విమర్శ సంపూర్ణమౌతుందని T.S. ఇలియట్ అభిప్రాయం. "Literary Criticism should be completed by criticism from a difinite ethical and theological stant print" – (Religion and literature - by T.S. Eliat)

ఇరవయ్యవ శతాబ్దంలో పాల్ ఎల్‌మార్ (Paul Elmar More) నైతిక విమర్శకు ఆచార్యుడు. ఇతడు అమెరికా నివాసి ఇర్వింగ్ బాబిట్ (Irving Babbit) కూడా ఇతనినే అనుసరించాడు. పాల్ ఎల్‌మార్ నైతిక విలువలకు మతానికి

ముడిపెడితే, మత నిరపేక్షమైన నీతి ఉపదేశానికి బాబిట్ ప్రాధాన్యాన్ని ఇచ్చాడు. ప్రకృతి కాల్పనిక వాదుల్ని వీరిద్దరూ ఖండించారు. సాహిత్యంలో మానవతావాదాన్ని చొప్పించాలని వీరి ప్రయత్నం. కానీ ఇది తర్వాత మత సంబంధమైన మానవతా వాదంగా రూపాంతరం చెందింది. వీరి నిరపేక్షమైన మానవతా వాదాన్ని T.S. ఇలియట్ నిరసించి కేవలం నైతిక వాదాన్ని పరాకాష్ఠకు తీసుకొనిపోయాడు.

"A Poetry of revolt against moral ideas, is a poetry revolt against life. A poetry of indifference towards moral ideas is a poetry of indifference towards life" అనేది T.S. ఇలియట్ అభిప్రాయం.

**6.4.2. మనస్తత్వ విమర్శ:**

ఆధునిక యుగంలో మనస్తత్వ శాస్త్రం చాలా విధాలుగా అభివృద్ధి పొందింది. సిగ్మండ్ ఫ్రాయిడ్, సి.జె. యూంగ్, అడ్లర్ దీనికి ముఖ్యులు. ప్రకృతి లేక స్వాభావిక వాదం మానవుని అస్వతంత్రునిగా, బాహ్య పరిస్థితులకు పాశవిక ప్రవృత్తులకు దాసుడిగా, వారసుడిగా చిత్రిస్తుంది. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన సిద్ధాంతాలు స్వాభావిక వాదానికి శాస్త్రీయమైన పరిభాషను కల్పించాయి. ఇతని సిద్ధాంతం ప్రకారం మానవుడు మానసిక రుజాగ్రస్థుడే కానీ దుష్టుడు కాడు. ప్రకృతి సిద్ధాలైన పాశవిక ప్రవత్తులతో మోసగింపబడిన మానవుడు దోషి కాడని ప్రకృతి వాదుల సిద్ధాంతం. మనస్తత్వ శాస్త్రం స్వయం వ్యక్తమైన కామ ప్రవృత్తినే కాక విపరీత మార్గంలో వ్యక్తమయ్యే కామ ప్రవృత్తిని కూడా సమర్థిస్తుంది. ఈ చిత్త వైపరీత్యానికి అవ్యక్తి చైతన్య ప్రభావమే కారణమని మానసిక శాస్త్రవేత్తల అభిప్రాయం. విమర్శకులు చాలా మంది ప్రాచీన గ్రంథాల్లోని పాత్రల మనోధర్మ వైపరీత్యాల్ని ఫ్రాయిడ్ సిద్ధాంతాలతోనే సమన్వయించారు. హామ్లెట్ మనస్తత్వాన్ని ఫ్రాయిడ్ ప్రతిపాదించిన "Oedipus complex" సిద్ధాంతాన్ననుసరించి డా॥ ఎర్నెస్ట్ జోన్స్ మొదలగు విద్వాంసులు వ్యాఖ్యానించారు. అడ్లర్ Inferiority complex, యూంగ్ పండితుని Collective unconcious అనే సిద్ధాంతాలు నవ్య సాహితీవేత్తల్ని ప్రభావితం చేశాయి. The principals of literary criticism అనే గ్రంథంలో I.A. Richard అనే విమర్శకుడు మనస్తత్వ శాస్త్రం ఆధారంగా విమర్శ చేయడం సముచితమని అత్యావశ్యకమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీని వల్ల మూడు లాభాలున్నాయి.

1. సృజనాత్మకమైన కళా విధానాన్ని వివరించడానికి మంచి భాష ఇందులో లభిస్తుంది.
2. కవి జీవితానికి అతని గ్రంథానికి గల సంబంధం తెలుస్తుంది. రుజాగ్రస్థునికి అతని స్వప్నాలకు ఎలాంటి సంబంధముంటుందో అలాంటి సంబంధమే కళాకారునికి కళకు వుంటుందని, ఆ కళను బట్టి కళాకారుని మనస్తత్వాన్ని తెలుసుకోవడానికి ఇందులో అవకాశముందని మనస్తత్వ శాస్త్రజ్ఞుల అభిప్రాయం.
3. ఈ మనస్తత్వ విజ్ఞానాన్ని ఆధారం చేసుకొని కల్పిత పాత్రల (Fictitions characters) మనస్తత్వాన్ని వివరించవచ్చుని వీరి అభిప్రాయం.

మరో విశేషమేమంటే సాహిత్య జగత్తుకు, స్వప్న జగత్తుకు భేదముంది కాబట్టి మనస్తత్వ శాస్త్ర సిద్ధాంతాలననుసరించి చేసే విమర్శ అంత నిర్దుష్టం కాదని పండితుల అభిప్రాయం. ఎందుకంటే సుప్తావస్థలో నున్న మానవునికి స్వప్న విషయాలు తన ఆధీనంలో వుండవు. సాహిత్యం అలాంటిది కాదు. కవికి తను సృష్టించే రచనపై సంపూర్ణాధికారం వుంటుంది. కవి తన కావ్యంలోని పాత్రల్ని ఇష్టం వచ్చినట్లు మలచగలడు. కావ్య జగత్తు కవి ఆధీనంలో వుంటుంది. దీన్ని ప్రధాన భేదంగా పరిగణించవలసిన అవసరం వుంది.

**6.4.3. సాంఘిక విమర్శ:**

దేశ కాల సంఘం పరిస్థితులు, అవి కవిపై చూపే ప్రభావాన్ని వివరించడాన్నే సాంఘిక విమర్శ అనవచ్చు. కవి ఎంతటి స్వతంత్ర బుద్ధివున్న వాడైనా, ఎంతటి వ్యక్తిత్వం వున్న వాడైనా దేశ కాల పరిస్థితుల ప్రభావం అతనిపై తప్పక ఉంటుంది. కవి గానీ, కళాకారుడు గానీ ఆకస్మికంగా ఆకాశం నుండి ఊడిపడడు గదా! వాళ్ళూ సంఘ జీవులే. కాబట్టి అతడు పుట్టి పెరిగిన సమాజ వాతావరణం తప్పక అతని రచనల్లో ప్రతిఫలిస్తుంది. అవి ఒక చోట స్పష్టా స్పష్టంగానూ, ప్రత్యక్ష పరోక్షంగానూ కవి రచనపై ప్రభావాన్ని చూపుతాయి.

ఈ విమర్శకు ఫ్రాన్సు దేశస్థుడైన టియిన్ (Taine) ప్రథముడు "Literature with consequence of the moment the race and the melieu" కాలం, సంఘం, పరిసరాలు వాటి ఫలమే వాఙ్మయం అనేది ఇతని సిద్ధాంతం. టియిన్ చెప్పిన పై మూడు అంశాలను ఉత్పత్తి విధానం (Methods of Production) అనే నాల్గవ అంశాన్ని మార్క్స్. ఏంగెల్స్‌లు చేర్చడం వలన ఒక విశిష్టమైన సాంఘిక విధానం ఉత్పన్నమైందని పండితుల అభిప్రాయం. దీన్నే Marxist criticism (మార్క్సిస్ట్ విమర్శ) అని కూడా అంటారు. దీనికి ప్రాతిపదిక గతితార్కిక భౌతిక వాదం.

ఈ వాదం కూడా నిర్దిష్టమవడానికి వీలు లేదు. దేశ కాలాదుల ప్రభావం కవిపై వుండడమనేది వాస్తవమే. కానీ ఆ దేశ కాలాదులపై తమ ప్రభావాన్ని చూపిన కవులు కూడా వున్నారని Harry levin ఇలా అంటాడు. "The relations between literature and society are reciprocal literature is not only the effect of social causes. It is also the cause of social effects". సాహిత్యానికి సమాజానికి ఎప్పుడూ అవినాభావ సంబంధముంటుంది. కాబట్టి ఆ సమాజంలో సాంఘిక, అసాంఘిక అంశాలన్నీ సాహిత్యంలో వస్తు రూపాలౌతాయి.

**6.4.4. కళా విమర్శ:**

కళా విమర్శకు Aesthetic criticism, ontological criticism, Textual criticism, New Criticism అనే పేర్లున్నాయి. ఆధునిక కాలంలో దీనికి మిక్కిలి ప్రాచుర్యం వుంది. కళను కళా దృష్టితోనే విమర్శించాలి గానీ మత, సాంఘిక, రాజకీయ నైతిక భావ వ్యక్తీకరణ సాధనంగా పరిగణించి విమర్శించకూడదని ఈ కళా విమర్శకుల అభిప్రాయం. నవ్య మనవతావాదుల నైతిక దృష్టిని వీరు ఆదరించారు. సాహిత్యానికి సంబంధించిన పూర్వ సంప్రదాయాలను గానీ, కవి జీవిత విశేషాలను గానీ వీరు తీసుకోరు. కావ్య విమర్శకు అవి అనవసరాలని వీరి అభిప్రాయం. కవి ఆత్మీయతకు కావ్యానికి సంబంధం కొలబద్ధ కాదని వీరి సిద్ధాంతం. కవి జీవిత విశేషాలు కావ్యంలో ప్రతిబింబించినా అవి యధాతథాలుగా వ్యక్తం కావని, ఆ ప్రక్రియా సంబంధమైన సంప్రదాయాల్ని బట్టి అవి మారుతుంటాయని వీరి అభిప్రాయం.

కావ్యంలో కవి ప్రతిపాదించిన జీవితం యదార్థానుభవం (Truth to experience) పై ఆధారపడి, పొందిక (Coherence) పరిపక్వత (Maturity) కలిగి వుండాలని అలాంటి కావ్యాన్నే విమర్శకుడు మంచి కావ్యంగా పరిగణించాలని T.S. ఇలియట్ లాంటి పండితుల అభిమతం. కావ్యంలో కవి ప్రతిపాదించిన జీవితం విమర్శకు అనుగుణంగా వుండాలనేది వీరి ప్రతిపాదన. కానీ కళా విమర్శకులు దీన్ని విపరీతమైన స్థితిగా భావించారు. కవితా ప్రపంచంలో కవిదే అగ్ర స్థానం. విమర్శకునిది ద్వితీయ స్థానం. కాబట్టి విమర్శకుని అభిరుచికి అనుగుణంగా కవి కావ్య రచన చేయాలనడమే విపరీత సిద్ధాంతమని వీరి వాదం. 'పొందిక' (Coherence) అనే లక్షణం కళకే కాదు హేతువాదానికి కూడా అన్వయించుకోవచ్చు. పరిపక్వత అనేది మనస్సుకు సంబంధించిన లక్షణం. ఈ పరిపక్వతా విషయంలో భిన్నాభిప్రాయాలుండవచ్చు. అనుభవ

విషయం కళా నిర్మాణానికి సంబంధించింది కాదు. ఇది కళా నిర్మాణానికి పూర్వమందున్న విషయాల్ని సమీక్షిస్తుంది. ఇది కేవలం కళను వాస్తవికతతో సరిపోల్చి చూసే ప్రయత్నమే.

కళా విమర్శ స్వరూప స్వభావాల్ని గూర్చి కె.వి.ఆర్. నరసింహంగారు “Theory and Literature” అనే గ్రంథం ఆధారంగా ఇలా వివరించారు. “పాఠకుని కవితానుభవానికి కావ్యమొక కారణం లేదా సంభావ్య కారణం” అంతేకాదు పాఠకానుభూతిని ఆది ఒక నిర్ణీత సుసంఘటిత మార్గంలో అదుపులో వుంచుతుంది. కాబట్టే ఆ అనుభూతిని కావ్యానుభవంగా వర్ణించడం సముచితంగా వుంది. దీన్నే కావ్య సమీక్ష అంటారు. కావ్య నిర్మాణంలో కళాత్మకంగా (సౌందర్యపరంగా) విలువగల గుణాలుంటాయి, సంబంధాలుంటాయి. సమర్థుడైన పాఠకుడు మాత్రమే వాటిని తెలుసు కోగలగుతారు. నిర్మాణాత్మకంగా సౌందర్య సంపాదకాలైన ఏయే గుణాలు, ఏయే సంబంధాలు కావ్యంలో సముపస్థితాలై వుంటాయో, ఆ గుణాలు, ఆ సంబంధాలు, ఆ అనుభవాలు, సంపూర్ణావగాహన కావ్య సమీక్ష అనబడుతుంది. ఇది కళా విమర్శకుల సిద్ధాంతం.

అంతర విశ్లేషణాన్ని (Internal Analysis) మాత్రమే అపేక్షించే ఈ పద్ధతిలో నైతిక, ఆధ్యాత్మికాంశాలతో సంబంధం లేదు. కావ్య నిర్మాణానికి ప్రధాన కారణం, లేక మూల సూత్రమేది? దాని క్రమ స్థితికి గల కారణాలను కళా విమర్శకులు అన్వేషిస్తారు. వీరి దృష్టిలో ఆకృతి–విషయం (Form and Content) అనే కావ్యంలోని ద్వివిధాంశాల్ని వీరంగీకరింపరు. వీరి దృష్టిలో కావ్యానికి సర్వస్వం ఆకృతియే. విజయవంతమైన కళా నిర్మాణంలో కళా సంబంధమైన సామాగ్రి అంతా ఆకృతి నుంచే ఉద్భవిస్తుందని వీరి సిద్ధాంతం. ఉదాహరణకు ఒక నవలలోని సన్నివేశాలు కథా వస్తువులోని భాగాలే కాదా! ఆ సన్నివేశాల కూర్పు లేక ఏర్పాటు అన్నీ కూడా ఆకృతికి సంబంధించిన విషయాలే కదా! అని వీరి అభిప్రాయం.

వాస్తవంగా ఆలోచించినట్లయితే కవి కావ్యంలో సృష్టికి ప్రతి సృష్టియైన విషయాల్ని వర్ణించనూగలడు. వాటిని వెంటనే నాశనమూ చేయగలడు. అతనికి అవశ్యం కానిదేదీ లేదు. కాబట్టి మన భారతీయ అలంకారికులు కవికి బ్రహ్మత్వాన్ని ఆపాదించారు. కావ్య సృష్టిలో అతడు సర్వ స్వతంత్రుడు. కావ్యమంతా అతని అభిష్టానుసారంగానే నడుస్తుంది. ఆనంద వర్ధనుడు చెప్పిన శ్లోకంలో ఈ భావం వ్యక్తమౌతుంది. చూడండి.

**“అపారే కావ్య సంసారే కవిరేవ ప్రజాపతిః ।**

**యథా స్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే ॥**

**...............................................**

**వ్యవహార యతి యథేష్టం సుకవిః కావ్యే స్వతంత్ర తమా ॥**

**6.5.5. పౌరాణిక విమర్శ:**

‘Archetype’ అనే ఆంగ్ల పదానికి ‘మౌళిక రూపం’ లేక నమూనా (Original Modal) అని అర్థం. ఒక కళా నిర్మాణంలో గల మౌళిక సాంస్కృతిక రూపాన్ని (Basic Cultural Pattern) నిరూపించడానికి ఈ విమర్శ ప్రయత్నిస్తుంది. పురాణ గాథల ప్రభావం ప్రజలపై ఎక్కువగా వుండటం మూలన జేమ్స్, జాయిస్, వై.బి. ఈట్స్ మొదలగు ఆధునికులు పురాణ గాథలకు తీసుకొని మనోజ్ఞమైన రచనల్ని చేశారు. గిల్బర్ట్ ముర్రే (Gilbert Murray) పౌరాణిక విమర్శ పద్ధతిలో కావ్యాలను విమర్శించాడు. దీనిలోని ఒక్కొక్క అంశం ఒక్కొక్క విమర్శనా విధానంతో సంబంధముంది కాబట్టి విమర్శల్లో దీనికొక్క ప్రత్యేక స్థానముందనవచ్చు. కళా విమర్శకుల్లాగా ఈ విమర్శకు సూక్ష్మాతి సూక్ష్మమైన, సమగ్ర కావ్య పరిశీలన అవసరం. కానీ కేవల

కళా పరిశీలనా పరిధిలో నిబద్ధం కాదు. కళతో సంబంధం లేని ఇతర విషయాల్ని కూడా స్పృశిస్తుంది. కళా విషయంలో భావుకుని మనస్తత్వాన్ని పరిశీలిస్తుంది. కాబట్టి మనస్తత్వ విమర్శతోమా దీనికి సంబంధముంటుంది. సాంఘిక విమర్శలాగా ఇది మౌళిక సంస్కృతీ రూపాన్ని గూడా చర్చిస్తుంది. కానీ సాంఘిక విమర్శలోని రచయితలకూ. సంఘానికీ ఉన్న జన్య జనక సంబంధాన్ని మాత్రం ఉపేక్షిస్తుంది. సాంఘికంగా, సాంస్కృతికంగా ఒక జాతి పూర్వ స్థితిని మాత్రం ఈ పౌరాణిక విమర్శ పరిశీలిస్తుంది.

ఈ విమర్శకు సి.జె. యాంగ్ అనే మనస్తత్వకారుడు స్థాపించిన 'సామూహిక అవ్యక్త చేతన' (Collective unconscious) సిద్ధాంతం మూలాధార మానసిక విశ్లేషణను అనుసరించి చేతన మూడు విధాలు. 1) చేతన (Conscious) 2) పూర్వ చేతన (Pre-conscious) 3) అవ్యక్త చేతన (Unconscious). జాగ్రదావస్థలోని అనుభవాలన్నీ చేతనకు సంబంధించేవి. తాత్కాలికంగా మరచినా తలచుకున్న వెంటనే గుర్తుకు వచ్చేవి పూర్వచేతనా సంబంధాలు, ఆ వ్యక్త చేతనలోని విషయాలు వ్యక్తికి కూడా వ్యక్తం కానివి. ఇవి రెండు రకాలు. 1. వ్యక్తిగత అవ్యక్త చేతన, 2. సామూహిక అవ్యక్త చేతన. వ్యక్తిగత అవ్యక్త చేతనకంటే సామూహిక అవ్యక్త చేతన గొప్పది. మానవుడు తన అనుభవానికి సంబంధించిన విషయాలన్నీ వ్యక్తీకరింపలేడు. అప్పుడు వ్యక్తీకరించలేక అణగదొక్కబడిన భావాలన్నీ వ్యక్తిగత అవ్యక్త చేతనలోకి జారిపోతాయి. ఇవి వెంటనే స్మరణకు రావు. ఈ వ్యక్తిగత అవ్యక్త చేతనలోని చాలా పొరలు (Layers) వున్నాయని, దానిలోని పైపై పొరలకు సంబంధించినవి వ్యక్తిగత అవ్యక్త చేతనే అని-ఇంకా లోపలికి వ్యాపించి వుండేవి సామూహిక అవ్యక్త చేతన అని యూంగ్ అభిప్రాయం. సామూహిక అవ్యక్త చేతన ఒక జాతికి సంబంధించింది. అనాదిగా అనువంశికంగా వస్తున్న నిరుద్ధ భావాలకు ఇది ఆలవాలం. ఒక వ్యక్తిలోనే వ్యక్తిగత అవ్యక్త చేతన సామూహిక అవ్యక్త చేతన వుండొచ్చు. దానిలో పైపైన ఉండేది వ్యక్తిగత అవ్యక్త చేతన. లోపల అంతరాంతరాల్లో వుండేది సామూహిక అవ్యక్త చేతన. ఈ సామూహిక అవ్యక్త చేతన సమకూర్చే ప్రాచీనాలైన ఆలోచన రూపాలనే Archetype (మౌళిక రూపాలు) అని అంటారు. ఈ మౌళిక రూపాలనే ఈ పౌరాణిక విమర్శ వివరిస్తుంది. "The forms of archaic thought, provided by the collective unconscious, are Archetypes"- contemporary schools of psychology by Robert. S.Wood worth & Merry Sheehan.

**చేతన (Conscious)**

1. (వ్యక్త) చేతన (Conscious) 2. పూర్వ చేతన (Pre-Conscious) 3. అవ్యక్త చేతన (Un-Conscious)

వ్యక్తిగత అవ్యక్త చేతన సామూహిక అవ్యక్త చేతన

ఈ మౌళిక రూపాలు పురాణ గాథలు, జానపద గేయాలు స్వప్నాలు మొదలగువానిలో సంకేత రూపాల్లో (Symbols) వుంటాయి. సంకేతాలంటే-జీవిత ప్రయోజన సాధనకు సహజ ప్రవృత్తులు (Instincts) అవసరం. వీనికి శక్తిని లిబిడో (ప్రాణశక్తి) సమకూరుస్తుంది. తర్వాత మిగిలియున్న లిబిడో అవ్యక్త చేతనలో చేరుతుంది. కొంత కాలం అక్కడనే

వుండిన తర్వాత ఆ లిబిడో మౌళిక రూపాలకు ఆ ఉత్తేజాన్ని కల్పిస్తుంది. ఆ మౌళిక రూపాలు లిబిడో ప్రవాహ ప్రభావంతో అనేక విధాలుగా రూపాంతరం చెందుతాయి. అవి సంకేతాలు, రూపాంతరం పొందటానికి అవసరమైన సామాగ్రి వ్యక్త చేతనలోని అనుభవాల నుండి తీసుకోబడుతుంది. ఆ లిబిడో శక్తి ఈ రకంగా సంకేతాలుగా రూపాంతరం చెంది సంస్కృతి రూపాన్ని పొందుతుంది. కర్మ కాండలు, కథలు, పుక్కిటి పురాణాలు, జానపద గేయాలు, నాటకం మొదలగువన్ని ఈ రూపాంతరీకరణ ఫలితంగా ఏర్పడినవే. పురాణ గాథల్లో కనిపించే సంకేతాలు ఏ మౌళికాంశాలకు సంబంధించిన అంశాల్లో తెలుసుకోవడమే పౌరాణిక విమర్శ ప్రధాన లక్ష్యం.

యూంగ్ పండితుని సామూహిక అవ్యక్త చేతనలాగా ఫ్రేజర్ (Frazer) కూడా మానవ శాస్త్రంలో చేసిన పరిశోధన పౌరాణిక విమర్శపై ప్రభావాన్ని చూపింది. మానవ శాస్త్రాలలోని పరిణామ వాదాన్ని గూర్చి, వివిధ ప్రాంతాల్లోని మత వ్యవస్థల్ని గూర్చి 'The Golden bow' అనే గ్రంథాన్ని రాశాడు. ఇందులో ఇతిహాస యుగానికి ముందున్న (Pre historic age) పురాణ గాథల పుట్టుకను గూర్చి వివరించాడు. ఈ గ్రంథం చాలా మంది ఆధునిక విమర్శకులకు శిరోధార్యమైంది.

గిల్బర్ట్ ముర్రే (Gilbert Murray) అనే విమర్శకుడు గ్రీకు విషాద రూపాకాల్లోని ఓరెస్ట్ (Orest) అనే పాత్రకు షేక్స్పియర్ గారి 'హేమ్లెట్' పాత్రకు గల భేదాల్ని పరిశీలించి, ఈ రెండు పాత్రలు ఒకే మౌళిక రూపానికి సంకేతాలని నిరూపించాడు. కానీ ఈ రెండు పాత్రల్ని సృజించిన కవులు వేరు, భాష వేరు, వాళ్ళ ప్రాంతాలు వేరు. ఒక సంఘానికి, ఒక దేశానికి సంబంధించిన వాళ్ళూ కాదు. సంస్కృతి స్వభావాలలోనూ తేడా వుంది. రచనా విధానం, కథా ప్రణాళిక లోనూ భేదముంది. అయినా నిశితంగా పరిశీలిస్తే రెండు పాత్రలకూ కొంత సాదృశ్యం కనిపిస్తుందని పండితులు భావించారు. ఆ భేదం ఆ కథల ఆవిర్భావానికి, ఆ రెండు కథల మూల కథలకు సంబంధించింది. ఎలాగంటే కొన్ని వేల సంవత్సరాలకు పూర్వం ఆ రెండు కథలకు మూలమైన కథ ఆవిర్భవించి వుంటుందని ఆ నోటా ఈ నోటా పడి ఆ కథలు మార్పులకు గూడా లోనై యుండవచ్చు. ఆ కథల ఆధారంతో భిన్న కాలాల్లో భిన్న దేశాలకు చెందిన కవులు రూపకాలు రాశారు. వారి కల్పనల వల్ల గూడా కథలో మార్పులు వచ్చి వుండవచ్చు. ఇలా మార్పులకు లోనైన కథల ఆధారంగా మూలకథను నిరూపించడం కష్ట సాధ్యమే. ఈ పౌరాణిక విమర్శ అలాంటి అసాధ్యమైన కార్యాల్ని సుసాధ్యం చేయడానికి ప్రయత్నిస్తుంది. అంటే మౌళిక రూపాలు మానవ జాతికంతటికీ సమానమే. వాటికి దేశకాల భేదముండదు. కానీ సంకేత రూపంలో వెలువడ్డ పురాణ గాథలకు మార్పులు అనివార్యం.

పురాణగాథకు 'Forces in Modern British Literature' అన్న గ్రంథమిచ్చిన నిర్వచనమిది "A message from ourselves to ourselves, a secret language which enables us to treat inner as if outer event", 'పురాణ గాథ' అంటే మనకు మనమే పంపుకొనే సందేశం. అంతరంగా వున్న సన్నివేశాలు బాహ్యంగా చూడగలిగే శక్తినిచ్చే రహస్యమైన భాష అని అర్థం.

సాహిత్య గ్రంథాల్లోని రహస్య సాంకేతిక భాషను సుగమం చేసి, దానిలోని పరమార్థాన్ని వ్యక్తీకరించడానికి పౌరాణిక విమర్శ ప్రయత్నిస్తుందని అర్థం.

ఈ విమర్శ మార్గాన్ని పాశ్చాత్యులు కొందరు అంగీకరించరు. కొందరు నిరసించారు. పౌరాణిక విమర్శలోని రచనలు పాఠకులను ఆకర్షించడానికి గల కారణాల్ని మాత్రమే వివరిస్తాయని, సాహిత్య విలువలు నిరూపించలేవని కొందరి అభిప్రాయం.

అంతేగాక ఇందులో విమర్శకుని కల్పనా సామర్థ్యం వ్యక్తమౌతుందే కాని, సత్య స్వరూపం వ్యక్తం కాదని మరి కొందరి వాదం. అది విమర్శకుని వ్యక్తిత్వంపై ఆధారపడి ఉంటుందే కానీ ఈ విమర్శా మార్గంలో లోపం లేదనే వారూ వున్నారు.

## 6.5. ముగింపు:

మనం ఇంతవరకు అలంకారిక స్వతంత్ర విమర్శ పద్ధతుల్ని, వీటిలోని శాఖల్ని చర్చించుకున్నాం. ఈ విమర్శనా పద్ధతుల్లో ఒకదానితో ఒకదానికున్న సంబంధాన్ని కూడా కలిగి వుంటాయి. పౌరాణిక విమర్శ, ఒక్కొక్క అంశంలో అన్ని విమర్శనా పద్ధతులతోనూ సంబంధం ఉంటుందని తెలుసుకున్నాం. అలాగే చారిత్రక విమర్శ సాంఘిక విమర్శలోనే ఆవిర్భవిస్తుంది. చారిత్రక విమర్శ (ఉదాహరణకు ఒక కవి జీవిత చరిత్ర) మనస్తత్వ విమర్శతోనూ ఏకీభవిస్తుంది.

**విమర్శ లాభ నష్టాలు:**

సాహిత్య పఠనమంటే ఆ గ్రంథాలతో సజీవ సంబంధాన్ని కల్గి వుండటం, ఉదాహరణకు మహాభారతంలోని గుణగణాల్ని పరిశీలించాలంటే ఆ గ్రంథాన్ని ఖచ్చితంగా పఠించాలేగానీ దానిపై వచ్చిన విమర్శను కాదు. అలాంటప్పుడు విమర్శతో పనిలేదు గదా! అనే ప్రశ్న కూడా కలుగుతుంది. విమర్శ అన్న వెంటనే కాస్తో కూస్తో జ్ఞానమున్న ప్రతి ఒక్కరికీ కలిగే సందేహమిదే. ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాలంటే కొంత సూక్ష్మదృష్టి అవసరం. సాహిత్య పఠనంలో పాఠకునికి ఆ గ్రంథంతో ప్రత్యక్ష సంబంధమేనన్నది సర్వాంగీకారమే. కానీ ఒక గ్రంథాన్ని చదివిన వెంటనే పాఠకునికి ఆ గ్రంథంలోని లోతుపాతులు, మర్మాలు సమగ్రంగా అర్థం కావచ్చు, కాకపోవచ్చు. ఎందుకంటే ప్రతి పాఠకునికి అన్ని విషయాలు తప్పనిసరిగా అర్థం చేసుకోవాలనే నిబంధన లేదు కదా! మహా కవుల కావ్యాల్లో నిగూఢంగా నిక్షిప్తమైన అంశాలుండవచ్చు. అలాంటి కళా మర్మాలు అర్థం కావాలంటే కవితా కళామర్మజ్ఞుల సహాయం అవసరమై వుంటుంది. మేమే సర్వజ్ఞులమన్న భావన జిజ్ఞాసువులకు తగదు. కాబట్టి తమకు తెలియని విషయాలు ఇతరుల నుండి నేర్చుకోవడంలో తప్పులేదు. సద్విమర్శకునికి కవితా కళా మర్మాలపై (రహస్యాలు) అవగాహన, నిశిత పరిశీలనా దృష్టి వుంటుంది. సామాన్య పాఠకునికి అర్థం కాని విషయాలు అతనికి తెలిసే అవకాశముంది. అలాంటి సద్విమర్శకులు మార్గదర్శకంగా వుంటే సామాన్య పాఠకులకు సాహితీ పఠనం సులభ మౌతుంది. కాబట్టి విమర్శ వల్ల పాఠకులకు కలిగేది లాభమే కానీ నష్టం కాదు.

కవి హృదయాన్ని నిష్పాక్షికంగా వ్యక్తీకరించేది సద్విమర్శ. కవి హృదయాన్ని గ్రహించకుండా కావ్యానికి విపరీత అర్థాన్ని కల్పిస్తే అది దుర్విమర్శ. సద్విమర్శ వల్ల ఎంత ప్రయోజనముందో దుర్విమర్శ వల్ల అంత నష్టమూ ఉంది. ఒక విమర్శ గ్రంథాన్ని చదివిన పాఠకునికి మూలగ్రంథ పఠనం పట్ల ఆసక్తి పెరగాలి. సద్విమర్శ గ్రంథానికి సార్థకత ఇదే. అలాకాకుండా గ్రంథం పట్ల ఏహ్యాభావం పెరిగితే విమర్శ గ్రంథాలకు సార్థకత ఉండదు. విమర్శకులు–పాఠకులు ఈ విషయాల్ని ఖచ్చితంగా గుర్తుంచుకోవాలి.

## 6.6. నమూనా ప్రశ్నలు:

**లఘువ్యాస రూప ప్రశ్నలు:**

1) అలంకార విమర్శ

2) స్వతంత్ర విమర్శ

3) పౌరాణిక విమర్శ

4) చారిత్రక విమర్శ

**వ్యాసరూప ప్రశ్నలు:**

1) సాహిత్య విమర్శను విశ్లేషించి అలంకార స్వతంత్ర విమర్శల్ని వివరించండి?

2) అలంకార స్వతంత్ర విమర్శల్ని, వాటి పద్ధతుల్ని గూర్చి వ్రాయండి?

## 6.7. ఆధార గ్రంథాలు:


1) సాహిత్య దర్శనం – ఆచార్య కాకర్ల వెంకట రామ నరసింహం.

2) సాహిత్యం–విమర్శ – వడలి మందేశ్వరరావు.

3) అభ్యుదయ సాహిత్య విమర్శ (విశేష సంచిక) – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

4) సాహిత్య వ్యాసాలు – కొడవటిగంటి కుటుంబరావు.


**– డా॥ జి. బాలసుబ్రమణ్యం.**

## పాఠం - 7

# లలితకళలు

**7.0. ఉద్దేశ్యం:**

విద్యార్థికి కళల గురించి, లలిత కళల గురించి మరియు లలిత కళల్లో కవిత్వ స్థానం గురించి అవగాహన కలిగించటం.

**విషయ క్రమం:**


**7.1.** కళలు – నిర్వచనం

**7.2.** కళల – పుట్టుక

**7.3.** కళలు – విభజన

**7.3.1.** ఔపయోగిక కళలు

**7.3.2.** లలిత కళలు

**7.4.** లలితకళలు – విభజన

**7.4.1.** శ్రవ్య కళలు

**7.4.2.** దృశ్య కళలు

**7.4.3.** ఉభయకళ

**7.5.** లలితకళలు – లక్షణాలు

**7.5.1.** మనోహరత్వం

**7.5.2.** విశ్వజనీనత

**7.5.3.** అనుకరణం

**7.6.** లలితకళలు – ప్రాశస్త్యం

**7.6.1.** సంగీతం

**7.6.2.** కవిత్వం

**7.6.3.** చిత్రలేఖనం

**7.6.4.** శిల్పం

**7.6.5.** నాట్యం

**7.7.** లలితకళల్లో కవిత్వస్థానం

**7.7.1.** సౌందర్య చలనం

**7.7.2.** భౌతిక ద్రవ్యాపేక్ష

**7.7.3.** రూప చిత్రణ

**7.7.4.** చిత్త ధృతి కలిగించటం

## పాఠం - 9

# రస సంఖ్య విచారం

**విషయ క్రమం:**


9.1. పరిచయం

9.2. భరతుడు – రసాలు

9.3. దండి – రసాలు

9.4. భట్టోద్భటుడు – రసాలు

9.5. శాంతాన్ని రసంగా అంగీకరించిన ఆలంకారికులు

9.6. శాంతాన్ని రసంగా అంగీకరించని ఆలంకారికులు

9.7. శాంత రసం – ప్రముఖుల అభిప్రాయాలు

9.8. రుద్రటుడు – రసాలు

9.9. విశ్వనాథుడు – రసాలు

9.10. మధుసూదన సరస్వతి – భక్తి

9.11. రూపగోస్వామి – మధుర రసం

9.12. స్నేహం – మరికొందరి అభిప్రాయాలు

9.13. భోజుడు – రసాలు

9.14. భానుదత్తుడు – మాయారసం

9.15. రస సంఖ్యా విచారం – మరికొందరి అభిప్రాయాలు

9.16. నమూనా ప్రశ్నలు

9.17. ఆధార గ్రంథాలు


### 9.1. పరిచయం:

లోకంలో రసాలు 9 అనడం ప్రసిద్ధం. కాని భరతుడు 8 చెప్పాడని కొందరు, 9 చెప్పాడని మరికొందరు విపులంగా చర్చించారు. అసలు ఈ చర్చకు ప్రధాన కారణం శాంతం రసం అవునా? కాదా? అనేది.

### 9.2. భరతుడు – రసాలు:

**"శృంగార హాస్య కరుణా రౌద్రవీర భయానకాః**

**భీభత్సాద్భుత సంజ్ఞా చేత్యష్టౌనాట్యే రసాః స్మృతాః ॥"**

భరతుడు తన 'నాట్యశాస్త్రంలో 8 రసాల్ని మాత్రమే చెప్పాడు. అతడు శాంతాన్ని రసంగా చెప్పలేదు. భరతుని మతంలో శాంతం రసం కాదు.

## పాఠం - 12

# పురాణం, ఇతిహాసం, ప్రబంధం

**విషయ క్రమం:**

- **12.1.** పురాణం
- **12.2.** పురాణ సంఖ్య
- **12.3.** పురాణ లక్షణాలు
- **12.4.** తెలుగులో పురాణ సాహిత్యం
  - **12.4.1.** ఇతిహాసం
  - **12.4.2.** ఇతిహాస లక్షణాలు
- **12.5.** ప్రబంధం
- **12.6.** నమూనా ప్రశ్నలు
- **12.7.** ఆధార గ్రంథాలు

### 12.1. పురాణం:

దేవి భాగవతంలో "హైందవ సంస్కృతి అనే కల్పవృక్షానికి వేదాలు మూలమని, స్మృతులు శాఖలని, పురాణాలు పత్ర పుష్పాలని, ఇతిహాసాలు రసవంతమైన ఫలాలని; పరమేశ్వరుడికి శ్రుతి స్మృతులు నేత్రద్వయమని, పురాణం హృదయమని" చెప్పబడింది. వేద హృదయాన్ని విప్పి చెప్పేవి పురాణాలనుకోవచ్చు. అధర్వణ వేదంలో పురాణ శబ్దం ప్రాచీన కథ, పూర్వ కథ అనే అర్థంలో వ్యవహరించబడింది. శతపథ బ్రాహ్మణంలో, ఉపనిషత్తులలో కూడా ప్రాచీన గాథలు వర్ణించేవిగా పురాణాలు పేర్కోబడ్డాయి.

**నిర్వచనం:**

"పురాభవమితి పురాణమ్" (ప్రాచీన కాలములో పుట్టినవి) అని శబ్ద కల్పద్రుమంలో, "పురాపూర్వస్మిన్ భూతమితి పురాణమ్" (ప్రాచీన విషయాలను తమలో పొందుపరుచుకొన్నవి) అని అమరకోశంలో, "పురానీయతే ఇతి పురాణమ్" (పురాణ విషయాలలో జీవించేవి) అని వాచస్పతంలో, "పురానవం భవతి పురాణమ్" (ప్రాక్తన విషయాభిరతి కలిగినవి) అని యాస్క నిరుక్తంలో, "పురా + అనక్తి" (పురాతన వస్తు కల్పకాలు) అని బ్రహ్మాండ పురాణంలో, "పురాపి నవమ్ పురాణమ్" (పురాతనములయిన నవ్యాలుగా ఉండేవి) అని భవిష్య పురాణంలో పురాణ శబ్దం నిర్వచించబడింది.

పింగళి లక్ష్మీకాంతంగారు "అలౌకికములును అద్భుతములును అయిన భగవల్లీలా కథనములతో నిండినది పురాణం" అని తమ రేడియో ప్రసంగాలలో తెలిపారు. వేదాలలో అంతగా చెప్పబడని అవతారాల ప్రసక్తి, భగవన్మహిమలు, భగవదారాధనం వంటివి పురాణాలలో చెప్పబడ్డాయి.

### 12.2. పురాణ సంఖ్య:

మొత్తం పురాణాలు పద్దెనిమిది. పురాణాలను తేలికగా గుర్తించుకోవటానికి పద్మ పురాణంలో ఒక సూత్రం ఉంది.

అది 'మ' ద్వయం 'భ' ద్వయం చైవ 'బ్ర' త్రయం 'వ' చతుష్టయం 'అ' 'నా' 'ప' 'లింగ' 'కూ' 'స్కా' ని పురాణాని పృథక్ పృథక్' అంటే పురాణాల పేర్లననుసరించి 'మ' తో మొదలయ్యేవి రెండు – మత్స్య, మార్కండేయ పురాణాలు. 'భ' తో ప్రారంభమయ్యేవి రెండు – భాగవత, భవిష్య పురాణాలు 'బ్ర'తో ప్రారంభమయ్యేవి మూడు – బ్రహ్మ, బ్రహ్మ వైవర్త, బ్రహ్మాండ పురాణాలు. 'వ' తో మొదలయ్యేవి నాలుగు – వరాహ, వామన, వాయు, విష్ణు పురాణాలు, 'అ' తో ప్రారంభమయ్యేది అగ్ని పురాణం, 'నా' తో ప్రారంభమయ్యేది నారద పురాణం, 'ప' తో మొదలయ్యేది పద్మపురాణం', 'లింగ' తో లింగపురాణం, 'కూ' తో కూర్మ పురాణం, 'సా' తో స్కాంద పురాణం ప్రారంభమవుతాయి.

ఈ పురాణాలను వ్యాసుడు రచించగా నైమిశారణ్యంలో సూతమహర్షి శౌనకాది మునులకు చెప్పాడు. పద్దెనిమిది పురాణాలను శ్రీమహావిష్ణువు శరీరభాగాలతో పోలుస్తారు.

**1. బ్రహ్మ పురాణం:**

ఇది శ్రీ మహావిష్ణువు శిరస్సుగా భావించబడింది. దీనిలో చతుర్విధ పురుషార్థాలను మానవులు ఎలా సాధించాలో తెలిపే అనేక ఆఖ్యానాలు, ఉపాఖ్యానాలు చెప్పబడ్డాయి. దీనిలో పదివేల శ్లోకాలు, రెండు వందల నలభై ఆరు అధ్యాయాలున్నాయి. హరిశ్చంద్రుడు, సగరుడు, కార్త వీర్యార్జునుడు వంటి చక్రవర్తుల గురించి దధీచి, అత్రేయుడు, మార్కండేయుడు వంటి ఋషుల గురించి చెప్పబడింది. సప్తద్వీపాల వర్ణన, పూరీ జగన్నాథ మహాత్మ్యం, క్షీర సాగర మథనం, ఇంద్రద్యుమ్ముని చరిత్ర, అప్సరసలు శాపవశాన నదులుగా జన్మించడం, నక్షత్రాల జన్మ వృత్తాంతం, గాయత్రీ మంత్ర మహాత్మ్యం వివరించబడింది. స్త్రీ హత్య, గోహత్య, బ్రహ్మహత్య, బంగారం దొంగిలించడం మహా పాపాలుగా ఈ పురాణంలో చెప్పబడింది.

**2. పద్మ పురాణం:**

ఇది శ్రీ మహా విష్ణువు హృదయంగా భావించబడింది. దీనిలో సృష్టి ఖండం, భూఖండం, స్వర్గఖండం, పాతాళ ఖండం, ఉత్తర ఖండం అనే ఐదు ఖండాలున్నాయి. దీనిలో 641 అధ్యాయాలు, 55000 శ్లోకాలు ఉన్నాయి. భారతదేశంలోని నదుల వర్ణన, పర్వతాల వర్ణన, కార్తీక మాస ప్రాశస్త్యం, దీపావళి మహాత్మ్యం, పాంచభౌతిక వర్ణన, వృత్రాసుర, తారకాసుర వృత్తాంతం, శ్రీమద్రామయం కథలు గంగ, నర్మద మహాత్మ్యాలు, శని గ్రహ పీడా నివారణ మార్గాలు, మధుకైటభ వృత్తాంతం, పద్మ గంధి చరిత్ర, చంద్రవంశ వర్ణన, కాల పరిణామ క్రమ వివరణ, కలియుగ ధర్మాలు, కలియుగంలో స్త్రీ పురుష స్వభావాలు చెప్పబడ్డాయి. ఉసిరి, తులసిల గురించి రాయబడింది. ఉసిరితో భోజనం చేస్తే ఆయుస్సు పెరుగుతుందని, తులసి ఆయురారోగ్యాలను అందిస్తుందని చెప్పబడింది.

**3. విష్ణు పురాణం:**

ఇది శ్రీ మహావిష్ణువు కుడి భుజంగా భావించబడింది. దీనిలో 20 అధ్యాయాలు, 23000 శ్లోకాలు ఉన్నాయి. ఇందులో జడభరతుడి వృతాంతం, సనకసనందాదుల వృత్తాంతం, మనువు, యయాతి, పరాశరుడు, మాంధాత, శని, యముడు, అశ్వినీ దేవతల గురించి, హిరణ్యాక్ష వధ, నవగ్రహాలు సంచరించే విధానం, కలి పురుషుడి లక్షణాలు, వ్యాసుడు వేదాలను విభజించిన తీరు, 24 తత్త్వాల వివరణ గలవు. విష్ణువుకి శివుడికి భేదం లేదని చెప్పబడింది. కలియుగ లక్షణాలు వివరించబడ్డాయి.

**4. వాయు పురాణం:**

ఇది విష్ణువు ఎడమ భుజంగా భావించబడింది. పరమశివుడి కొరకు వాయువు చెప్పిన పురాణమిది. ఈ పురాణంలో

ప్రక్రియపాదం, అనుసంగపాదం, ఉపోద్ఘాత పాదం, ఉపసంహార పాదం ఉన్నాయి. దీనిలో మొత్తం 24000 శ్లోకాలుండగా 11000 శ్లోకాలు మాత్రమే లభ్యమవుతున్నాయి. ఇది శివుడి గురించి అయినా ఇందులో విష్ణువు గురించి కూడా చెప్పబడింది. ఋషుల లక్షణాలు, శ్రార్ధ ప్రక్రియ, కైలాస పర్వత వర్ణన, భూగోళానికి, ఖగోళానికి సంబంధించిన అంశాలు, బ్రహ్మాండ రచన, గయక్షేత్ర మహాత్త్యం, శివ మాస పూజా పద్ధతి, జప విధులు, యోగ సిద్ధులు ప్రాణాయామాలలో ఆచరించే విధానాలు, ఉప మన్యువు చరిత్ర, శ్రీకృష్ణుడు శివుడి కొరకు తపస్సు చేయడం, ఓంకారం గొప్పతనం గురించి దీనిలో చెప్పబడింది

**5. భాగవత పురాణం:**

ఇది మహా విష్ణువు ఊరు భాగంగా చెప్పబడింది. దీనిలో 12 స్కంధాలు, 18000 శ్లోకాలున్నాయి. శ్రీ మహావిష్ణువు అవతారాలు, లీలలు ఉన్నాయి. ప్రథమ స్కంధంలో భగవంతుడి కథలు వినడం, చెప్పడం వల్ల కలిగే ఫలితాలు, నారదుడి జన్మవృత్తాంతం, పాండవుల చరిత్ర, పరీక్షిత్తు కథ ఉన్నాయి. ద్వితీయ స్కంధంలో నారాయణుడి విరాట్ స్వరూప వర్ణన, బ్రహ్మాండ వర్ణన, భగవంతుడి అవతారాల వర్ణన ఉన్నాయి. తృతీయ స్కంధంలో విధాత జననం, సృష్టి రహస్యం, వైకుంఠలోక వర్ణన, హిరణ్యాక్ష హిరణ్యకశిపుల జన్మవృత్తాంతం, మాతృగర్భంలో జీవోత్పత్తి, మానవుల ఆయుః ప్రమాణం గురించి చెప్పబడింది. చతుర్థ స్కంధంలో దక్ష యజ్ఞ ధ్వంసం, ఋదు చక్రవర్తి, ధృవుడు, పురంజనుడు, సనత్ కుమారుడు, రుద్రగీత గురించి చెప్పబడింది. పంచమ స్కంధంలో ప్రియవ్రతుడు, అగ్నీధ్రుడు, భరతుడు, జడ భరతుడు మొదలైన చరిత్రలు చెప్పబడ్డాయి. అధోలోక నరకాల వర్ణనలున్నాయి. షష్ఠ స్కంధంలో అజమిలోపాఖ్యానం, దక్షుడు, దధీచి మహర్షి, చిత్రకేతుడు, మరుద్గణం, వృత్తాసుర సంహారం గురించి రాయబడ్డాయి.

సప్తమ స్కంధంలో ప్రహ్లాద చరిత్ర, త్రిపురాసుర చరిత్ర ఉన్నాయి. అష్టమ స్కంధంలో క్షీరసాగర మధనం, గజేంద్ర మోక్షం, బలి చక్రవర్తి కథ, వామన మత్స్య అవతారాల గురించి చెప్పబడింది. నవమ స్కంధంలో సుకన్య, నా భాగుడు, హరిశ్చంద్రుడు, మాంధాత, సగరుడు, దుశ్యంతుడు, ఇక్ష్వాక యదు పురు వంశాల వర్ణన, అంబరీషోపాఖ్యానం ఉన్నాయి. దశమస్కంధంలో శ్రీకృష్ణుడి జన్మవృత్తాంతం, కృష్ణుడి లీలలు, రాస క్రీడలు, కంస వధ, రుక్మిణీ కల్యాణం, పౌండ్రక వాసుదేవుడి కథ, కుచేలోపాఖ్యానం చెప్పబడ్డాయి. ఏకాదశ స్కంధంలో అష్టాదశ సిద్ధులు, అష్టాంగ యోగ నియమాలు, సాధుపురుషుల లక్షణాలు వివరించబడ్డాయి. ద్వాదశ స్కంధంలో మార్కండేయ మహర్షి చరిత్ర, కల్కి అవతారం, కలియుగ రాజ వంశ వర్ణనలు చెప్పబడ్డాయి.

**6. నారద పురాణం:**

ఈ పురాణం మహావిష్ణువు నాభిగా భావించబడింది. దీనిలో పూర్వ ఖండం, ఉత్తర ఖండం అనే రెండు భాగాలున్నాయి. దీనిలో 207 అధ్యాయాలు, 25,000 శ్లోకాలున్నాయి. భక్తి విశిష్టత, అన్నదాన మహాత్త్యం, శివ ధనుస్సు కథ, సాక్షి గోపాలుడి కథ, నీల చక్రమణి వృత్తాంతం, దాసరి కథ, నృసింహ, హయగ్రీవ, రాధ మంత్రోపాసన విధానం, హనుమత్కవచం, కార్తవీర్యార్జున కవచం వివరించబడ్డాయి.

**7. మార్కండేయ పురాణం:**

ఇది విష్ణువు కుడి పాదంగా భావించబడింది. దీనిలో 134 అధ్యాయాలు, 9,000 శ్లోకాలు ఉన్నాయి. మునుల సందేహాలను తీర్చడం కోసం మార్కండేయ మహర్షి చెప్పింది ఈ పురాణం. దత్తాత్రేయ మహాత్త్యం, కువలయాశ్వుడి చరిత్ర,

జంబుద్వీప వర్ణన, బలరాముడి తీర్థయాత్రలు, మహారౌరవాది నరకం, ఓంకార మహత్యం, గృహస్థాశ్రమ ధర్మం, ధర్మ పక్షుల కథ, కరంధం, అభిక్షిత వృత్తాంతం, శుంభ, నిశుంభ, రక్తబీజుల వధ వంటివి చెప్పబడ్డాయి. దీనిలో మహావిష్ణువు నాలుగు రూపాలైన వాసుదేవ, శేష, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపాల గురించి వివరించబడింది. మదాలస చరిత్ర, దేవీ సప్తశతి దీనిలో ఉన్నాయి.

**8. అగ్ని పురాణం:**

దీనిని శ్రీ మహావిష్ణువు ఎడమపాదంగా భావిస్తారు. దీనిలో 383 అధ్యాయాలు, 15400 శ్లోకాలున్నాయి. అగ్నిదేవుడు వశిష్ఠుడికి చెప్పిన పురాణమిది. రామాయణ, మహాభారతాలలో ఉన్న ఎన్నో కథలు దీనిలో చెప్పబడ్డాయి. శకున శాస్త్రం, రత్నాలను పరీక్షించే విధానం, కావ్యాలు నాటకాలకు సంబంధించిన విషయాలు, దేవాలయాలు వాటి నిర్మాణం, స్వప్నాల ఫలితాలు, అనేక వ్రతాలు, విద్యలు, వాస్తు పూజా విధానం, ఆయుర్వేద శాస్త్రానికి సంబంధించిన విషయాలు దీనిలో వివరించబడ్డాయి.

**9. భవిష్య పురాణం:**

దీనిని శ్రీ మహావిష్ణువు కుడి మోకాలుగా భావిస్తారు. దీనిలో సావిత్రి దేవి మహాత్యం, రథ సప్తమి, కామాంగి, చంద్రవళి, త్రిలోక సుందరి, జీమూత వాహనుడు వృత్తాంతం, స్త్రీ, పురుషుల శుభ, అశుభ లక్షణాలు, కల్కి అవతార వర్ణన, సాంబుడి కథ, దానం చేసే పద్ధతులు, సూర్య భగవానుడి గొప్పతనం, వినాయక పూజా విధానం, పర్వదినాలు – విశేషాలు, అష్టవిధ వివాహాల గురించి చెప్పబడింది.

**10, బ్రహ్మవైవర్త పురాణం:**

ఇది శ్రీ మహావిష్ణువు ఎడమ మోకాలుగా భావించబడింది. దీనిలో 276 అధ్యాయాలు, 18,000 శ్లోకాలు ఉన్నాయి. బ్రహ్మ ఖండం, ప్రకృతి ఖండం, గణేశ ఖండం, శ్రీకృష్ణ ఖండం అనే నాలుగు ఖండాలు దీనిలో ఉన్నాయి. దీనిలో వైకుంఠ వర్ణన, పరబ్రహ్మతత్త్వం, ప్రకృతి ఆవిర్భావం, మానసాదేవి చరిత్ర, సావిత్రి చరిత్ర, గణేషుడి చరిత్ర, కైలాస వర్ణన, కృష్ణుడి జన్మ వృత్తాంతం, ప్రద్యుమ్న జననం, శంభుకుడి వధ, ఉష అనిరుద్ధుల పరిణయం, సీతాదేవి పూర్వజన్మ వృత్తాంతం వంటివి చెప్పబడ్డాయి.

**11. లింగ పురాణం:**

దీనిని శ్రీ మహా విష్ణువు కుడి చీల మండలంగా భావిస్తారు. అగ్నిలింగ స్వరూపంలో ఉన్న శివుడు ఉపదేశించిందే ఈ లింగ పురాణం. దీనిలో పూర్వార్ధం, ఉత్తరార్ధం అని రెండు భాగాలున్నాయి. శైవులకు పరమ పవిత్రమైనదిది. శివుడి 28 అవతారాల వర్ణన, అష్టాంగ యోగ పద్ధతిలో శివారాధన, త్రిపురాసుర సంహారం, పార్వతీ కల్యాణం, వారణాసి, శ్రీశైల క్షేత్రాల మహాత్యం, శివమానస పూజా విధానం, 16 దానాల వర్ణన, కిరాతార్జునీయం, లింగోద్భవ మహాత్యం,నందీశ్వర చరిత్ర, శరభావతార రహస్యం, అంధకాసుర వృత్తాంతం దీనిలో చెప్పబడ్డాయి.

**12. వరాహ పురాణం:**

దీనిని శ్రీ మహావిష్ణువు ఎడమ చీల మండలంగా భావిస్తారు. దీనిలో 215 అధ్యాయాలు, 24000 శ్లోకాలు ఉన్నాయి. మహావిష్ణువు వరాహ రూపంలో భూదేవికి బోధించిన జ్ఞానమే వరాహ పురాణం. దీనిలో ధర్మవ్యాధుడి చరిత్ర,

ఆరోగ్య సూత్రాలు, నచికేతుని వృత్తాంతం, గోకర్ణ క్షేత్ర మహాత్మ్యం, నరక వర్ణన, అశ్వినీ దేవతల జన్మకథ, పుణ్యతీర్థాలలో స్నానమాచరిస్తే కలిగే ఫలితాలు, దోషాలు వాటి ప్రాయశ్చిత్తం, మహిషాసుర సంహారం వంటి విషయాలు వివరించబడ్డాయి.

**13. స్కాంద పురాణం:**

దీనిని మహావిష్ణువు తల వెంట్రుకలుగా భావిస్తారు. పరమశివుడు తన కుమారుడైన స్కందుడికి చెప్పినదీ పురాణం. అన్ని పురాణాల కంటే పెద్దదిది. మహేశ్వర ఖండం, బ్రహ్మ ఖండం, వైష్ణవ ఖండం, కాశీఖండం, అవంతి ఖండం, నాగర ఖండం, ప్రభాస ఖండం అనే ఏడు ఖండాలుగా ఉందిది. దీనిలో 1,471 అధ్యాయాలు, 81,000 శ్లోకాలు ఉన్నాయి.

మహేశ్వర ఖండంలో కేదార, కౌమారి, అరుణాచల, ద్రోణాచల మహాత్మ్యాలు వివరించబడ్డాయి. ఇంద్ర జమున నాడీజంఘుల కథలున్నాయి. వైష్ణవ ఖండంలో వెంకటాచలం, అయోధ్య, పూరీ జగన్నాథక్షేత్ర మహాత్మ్యాలు వర్ణించబడ్డాయి. బ్రహ్మ ఖండంలో 'సేతు మహాత్మ్యం, ధర్మారణ్య ఖండం, బ్రహ్మోత్తర ఖండ విషయాలు, శివతాండవం, పంచాక్షరీ మహిమ గురించి చెప్పబడింది. కాశీఖండంలో కాశీ క్షేత్ర వర్ణన, కుజ, గురు, సూర్యలోకాల వివరణ, మణికర్ణిక ప్రభావం గురించి చెప్పబడింది. అవంతి ఖండంలో రేవ ఖండం, ఈశ్వర, పుష్కర, పురుషోత్తమ, చక్ర మార్తాండ తీర్థాలు వంటి ఎన్నో తీర్థాల మహాత్మ్యం చెప్పబడింది. నాగర ఖండంలో విశ్వకర్మోపాఖ్యానం, అటకేశ్వరోపాఖ్యానం, గంగా నర్మద, సరస్వతి నదుల వృత్తాంతం, సప్తఋషుల చరిత్ర, అగస్త్య మహర్షి చరిత్ర మొదలైనవి. ప్రభాసఖండంలో ప్రభాసక్షేత్ర మహాత్మ్యం, దుర్వాసోపాఖ్యానం, గోమతి నది విశిష్టత, కార్తీక మాస వన భోజనాలు, ఆ వన భోజనాలు ఉసిరి చెట్టు క్రింద తినమని, అలాగే సత్యనారాయణ వ్రత మహాత్మ్యం గురించి చెప్పబడింది.

**14. వామన పురాణం:**

దీనిని శ్రీ మహా విష్ణువు చర్మంగా భావించబడింది. దీనిలో 95 అధ్యాయాలు, 10000 శ్లోకాలు ఉన్నాయి. విష్ణువు గురించి 12 స్తోత్రాలు, శివుడికి సంబంధించిన 8 స్తోత్రాలు, 4 దేవి స్తోత్రాలు, 1 సుదర్శన చక్ర స్తోత్రాలు ఉన్నాయి. దీనిలో కురుక్షేత్ర మహాత్మ్యం, మురాసుర సంహారం, చిత్రాంగద వివాహం, ప్రళయకాల వర్ణన, వినాయక విజయం చెప్పబడ్డాయి.

**15. కూర్మ పురాణం:**

దీనిని శ్రీ మహా విష్ణువు పృష్ఠ భాగంగా భావిస్తారు. దీనిలో 99 అధ్యాయాలు, 17000 శ్లోకాలు ఉన్నాయి. కూర్మరూపంలో ఉన్న శ్రీ మహావిష్ణువు మహర్షులకు చెప్పింది ఈ కూర్మపురాణం. లక్ష్మి ఇంద్రజముని, సంవాదం ద్వాదశాదిత్యుల వర్ణన, శివకేశవుల అభేదం, క్షీరసాగర మథనంలో లభించిన వస్తువుల వర్ణన, హాలాహల భక్షణం, జగన్మోహిని అవతారం, 14 లోకాల గురించి చెప్పబడింది.

**16. మత్స్య పురాణం:**

దీనిని మహావిష్ణువు మెదడుగా భావిస్తారు. దీని 283 అధ్యాయాలు, 14000 శ్లోకాలున్నాయి. మత్స్యావతార వర్ణన, పురూరవ చరిత్ర, కృష్ణాష్టమి మహాత్మ్యం, యమునా నది స్నానఫలం, 49 మంది మరుత్తుల చరిత్ర, క్రియాయోగ వర్ణన, సామదాన భేద దండోపాయాల రహస్యం, వాస్తు శాస్త్రం, సిద్ధాంతాలు, యయాతి చరిత్ర, చంద్రుడు తారను అపహరించిన తీరు, బుధ జననం, కైలాస పర్వత వర్ణన మొదలైనవి చెప్పబడ్డాయి.

**17. గరుడ పురాణం:**

శ్రీ మహా విష్ణువు మధ్య భాగంగా భావించబడింది. దీనిలో 264 అధ్యాయాలు, 19000 శ్లోకాలు ఉన్నాయి. ఆచార కాండ (కర్మకాండ), ప్రేత కాండ (ధర్మకాండ), బ్రహ్మకాండలున్నాయి. ఆచార కాండలో వైద్యశాస్త్రం, రత్నశాస్త్రం, ఖగోళశాస్త్రం గురించి చెప్పబడ్డాయి. ప్రేతకాండలో మరణించిన తర్వాత జీవుడేమవుతాడు, మరణానికి ముందు శకునాలు, ప్రేతాలు చెప్పిన కథలున్నాయి. బ్రహ్మకాండలో జ్ఞాన సంబంధమైన విషయాలున్నాయి. దీనిని భారతీయ విజ్ఞాన శాస్త్రంగా చెప్పవచ్చు.

**18. బ్రహ్మాండ పురాణం:**

శ్రీ మహావిష్ణువు ఎముకలుగా ఈ పురాణం భావించబడింది. ప్రక్రియ పాదం, అనుషంగ పాదం, ఉపోద్ఘాత పాదం, ఉపసంహార పాదంగా ఈ పురాణముంది. దీనిలో 156 అధ్యాయాలు, 12000 శ్లోకాలున్నాయి. ఈ పురాణాన్ని వాయుదేవుడు వ్యాసుడికి వివరించాడు. దీనిలో బ్రహ్మదేవుడి పుట్టుక, మరీచి, అత్రీ, అంగిరసుడు, పులస్త్యుడు, పులహుడు, క్రతువు, వశిష్ఠుడు వంటి ఋషుల గురించి చెప్పబడింది. సూర్యభగవానుడి మహిమ, కుమారస్వామి జననం, పరశురాముని శివదీక్ష, భృగువు శ్రీమహావిష్ణువుని శపించడం, ఆధ్యాత్మ రామాయణం గురించి చెప్పబడ్డాయి. లలిత సహస్రనామం కూడా దీనిలోనిదే. వాలి, రావణుల యుద్ధం గురించి చెప్పబడింది.

**మహా పురాణాలలో చెప్పబడిన అంశాలననుసరించి వాటిని ఆరు రకాలుగా హరిప్రసాద శాస్త్రి గారు వర్గీకరించారు.**

1. విజ్ఞాన సర్వస్వాల వంటి పురాణాలు: గరుడ, అగ్ని, నారద పురాణాలు. వీటిలో వైద్య, వ్యాకరణ, నాట్య, సంగీత, సాహిత్య, వేదాంత, జ్యోతిష్య, గణిత, రాజనీతి, సాంఘికనీతి మొదలైన శాస్త్రాలకు సంబంధించిన అనేక విషయాలు విస్తృతంగా చెప్పబడ్డాయి.
2. తీర్థ, వ్రత మహాత్మ్యాలను అధికంగా వర్ణించే పురాణాలు: పద్మ, స్కాంద, భవిష్య, బ్రహ్మాండ పురాణాలు.
3. పూర్వోత్తర భాగాలలో ప్రక్షిప్తాలు చేరి పెరిగిన పురాణాలు: బ్రహ్మ, భాగవతం, బ్రహ్మ వైవర్త పురాణాలు.
4. చారిత్రకాంశాల బాహుళ్యం గల పురాణాలు: బ్రహ్మాండ, వాయుపురాణాలు.
5. మత ప్రాధాన్యం గల పురాణాలు: లింగ, వామన, మార్కండేయ పురాణాలు. లింగ పురాణం లింగపూజా విధి విధానం, శైవమతాన్ని ప్రతిపాదిస్తుంది. వామన పురాణం శివమత శాఖా విషయ సర్వస్వం వంటిది. మార్కండేయ పురాణం శాక్తేయ ప్రాధాన్యం తెలుపుతుంది.
6. విష్ణు అవతార నామాలను ఆధారం చేసుకొని పెట్టబడిన పేర్లు గల పురాణాలు: మత్స్య, కూర్మ, వరాహ పురాణాలు.

## 12.3. పురాణ లక్షణాలు:

మార్కండేయ పురాణంలో పురాణానికి పంచ లక్షణాలుండాలని చెప్పబడింది.

**"సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వన్తరాణి చ**
**వంశాను చరితం చైవ పురాణం పంఞ్చ లక్షణమ్"**

అంటే సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితమనే ఐదు లక్షణాలు గలది పురాణం. ఈ శ్లోకం దాదాపు అన్ని పురాణాలలోను, సంస్కృత నిఘంటువు అమరకోశంలోను కనిపిస్తుంది.

**1. సర్గం:** సర్గం ఆది సృష్టి, ఈ సర్వ ప్రపంచం, అందులోని నానా పదార్థాల ఉత్పత్తినే సర్గ అంటారు. సర్వానికి మూలమైన

ప్రకృతిలో మూల గుణాలు క్షుబ్ధం అయిపోయినప్పుడు మహాతత్త్వం ఉద్భవించింది. ఈ మహాతత్త్వం నుండి సత్త్వరజస్తమోగుణాలనే మూడు గుణాలు అహంకారాలవుతాయి. ఈ త్రివిధాలైన అహంకారాల నుంచి పంచతన్మాత్రలు, ఇంద్రియాలు, పంచభూతాలు పుడతాయి. ఈ ఉత్పత్తి క్రమ విధానమే సర్గం అని పిలువబడుతుంది.

**"అవ్యాకృత గుణక్షోభాన్ మహతస్త్రివృత్తో హమ్**

**భూత మాత్రేంద్రియార్థానాం సంభవః సర్గ ఉచ్యతే"**

అని సర్గ యొక్క లక్షణం తెలుపబడింది.

అంటే ఈ జగత్తులోని నానా పదార్థాల ఉత్పత్తి లేక సృష్టి సర్గ అని చెప్పబడింది. ఈ సృష్టిలో శాశ్వతుడు పరమాత్మ సర్గ అని చెప్పబడింది. ఈ సృష్టిలో శాశ్వతుడు పరమాత్మ అయిన భగవంతుడు. ఆయనలో నిక్షిప్తంగా ఉండే ప్రకృతి తత్త్వం యొక్క సత్త్వరజస్తమోగుణాల క్షోభ్యత చేత మహతత్త్వం జనించి దాని నుంచి అహంకార తత్త్వం, ఆ అహంకార తత్త్వం నుంచి పంచతన్మాత్రలు, ఏకాదశ ఇంద్రియాలు పంచ మహాభూతాలు వీటికి అధిష్ఠాతలైన దేవతల ఉత్పత్తి లేక సృష్టిని సర్గ అంటారు.

**2. ప్రతి సర్గం:** కల్పాంతాన జరిగే ప్రళయం ప్రతిసర్గం. దీనికి విసర్గ అనే పేరు కూడా ఉంది. సర్గం అనే పదానికి వ్యతిరేకమైంది ప్రతి సర్గం. ప్రతి సర్గం అంటే సమస్త ప్రపంచం యొక్క ప్రళయం. విష్ణుపురాణంలో ప్రతిసర్గం అనే లక్షణానికి బదులుగా ప్రతి సంచారం అని చెప్పబడింది. ఈ బ్రహ్మాండం స్వభావరీత్యానే ప్రళయకారి. ఈ ప్రళయం నాలుగు రకాలు. నైమితికం, ప్రాకృతికం, నిత్యం, అత్యంతికాలు.

**3. వంశం:** రాజ్ఞాం బ్రహ్మప్రసూతానాం వంశం సైకాలకోన్వయః అంటుంది భాగవతం. అంటే బ్రహ్మ ద్వారా ఎవరు రాజులు సృష్టించబడ్డారో వారి యొక్క భూత, భవిష్యద్వర్తమాన కాలంలో గల సంతాన పరంపరను వంశం అంటారు. వాస్తవానికి పురాణాలలో రాజవంశాల వర్ణన మాత్రమేగాక ఋషుల వంశాల వర్ణన కూడా చేయబడింది. దేవతల, దేవర్షి, బ్రహ్మర్షుల గోత్రాను క్రమాన్ని వంశం తెలుపుతుంది.

**4. మన్వంతరం:** పురాణాలలో చెప్పబడిన ప్రకారం ఈ పదానికి అర్థం విభిన్న కాలాలలో జరిగిన సంఘటనకు గుర్తుగా ఉంటే కాలగణనం. పురాణాలను అనుసరించి మొత్తం 14 మన్వంతరాలున్నాయి. ప్రతి మన్వంతరానికి ఒక అధిపతి ఉంటాడు. ఆయన ఒక మనువు. ఆ మనువు సహాయం వల్లనే పంచ పదార్థాలు ఇంకా అనేక విభజనలుగా ఉత్పత్తిని పొందుతాయి. దేవతలు, మనుపుత్రులు, ఇంద్రుడు, సప్తర్షులు, భగవంతుడి యొక్క అవతారాలు అనే ఆరు విశేషాలతో కూడిన కాలాన్నే మన్వంతరం అని అంటారు.

**5. వంశాను చరితం:** వంశాను చరితం తేషాం వృత్తం వంశ ధరాశ్చమే అని చెబుతుంది భాగవతం. ఇంతకు ముందు తెల్పినట్లుగా చక్రవర్తుల ఋషుల వంశాలలో ఉత్పన్నం చెంది ఆయా వంశాలకు మూల పురుషులైన రాజుల విశిష్ట వర్ణనమే వంశానుచరితం అనబడుతుంది. ఇందులోనే మనుష్య సంతతిగా వివిధ వంశాలలో జన్మించిన మహర్షులు, రాజుల చరిత్ర కూడా చేర్చబడి ఉంటుంది. మహర్షుల చరిత్రలను తెలుపుతూ వివిధ రాజవంశాల చరిత్రను కూడా ప్రత్యేకంగా పురాణాలు వివరించాయి. వంశాను చరితం సూర్య చంద్రాది వంశాలలో జన్మించిన చక్రవర్తుల చరిత్రలను వివరిస్తుంది. ఈ వంశాను చరితం స్థానంలో 'భూమ్యాదేః సంస్థానమ్' అనే పాఠాంతరం కూడా ఉంది.

"పంచ లక్షణ విశిష్టములైన పురాణములు ప్రపంచోత్పత్తి వికాస క్రమమును ప్రదర్శించుటయే కాక వేదాది ధర్మములు

దేవమానవ సంఘములం దనుష్ఠింపబడిన క్రమమును నిర్దేశించుచు వేద శాస్త్రేతిహాసాదులతో తమ ప్రత్యేకతను నిలుపుకొనినవి" అని జి.వి. సుబ్రహ్మణ్యం గారు తెలిపారు. పురాణ వాఙ్మయ రాశిలో పంచలక్షణ లక్ష్యలక్షితమైన వస్తువు నూటికి సుమారు మూడు వంతులు మాత్రమే ఉండవచ్చని మహాపురాణం దశలక్షణ సమన్వితమని భాగవతంలో చెప్పబడింది. భాగవతంలో పంచ లక్షణాలే కాకుండా వృత్తి, రక్ష, సంస్థలు, హేతువు, అపాశ్రయం అనే ఐదు లక్షణాలు కూడా అదనంగా పరబ్రహ్మాను సంధాన దృష్టితో నిర్మింపబడినవి. ఇతర పురాణాలకిది వర్తించదు.

మానవ జీవిత సర్వాంశాలను స్పృశించే పురాతన వస్తువేదైనా పురాణమనబడుతుంది. వేదాలలోని కథలను పెంచి ఉపాఖ్యానాలతో నీతిబోధకంగా లోకవృత్తం ప్రతిబింబించేటట్లు రచించటం పురాణ పద్ధతి, పురాణంలోని కథావస్తువంతా ఉపాఖ్యానాల కూర్పు. ఇవి ఏదైన ఒక ధర్మాన్ని గాని, తత్వాన్నిగాని, సత్వాన్ని గాని, నీతినిగాని ఉపదేశిస్తాయి. ఈ ఉపాఖ్యానాలు స్థూలంగానో, సూక్ష్మంగానో లోకవృత్తాన్ని ప్రదర్శిస్తాయి. వేదోక్తాలైన నీతి ధర్మతత్వాది విషయాలనే 'పురాణాల కథోపాఖ్యానాల మూలంగా వివరిస్తూ పాఠకులలో ఆసక్తిని పెంచుతాయి. కనుకనే లాక్షణికులు పురాణాలను మిత్ర సమ్మతాలుగా, అర్థ ప్రధానాలుగా పరిగణించారు. క్రీ.శ. 5, 6 శతాబ్దాలకు పూర్వమే సంస్కృతంలో మహాపురాణాలు వెలువగా క్రీ.శ. 7, 8 శతాబ్దాల నుండి 13వ శతాబ్ది వరకు ఉపపురాణాల ఉత్పత్తి అధికంగా జరిగింది. ఈ సంస్కృత పురాణాలు వివిధ భారతీయ భాషలలోకి అనువదించబడ్డాయి. ఇవికాక ఆయా ప్రాంతీయ భాషలలో కొన్ని స్వతంత్ర పురాణాలు కూడా వెలిశాయి.

## 12.4. తెలుగులో పురాణ సాహిత్యం:

పాల్కురికి సోమనాథుడు వీరశైవ మత ప్రబోధానికై భక్త్యావేశ ప్రధానమైన బసవపురాణాన్ని గానయోగ్యమైన ద్విపదలో చెప్పాడు. బసవపురాణం పంచలక్షణక్షితం కాకపోయినా శివాంశసంభూతుడైన బసవడి మహాత్మ్యాదులను వర్ణించటం చేత అది శైవపురాణమనదగింది. పాల్కురికి సోమనాథుడి బసవపురాణం వంటి దేశి ద్విపద పురాణానికి ప్రతిగా మహాపురాణ సంప్రదాయ ప్రవర్తకుడై మార్గ చంపూ పద్ధతిలో మార్కండేయ పురాణాన్ని మారన రచించాడు. మారన మార్కండేయ పురాణం ప్రథమాంధ్ర మహాపురాణమని చెప్పబడింది. వెన్నెలకంటి సూరన విష్ణుపురాణాన్ని, నంది మల్లయ 'ఘంట సింగనలు' వరాహపురాణాన్ని రచించారు. ఎర్రన నృసింహ పురాణాన్ని రచించాడు. శ్రీనాథుడు భీమేశ్వర పురాణం, కాశీఖండాది పురాణ ఖండానువాదాలు చేశాడు. పోతన భాగవత పురాణాన్ని రచించారు. హరిభట్టు మత్స్య పురాణ, మాహా పురాణాలను, కామినేని మల్లారెడ్డి పద్మపురాణం, పింగళి సూరన గరుడ పురాణం రచించారు. భద్ర కవి లింగన దేవాంగ పురాణం, ఎల్లకర నృసింహ కవి మార్కండేయ పురాణం, భాస్కరాచార్యుడు వైశ్యపురాణం రచించారు.

ఇలాగే విశ్వకర్మ పురాణం, మనువంశ పురాణం, గౌడ పురాణం, సాగర పురాణాలు వచ్చాయి. ఆధునిక యుగంలో శ్రీపాద కృష్ణమూర్తిగారు భాగవతాన్ని, జనమంచి శేషాద్రి శర్మగారు బ్రహ్మాండ, బ్రహ్మ పురాణాలు, ముదిగొండ నాగవీరేశ్వరశాస్త్రి గారు శివపురాణం రచించారు. త్రిపురనేని రామస్వామి చౌదరిగారు సూత పురాణం, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి గారు ఆంధ్రపురాణం రాశారు. ఆధునిక కవులు సమాజంలో మార్పునాశించి పురాణాలు రాశారు.

### 12.4.1. ఇతిహాసం:

ఒక కాలంలో ఒక రాజవంశానికో, ఒక జాతికో సంబంధించిన చారిత్రకాంశం కలది ఇతిహాసం. పురాణాలలో వలె క్రమంగా వర్ణనలు, కథలు ఇతిహాసాలలోకి ప్రవేశించాయి. ధర్మ ప్రసంగాలు, శాస్త్ర మీమాంసలు, సృష్టి రహస్యాలు, నీతి బోధలు, దైవలీలలు, పురాణాలలోలాగానే ఇతిహాసాలలో వెల్లివిరిశాయి. సంస్కృతంలో రామాయణం, మహాభారతాలు

ఇతిహాసాలుగా పరిగణింపబడుతున్నాయి. ఇతిహాస పురాణాలు రెండూ అర్థ ప్రధానాలే, మిత్ర సమ్మితాలే, విజ్ఞానదాయకాలే. వీటిలో ధర్మబోధ, హితోపదేశం, కర్మ జ్ఞాన భక్తి వైరాగ్యాధిక విచారణ ముఖ్యం. వ్యుత్పత్తిని బట్టి పరిశీలించిన ఇతిహాస పురాణ శబ్దాలు రెండూ ఇంచుమించుగా సమానార్థకాలే. ఇతిహాసం పురాణ భేదంగానే నేడు పరిగణింపబడుచున్నది.

"ఇతి–హాస" అంటే 'ఇలా జరిగిందని చెప్పడం'. ఇది ఒకప్పుడు చరిత్రకు పర్యాయపదంగా వాడారు. అమరకోశంలో "ఇతిహాసం పురావృత్తమ్" అని పేర్కొనబడింది. ముందు జరిగిన కథలనే ఇతిహాసాలంటారు. ఇవి గ్రంథస్థం కాక పూర్వం ఆశు రూపంలో ఉంటాయి. ఇతిహాసాలు పరిక్రియ, పురాకల్పం అని రెండు రకాలు. ఏకనాయకాశ్రితమైనది పరిక్రియ, బహునాయకాశ్రితమైనది పురాకల్పం. రామాయణం పరిక్రియ అయితే మహాభారతం పురాకల్పం.

**12.4.2. ఇతిహాసానికి ఈ క్రింది లక్షణాలుంటాయి.**

1. చారిత్రక సత్యం
2. శాస్త్ర చర్చ
3. దేవాసుర సంబంధం
4. పారంపర్య ఉపదేశం
5. ఒక సుదీర్ఘ కథ
6. కథ కథనం
7. సందేశం

**"ధర్మార్థ కామ మోక్షాణాముపదేశ సమన్వితం**
**పూర్వావృత్త కథాయుక్త మితిహాసం ప్రచక్ష్యతే"**

అని ఇతిహాసం గురించి చెప్పబడింది.

## 12.5. ప్రబంధం:

ప్రకృష్టమైన బంధం గలది ప్రబంధం. ఆలంకారికుల మతంలో కావ్యాలు నిబద్ధాలు, అనిబద్ధాలు అని రెండు రకాలు. నిబద్ధమంటే 'కూర్పబడింది' అని అర్థం. ఇది పద్యాల కూర్పు కాదు, కథ కూర్పు. కథా నిబంధనం కలది నిబద్ధ కావ్యం. కథా నిబంధనం లేని చాటు పద్యాలు, శతకాలు అనిబద్ధ కావ్యం. నిబద్ధ కావ్యం నిబద్ధం, కథాశ్రయంగా ఉంటుంది అనిబద్ధ కావ్యం భావాశ్రయంగా ఉంటుంది. నిబద్ధ కావ్యాలలో కథా నిబంధనమేకాక ఇతర సంధి సామగ్రి కూడా ఉండాలి. కథలోని ప్రత్యవయవానికి వెలితిలేని ప్రకృష్టమైన బంధముండాలి. కథ శరీరనిర్మాణం సౌష్ఠవంగా ఉండాలి. ప్రకృష్టమైన బంధం కలది ప్రబంధం కనుక నిబద్ధమవటం కంటే ప్రకృష్టమవటం అవసరం. కేవలం కథా నిబంధమైతే అవి పురాణాలవుతాయి కానీ ప్రబంధాలు కాలేవు.

**ప్రబంధమంటే ఈ క్రింది లక్షణాలుండాలని పింగళి లక్ష్మీకాంతం గారు ఆలంకారులు చెప్పారు.**

1. అష్టాదశ వర్ణనా భూయిష్ఠం
2. ఉదాత్తేతివృత్తం, ఉత్తమ నాయకాశ్రితం

3. ఏక నాయకాశ్రయం
4. రస ప్రాధాన్యం
5. నాటకాలలోలాగా ముఖ సంధి నుండి నిర్వహణ సంధి వరకు క్రమ వికాసం జరగాలి, దీనినే కావ్య శరీరబంధ మంటారు.
6. ఆశ్వాసాలుగా విభజించబడాలి.

ఇవి ఆలంకారికులు చెప్పిన లక్షణాలు, శ్రీకృష్ణదేవరాయలు కాలాన్ని ప్రబంధ యుగంగా భావించటం సర్వ విదితమే. అయితే రాయలయుగానికి ముందు వచ్చిన రచనలలో కొంత ప్రబంధ లక్షణాలు కనిపించినప్పటికీ అవి ప్రబంధాలుగా భావించబడలేదు. దానికి కారణాలు అనేకం. నన్నెచోడుడి కుమార సంభవంలో వస్త్వైక్యం లేదు. వర్ణనలలో ప్రబంధ లక్షణాలున్నప్పటికీ ప్రబంధేతివృత్తంగా కాక పురాణేతివృత్తంగా కనిపిస్తుంది. తెలుగు రామాయణాలు పురాణేతిహాసంగానే భావించబడుతున్నవి. భారతం ఇతిహాసం, భాగవతం పురాణం. ఎఱ్ఱన నృసింహపురాణంలో ప్రబంధానికి ప్రాణమనదగిన పాత్ర నిర్మాణం లేదు. శృంగార నైషధం ప్రబంధమే కానీ భాషాంతరీకరణ కావటం వలన రాయలనాటి ప్రబంధానికంటే భిన్నమైంది. హరవిలాసం వస్త్వైక్యం లేదు. శృంగార శాకుంతలం కొంత అనుకరణ, కొంత స్వతంత్రం, విక్రమార్క చరిత్ర, భోజరాజీయాలు పురాణాలు కావు, ప్రబంధాలు కావు. ఇవి ప్రత్యేకమైన చిత్ర కథాత్మకాలు. గౌరన హరిశ్చంద్ర ఏక నాయకాశ్రయం, వస్త్వైక్యం కలది అయినప్పటికీ ఆలంకారిక రీతి లేని కారణంగా అది ప్రబంధం కాదు.

**రాయలకాలం నాటి ప్రబంధాల ప్రత్యేకతలు:**

రాయల యుగంలో వచ్చిన ప్రబంధాలు స్వతంత్ర రచనలు, అనుకరణలు, అనువాదాలు కావు. పురాణంలో నామమాత్రంగా అస్థిపంజరంలా ఉన్న కథను స్వీకరించి దానిని సర్వావయవాలతో అందంగా తీర్చిదిద్దినట్లుగా రాయటం ప్రబంధ లక్షణం. ఇవి స్వతంత్ర రచనలు. ఆలంకారిక శైలి. అర్థాతిశాయి అయిన శబ్దం, ప్రాయికంగా శృంగారరస ప్రాధాన్యం ప్రబంధ లక్షణాలు.

దీనిని బట్టి కథైక్యం, అష్టాదశ వర్ణనలు కలిగి శృంగార రస ప్రధానమై అర్థాతిశాయి అయిన శబ్దాలుండి ఆలంకారిక సాంకేతికాలకు విధేయమై అనతి విస్తృతిగల ఇతివృత్తంతో భాషాంతరీకరణంకాని స్వతంత్రరచన అయిన తెలుగు కావ్యం ప్రబంధం అని అర్థమవుతుంది.

## 12.6. నమూనా ప్రశ్నలు:

1) పురాణ లక్షణాలు తెలిపి, అష్టాదశ పురాణాల గురించి రాయండి?

2) ఇతిహాస, ప్రబంధ లక్షణాలను వివరించండి?

## 12.7. ఆధార గ్రంథాలు:

1) ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం

2) తెలుగు సాహిత్య సమీక్ష (మొదటి భాగం) - జి. నాగయ్య

**- ఆచార్య ఇరపని మాధవి**

## పాఠం - 13

# యక్షగానాలు

### 13.0. లక్ష్యం:

యక్షగానాలను పరిచయం చేయటం, ముఖ్యమైన యక్షగాన రచయితలను గురించి వివరించడం ఈ పాఠం లక్ష్యం.

యక్షగానం నృత్యగాన రూపకోపయుక్తమైన దేశీయ సాహిత్య ప్రక్రియ. యక్షులు చేసేగానం అనే అర్థాన్నిచ్చే ఈ ప్రక్రియ కేవలం గాన ప్రధానమైనదే కాదు. ఇందులో సంగీతానికి, నృత్యానికి, అభినయానికి ప్రాధాన్యమున్నది. తెలుగులో పూర్వనాటక స్వరూపమే యక్షగానం.

పాల్కురికి సోమనాథుడు (క్రీ.శ. 1160-1240) తన పండితారాధ్యచరిత్రలో నాటి దేశి దృశ్యరీతులను, గాన ఫణితులను పట్టికగా చెప్పాడు. "నా దటగంధర్వ యక్ష విద్యాధరాదులై పాడెడు నాడెడువారు" అని పేర్కొన్నాడు. దాసరులు మొదలైనవారు బయలాటలు, దొమ్మరాటలు, ఏలలు, చిందులు, కేళికలు, పుణ్యక్షేత్రాల్లో, ఉత్సవాల్లో ప్రదర్శించేవారని చెప్పాడు. పాల్కురికి సోమనాథుడు ప్రత్యేకించి యక్షగానం అని పేర్కొనకపోవడం వల్ల నాటికి అది ఒక విశిష్ట ప్రక్రియగా రూపుదిద్దుకోలేదని తెలుస్తుంది.

యక్షగానం ఒక విధమైన ప్రత్యేక గాన శైలి అని తెలుస్తుంది. 'యక్షగానం' అనే పదాన్ని మొట్టమొదట ప్రయోగించిన కవి శ్రీనాథుడే (క్రీ.శ. 1381-1446). ఇతడు భీమేశ్వరపురాణంలో (3ఆ. 65) "కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగాన పరణి" అని చెప్పాడు. దీన్ని బట్టి యక్షగానం ఒక విధమైన గాన ఫణితి అని స్పష్టమవుతుంది.

జక్కులకు యక్షగానానికి గల సంబంధాన్ని పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు "యక్షగానములు" అనే వ్యాసంలో యక్షగానాలంటే జక్కుల పాటలే అని తెలిపారు. పూర్వకాలం ధనవంతులు సంతానం కొరకు జక్కులను పిలిపించి పాటలు పాడించే ఆచారమున్నట్లు శాస్త్రిగారు వ్రాశారు.

జక్కుల జాతి యక్షగాన ప్రదర్శనలే ప్రధాన వృత్తిగా కలిగి జీవించేవారు. వారి వృత్తికి సంబంధించిన యక్ష శబ్దం క్రమంగా వారికి జాతి వాచకంగా పరిణమించి యుండవచ్చు. యక్షగాన ప్రదర్శకులు కనుకనే వారికి యక్షులు, జక్కులు అని పేరు వచ్చి యుండవచ్చు.

క్రీడాభిరామంలో (క్రీ.శ. 15 శతాబ్దం) 'జక్కుల పురంధ్రి' గాన కళా ప్రావీణ్యం విశేషంగా వర్ణింపబడింది. యక్షకన్యల నృత్య ప్రదర్శనకూడ క్రీడాభిరామంలో ప్రసక్తమైంది. జక్కుల నట్టువజాతి పడచులే యక్షకన్యలని చెప్పవచ్చు.

జక్కుల రేకుపదాలు, జక్కిణినృత్యం ఇవన్నీ జక్కుల పురంధ్రల వల్లనే ప్రసిద్ధమై ఉండవచ్చు. కాబట్టి యక్షపాత్రధారులైన పురుషులు, స్త్రీలు చేసే సంగీత నృత్యరూపకమే యక్షగానం అని తెలుస్తుంది.

తాళ్లపాక అన్నమాచార్యులు సంస్కృతంలో రచించిన సంకీర్తన లక్షణం అనే గ్రంథంలో యక్షగాన లక్షణాన్ని ఈ విధంగా చెప్పాడు.

**యక్షగాన పదంబులు న వ్విధమున**
**సముచితానేక విధతాళ సంగతులను**
**నవరసాలంక్రియా సవర్ణంబులగుచు**
**వలరునవి హరి కీర్తనాచార్యుదనియె**

తాళబాహుళ్యం కలిగి నవరసాలంకృతమైన పలువిధాలైన పదకవితలతో కూడినవి యక్షగానాలని స్పష్టమవుతుంది.

చిత్రకవి పెద్దన (క్రీ.శ. 16 వ శతాబ్దం) తన లక్షణసార సంగ్రహంలో త్రిపుటరేకు, జంపెరేకు మొదలైన వాటిని పేర్కొని "యక్షగానాది కృతులలో నార్యులిడిన రగడభేదంబులివియో" అని చెప్పాడు. 'ఆర్యులిడిన' అనే ప్రయోగాన్ని బట్టి చిత్రకవి పెద్దన నాటికి యక్షగానాలు వ్యాప్తిలోనికి వచ్చినట్లు తెలుస్తుంది.

ప్రోలుగంటి చెన్నశౌరి (క్రీ.శ. 1485-1509) 'లాలిత నవరసాలంకృతముగ సౌభరిచరిత' మను జక్కుల కథను చెప్పినట్లు హరిభట్టు ఉత్తరనారసింహపురాణావతారికను బట్టి తెలుస్తుంది. వెల్లంకి తాతంభట్టు (క్రీ. శ. 1500) కవిలోక చింతామణిలో ఉదాహరించిన 'లక్ష్మీకల్యాణము' యక్షగానమై ఉంటుందని యస్వీజోగారావుగారు తలంచారు. ఈ రెండు రచనలు బట్టి క్రీ.శ. 1500 నాటికే యక్షగాన రచన జరిగినట్లు తెలుస్తుంది. కాని ఈ రెండు రచనలు లభించటంలేదు.

## 13.1. యక్షగాన చరిత్ర:

కేవలం గానాత్మకమైన గేయ రూపంలో ఉండటం యక్షగాన చరిత్రలో మొదటిదశ. ఇది దేశి ఛందస్సులో విడివిడి పాటల సంపుటీకరణంగా కాని కథానాత్మకంగా కాని ఉండవచ్చు. భీమేశ్వర పురాణాన్ని బట్టి గానరూప స్తోత్రమనీ, క్రీడాభిరామాన్నిబట్టి గానరూపక కథా ఖ్యానమని తెలుస్తుంది. తెలుగు యక్షగానాల్లో మొదట వచనభాగం స్వల్పంగా ఉండేది. కథాను సంధానానికి అవసరమైన చిన్న చిన్న వచనాలుండేవి.

యక్షగాన చరిత్ర ద్వితీయదశ కందుకూరి రుద్రకవి (క్రీ.శ. 16వ శతాబ్ది) సుగ్రీవ విజయంతో ప్రారంభమవుతుంది. ఈ కాలంలో పలువురు యక్షగాన రచనలు చేశారు, కాని రుద్రకవి సుగ్రీవ విజయానికే బహుళ వ్యాప్తి కలిగింది. ఈయనే ప్రథమ యక్షగానకర్తగా ప్రఖ్యాతి పొందినాడు.

సుగ్రీవ విజయంలో రగడలే (రేకులు) కాక ద్విపదలు, అర్ధచంద్రికలు, ఏలలు, ధవళములు, శోభనములు, కొన్ని పద్యాలు, చిన్నచిన్న వచనాలు కనిపిస్తాయి. సంవాదం పద్య ద్విపదగేయాలతో జరుగుతుంది. సుగ్రీవ విజయంలో ఆఖ్యాన శైలికంటే సంవాద శైలికే ప్రాధాన్యమీయబడింది. సంభాషణలు ఎక్కువగా దరువుల్లో సాగినాయి. సుగ్రీవ విజయం సంవాదాత్మకంగా ఉండటం చేత ఇది ప్రదర్శనకు యోగ్యంగా ఉంటుంది.

క్రాంజవేంకటాద్రి వాసంతికా పరిణయం, బాలపాపాంబ అక్కమహాదేవి చరిత్ర, కంకంటి పాపరాజు విష్ణుమాయా నాటకం, తేకుమళ్లరంగశాయి జానకీ పరిణయం మొదలైనవి 16వ శతాబ్దంలో రచింపబడిన యక్షగానాల్లో ముఖ్యమైనవి. బాల పాపాంబ ప్రప్రథమ యక్షగాన కవయిత్రి.

కందుకూరి రుద్రయ్యకు వృద్ధాప్యంలో సమకాలికుడైన పింగళి సూరన తన కళాపూర్ణోదయంలో రంభా మాయారంభల కలహసందర్భంలో కొరవంజి యక్షగానాల్లోని సవతుల కయ్యాన్ని అనుకరించాడు. ప్రభావతీ ప్రద్యుమ్నంలో ప్రద్యుమ్నాది కుమారులు ప్రచ్ఛన్న వేషంతో నట బృందంగా వజ్రనాభుని రాజ్యంలో ప్రవేశించి తమనాటక ప్రదర్శనలతో అక్కడి ప్రజలను,

రాజును మెప్పించినట్లు పింగళి సూరన రచించాడు.

ఈ సందర్భాలను బట్టి పింగళి సూరన నాటికి యక్షగాన ప్రదర్శనలకు పరిపూర్ణమైన రాజసభా గౌరవం కలిగిందని తెలుస్తుంది. మైసూరు ప్రాంతంలో ఎలహంక ప్రభువుగా ప్రసిద్ధి పొందిన, బెంగుళూరు పట్టణాన్ని నిర్మించిన పెదకెంపరాయుడు (క్రీ.శ. 1513–1569) 'గంగాగౌరీవిలాసం' అనే యక్షగానాన్ని తెలుగులో రచించాడు.

**గంగాగౌరి విలాసము**
**సంగతి పదపద్యములకు సరసతమీరన్**
**రంగద్భాషణములు చెల**
**గంగా పెదకెంపరాయఘనుడొనరించున్**

పెదకెంపరాయని గంగాగౌరీ విలాసంలోని పద్యాలు, పాటలు నిర్దుష్టమై, సొంపై, జాతీయమైన తేటతెనుగులో సాగినవి. భావంలోని వ్యంగ్యం స్పష్టంగా తెలుస్తుంది. అంత్యప్రాస అనుప్రాసలతో లయ అప్రయత్నంగా సాగిపోతుంది. దరువులు జనరంజకంగా ఉంటాయి. కెంపరాయల శాసనాలు, ఈ యక్షగానం అతడు తెలుగు వాడేనని చెప్పటానికి ఆధారంగా ఉన్నాయి. ఈ కెంపరాయని యక్షగానాన్ని చదివిగాని, ప్రదర్శన చూచిగాని అతనికి సమకాలికుడైన పింగళి సూరన తన కళాపూర్ణోదయంలో సవతుల కయ్యపు ఘట్టాన్ని, ప్రభావతీ ప్రద్యుమ్నంలో గంగావతరణ యక్షగాన ప్రదర్శన ఘట్టాన్ని ప్రవేశపెట్టి ఉండవచ్చు.

ఈ ద్వితీయ దశలో యక్షగానాలు సంవాదరూపం దాల్చి ప్రదర్శన దశకు చేరుకొన్నట్లు తెలుస్తుంది. తృతీయ దశ యక్షగానాలకు స్వర్ణయుగమని చెప్పవచ్చు. ఈ దశలో అవి వీధినాటకాలతో అభేదం చెందినాయి. తెలుగు యక్షగానాలకు పుట్టినిల్లు రాయలసీమ అయినా వాటికి రాజభోగమూ, రంగభోగమూ లభించింది తంజావూరు నాయక రాజుల (17 వ శతాబ్ది) రాజ్యంలోనేనని చెప్పవచ్చు.

## 13.2. తంజావూరి పాలకులు – యక్షగానాలు

రాజకవియైన రఘునాథనాయకుడు 'రుక్మిణీకృష్ణవివాహం' అనే యక్షగానాన్ని రచించినట్లు తెలుస్తుంది. కాని అది లభ్యం కావటం లేదు. రఘునాథనాయకుని కుమారుడైన విజయరాఘవ నాయకుని కాలంలో (క్రీ.శ. 1633–1673) యక్షగాన ప్రతిష్ఠ మిన్నుముట్టినది. విజయరాఘవ నాయకుడు 23 యక్షగానాలను రచించినట్లు అతని ప్రహ్లాద చరిత్ర నాటకంలోని పద్యాన్నిబట్టి తెలుస్తుంది. వాటిలో కాళియమర్దనం, కృష్ణవిలాసం, విప్రనారాయణ, రఘునాథాభ్యుదయం, పూతనహరణం, ప్రహ్లాద చరిత్ర అనే ఆరు యక్షగాన నాటకాలే ముద్రితమై బహుళ ప్రచారాన్ని పొందినాయి.

విజయరాఘవుని నాటకాలు గేయధర్మంకంటే రూపకళను ఎక్కువగా సంతరించుకొన్నవి. అతడు ఉద్దేశ పూర్వకంగానే యక్షగానాలకు నాటకాలని పేరుపెట్టాడు. యక్షగానాలను నాటకరీతిలో నడిపించిన కవుల్లో మొదటివాడు విజయరాఘవ నాయకుడు.

యక్షగానాలు వీధి నాటకాల లక్షణాలను గ్రహించి ఈ రెండు అభేదం చెందటం దక్షిణాంధ్రయుగ ప్రత్యేకతగా చెప్పవచ్చు. ఈ యుగంలో విజయరాఘవ నాయకుని రఘునాథాభ్యుదయం, పసుపులేటి రంగాజమ్మ మన్నారు దాసవిలాసనాటకం, మన్నారు దేవుని హేమాబ్జనాయికా స్వయంవరం, కామరసు వేంకటపతి సోమయాజి విజయరాఘవ

చంద్రికా విహారం, కోనేటి దీక్షితకవి విజయరాఘవకల్యాణం, పురుషోత్తమ దీక్షితుని తంజాపురాన్నదాన మహానాటకం మొదలైనవి ప్రసిద్ధమైనవి.

విజయరాఘవుని రఘునాథాభ్యుదయం శృంగార రస ప్రధానమైన యక్షగానం. చిత్రరేఖ అనే సుందరి రఘునాథ నాయకుని మోహించడం, చిలుక రాయబారం, వారి సమాగమం ఇందులోని కథ. నాయకుని విద్యాగోష్ఠి వినోదాలు, రామభద్రాంబ, శుకవాణి మొదలైన కవయిత్రుల సమస్యా పురాణాలు, రాజకీయాదాయ వ్యయవిచారణ, కమ్మవారి వక్కణ ఇందులోని ఇతరాంశాలు.

యక్షగానాల్లో విజయరాఘవ నాయకుడు సంస్కృత నాటక పద్ధతులను కొద్దిగా మార్పుచేసి ప్రవేశపెట్టాడు. దేవతాస్తోత్రానంతర మేళగాంధ్రచే కైవారం చెప్పించి వారితోనే కథా క్రమాన్ని నాటకోచితంగా ప్రకటింపజేశాడు. ఇవి ఇంచుమించుగా సంస్కృత నాటకంలో నాందీప్రస్తావనలవలె ఉంటాయి. ఇట్లే విజయరాఘవుడు కొన్ని యక్షగానాల్లో చివర భరత వాక్యాన్ని ప్రవేశపెట్టాడు. పాత్రోచితమగుభాష, సంవాదాత్మకమైన రచన రగడలకు బదులుగా దరువులను కూర్చటం, హాస్యరసపోషణ మొదలైనవి విజయరాఘవనాయకుని యక్షగానాల్లో ఎన్నదగిన రచనా విశేషాలు. విజయ రాఘవుని యక్షగానాలు గేయధర్మం కంటే రూపకళను ఎక్కువగా సంతరించుకొన్నాయి. యక్షగానాలు ప్రదర్శన దశకు చేరుకోవటానికి ముఖ్యకారకుడు విజయ రాఘవ నాయకుడేనని చెప్పవచ్చు.

తంజావూరి నాయక రాజులలో చివరివాడు మన్నారు దేవుడు. హేమాబ్జనాయిక అంటే లక్ష్మీదేవి, రాజగోపాల స్వామి అంటే విష్ణువు. వీరి భక్తుడైన విజయరాఘవ నాయకుడు నిర్వహించిన వీరి వివాహం హేమాబ్జనాయికా స్వయంవరం. ఇందులో మన్నారు దేవుడు విజయ రాఘవ నాయకుని కథాగత పాత్రగా రూపొందించినాడు.

విజయరాఘవ నాయకుడు మృగయా విహారానికేగినప్పుడు అరణ్యం మధ్యలో మదనమంజరి అనే రాకుమారిని చూచి ప్రేమించి వివాహం చేసుకోవడం ఇతివృత్తంగా కోనేటి దీక్షితకవి 'విజయ రాఘవ కల్యాణం' అనే యక్షగానాన్ని రచించాడు. విజయరాఘవుని కొలువులోని కవుల విద్వాంసుల సాహిత్య గోష్ఠి ఇందలి ప్రత్యేకాకర్షణగా కనిపిస్తుంది. రచనలోని అనుప్రాస శోభితమైన కవితలు, పాత్రోచితమైన భాషావిలసితమైన సంవాదాలు, ముత్తయిదువుల ముచ్చట్లు, చెంచుల ప్రసంగాలు విశిష్టంగా ఉంటాయి.

విజయరాఘవుని 'పట్టంపు కవి' నని చెప్పుకొన్న కామరసు వేంకటపతి సోమయాజి విజయరాఘవ చంద్రికావిహారం అనే యక్షగానాన్ని రచించి విజయరాఘవునికి అంకితమిచ్చాడు. విజయరాఘవ నాయకుడు రాత్రి భోజనానంతరం 'వెన్నెల షికారు'కు వెళ్ళటం, లీలావతి అనే రాకుమారి అతనిని చూచి ప్రేమించటం, చెలికత్తె రాయబారం, లీలావతి విజయరాఘువుల వివాహం ఈ యక్షగానంలోని ఇతివృత్తం. ఇందులో కొత్తదనం ఏమీలేదు.

విజయరాఘవ నాయకుడు నిరతాన్న దాత అని ప్రసిద్ధి. పురుషోత్తమ దీక్షిత కవి 'సత్రమరులు' అనే నామాంతరం కలిగిన తంజాపురాన్న దాన మహానాటకము' అనే యక్షగానాన్ని రచించాడు. ఇది వచన ప్రధానమైన యక్షగానం, ఈ కృతిలో తెలుగువారి ఘుటకాలు విశేషంగా వర్ణించబడినాయి.

రంగాజమ్మ మన్నారు దాసవిలాస నాటకంలో విజయ రాఘవనాయకుడు ఫాల్గుణోత్సవంలో పాల్గొన్నపుడు కాంతి మతి అనే రాకుమారి అతని చూచి ప్రేమించటం. తాతాచార్యులు మధ్యవర్తిగా వ్యవహరించి వారి వివాహం జరిపించడం ఇందులోని ఇతివృత్తం. ఈ నాటకంలో రంగాజమ్మ పాత్రల అవసరాన్ని బట్టి బహువిధాలైన భాషా ప్రయోగాలను చేసింది.

విజయరాఘవుని ఆస్థానకవులు కవయిత్రులు అతనిని కథానాయకునిగా స్వీకరించి యక్షగానాలను రచించటం వారి రాజాధరణకు నిదర్శనం. దేశీయమైన పదరచనలతో యక్షగానాలను ప్రదర్శన యోగ్యంగా ప్రజారంజకంగా రచించడం వారి లౌకిక దృష్టికి నిదర్శనం. రాజపరంగా శృంగారం, ప్రజాపరంగా హాస్యం ప్రతి యక్షగానంలో కనిపిస్తుంది. ప్రతి యక్షగానం రాజ సంబంధంగాను, ప్రజాజీవిత స్పర్శతోను రచింపబడటం ఈ యుగ విశేషంగా చెప్పవచ్చు.

మహారాష్ట్ర రాజులు కూడ నాయక రాజులవలె యక్షగాన నాటకాలను రచించారు. శహాజీ (క్రీ.శ. 1684–1712) స్వయంగా 20 యక్షగానాలకు రచించాడు. ఇతని నాటకాల్లో గ్రంథారంభంలో ద్విపదలో కథా సంగ్రహముంటుంది. పాత్రో చిత భాషతో వచనం ప్రచురంగా ఉంటుంది. కిరాతవిలాసం ద్రౌపదీకల్యాణం, కృష్ణలీలావిలాసం, గంగాపార్వతీ సంవాదం, జలక్రీడలు, పార్వతీ కల్యాణం, రతీ కల్యాణం మొదలైనవి శహాజీ యక్షగానాల్లో ముఖ్యమైనవి.

## 13.3. ఇతర యక్షగానాలు:

క్రీ.శ. 17వ శతాబ్దంలో దక్షిణ దేశంలో కొన్ని తెలుగు యక్షగానాలు వెలువడినాయి. మైసూరును పాలించిన చిక్కదేవ రాయల చరిత్రను అజ్ఞాతకవి చిక్కదేవరాయలకంకితంగా 'చిక్కదేవరాయ విలాసం' అనే యక్షగానం రచించాడు. పెదకెంపరాయుడు (క్రీ.శ. 1658–1678) 'గంగాగౌరీవిలాసం' అనే యక్షగానం రచించాడు.

మధురలో (క్రీ.శ. 1706–1730) విజయరంగ చొక్కనాథుని సభార్థంగా, నర్తన యోగ్యం, తిరుమలకవి 'తిల్ల గోవిందరాజ నాటకం' అనే యక్షగానాన్ని రచించాడు. అన్నదానం వేంకటాంబ అనే కవయిత్రి (క్రీ.శ. 1712) సేలంలో రామయణ బాలకాండను యక్షగానంగా రచించింది. బయలాచార్యుడు (క్రీ.శ. 1767) గొడగూచికథను యక్షగానంగా రచించాడు. పుదుక్కోట రఘునాథ తొండమాన్ (క్రీ.శ. 1769–1789) ఆస్థానకవియైన నుదురుపాటి వెంకన్న పార్వతీకల్యాణం అనే యక్షగానాన్ని రచించాడు.

క్రీ.శ. 18 వ శతాబ్దిలో తెలంగాణాలో కూడ యక్షగానాలు రచింపబడినాయి. శేషాచలకవి ధర్మపురి రామాయణం, రాపాక శ్రీరామకవి ఆధ్యాత్మ రామాయణం లభించినంతలో తెలంగాణా ప్రాంతమందలి మొదటి యక్షగానాలు. వీరభద్రకవి బసవ మహిమామృత విలాసం, చెల్వూర సన్యాసికవి బసవకల్యాణం అనేవి వీరశైవ యక్షగానాలు. క్రీ.శ. 20 వ శతాబ్దిలో తెలంగాణాలో యక్షగాన కవుల్లో మిక్కిలి ప్రసిద్ధుడు చెర్విరాల భాగయ్య. ఇతడు 34 యక్షగానాలు రచించాడు. బభ్రువాహన చరిత్ర కృష్ణగారడి, మాయా సుభద్ర, ఆరెమరాటీలు, కాంభోజరాజు కథ, బాలనగమ్మ కథ మొదలైనవి చెర్విరాల భాగయ్య యక్షగానాల్లో బహుళ జనాదరణ పొందినవి. యక్షగానాల్లో కొరవంజి అంటే ఎరుకతె పాత్రను ప్రవేశపెట్టి కొరవంజులనే యక్షగానాలను రచించారు. తెలుగు కొరవంజులలో మొట్టమొదటిది శహాజీ ఆస్థాన కవియైన దర్భాగిరి రాజకవి. (క్రీ.శ. 1684–1712) రచించిన 'రామమోహన కొరవంజి' అనేది. ఇందులో కొరవంజి, ఎఱుకత, సింగి అనే పదాలు సమానార్థకాలుగా ప్రయోగింపబడినాయి. కొరవంజి, యక్షగానం రచనా ప్రక్రియలూ అభిన్నంగా ఉంటాయి. కొరవంజి పాత్రపాధాన్యాన్ని బట్టే యక్షగానానికి కొరవంజి అనే పేరు వస్తుంది. కొరవంజులు నృత్య ప్రధానంగాను, యక్షగానాలు గేయ ప్రాధాన్యంగాను ఉండటం గమనింప దగిన విశేషం.

దేశి కవితా శాఖలన్నిటిలోను గుణాన్ని బట్టి, పరిమాణాన్ని బట్టి, ప్రయోజనాన్ని బట్టి యక్షగానం అగ్రగణ్యమైందని చెప్పవచ్చు.

## 13.4. సారాంశము:

రూపకోయుక్తమ-నృత్యం గానం, వీటన్నిటి కలయికే యక్షగాన ప్రక్రియ. యక్షగానం అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించినవాడు శ్రీనాథుడు. మూడు దశలలో అంచెలంచెలుగా ఎదిగి, చివరికి యక్షగానం ఒక పరిపూర్ణ ప్రక్రియగా రూపొందింది. రాజకవులైన రఘునాథ నాయకుడు, విజయ రాఘవ నాయకుడు, మన్నారు దేవుడు చిరస్మరణీయములైన యక్షగానాలను రచించారు.

## 13.5. నమూనా ప్రశ్నలు:

1) యక్షగానాల ఆవిర్భావాన్ని వివరించండి?

2) తంజావూరు నాయక రాజులు రచించిన యక్షగానాల విశిష్టతను వివరించండి?

## 13.6. ఆధార గ్రంథాలు:

1) డా॥ యస్.వి. జోగారావు - ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర.

2) ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము - తెలుగు యక్షగానము ఉత్పత్తి పరిణామము సం॥ 3.

**- డా॥ కె. కుసుమాబాయి**

## పాఠం - 14

# శతక ప్రక్రియ

### 14.0. లక్ష్యం:

శతక ప్రక్రియ ఆవిర్భావం, శతకాల విభజన పద్ధతిని వివరించటం ఈ పాఠం లక్ష్యం.

**విషయ క్రమం:**

**14.1. శైవ భక్తి శతకాలు**

**14.2. వైష్ణవ భక్తి శతకాలు**

**14.3. దేవ స్తుతి శతకాలు**

**14.4. వ్యాజస్తుతి శతకాలు**

**14.5. వేదాంత శతకాలు**

**14.6. నీతి శతకాలు**

**14.7. అధిక్షేప శతకాలు**

**14.8. శృంగార శతకాలు**

**14.9. హాస్య శతకాలు**

**14.10. సారాంశము**

**14.11. నమూనా ప్రశ్నలు**

**14.12. ఆధార గ్రంథాలు**

భావం, భక్తి, ఆత్మానుభూతి ప్రధానంగా గలిగిన శతక ప్రక్రియ సర్వ జనాదరణీయమైన సాహిత్య ప్రక్రియ. ఇది కొందరు భావించినట్లు దేశికవితా ప్రక్రియకాదు. సంస్కృత ప్రాకృత భాషల్లోని శతకమే కొన్ని విశిష్ట లక్షణాలను సంతరించుకొని తెలుగులో రూపుదిద్దుకొన్న ప్రక్రియ శతకం. సంస్కృత ప్రాకృతం శతకాల్లోని సంఖ్యానియమం, మకుటనియమం, ఛందోనియమం, రసనియమం, ఆత్మాశ్రయ కవితాధర్మం అనే లక్షణాలు తెలుగు శతకాల్లో చోటు చేసుకొన్నట్లు డా॥ కె. గోపాల కృష్ణారావుగారు వివరించారు.

సామాన్యంగా శతకం అంటే నూరు పద్యాలుండాలి. కాని శతకాల్లో నూట ఎనిమిది పద్యాలుండటం వాడుక. ఈ సంఖ్యానియమం భక్తి శతకాల్లో ప్రాధాన్యం వహించినది. భగవన్నామ స్తోత్రాల్లో అష్టోత్తశతం నామాలుండటం పరిపాటి. భగవంతుని నామాల వలెనే భగవన్నుతి ప్రధానమైన పద్యాలు కూడ అష్టోత్తశతం ఉండాలనే సంప్రదాయం ఏర్పడి ఉండవచ్చు. మొదట భక్తి శతకాల్లో పాటింపబడిన ఈ సంఖ్యానియమం తర్వాత అన్ని రకాల శతకాలకు సామాన్య లక్షణంగా పరిణమించి ఉండవచ్చు.

సంస్కృత శతక కవులు మకుటనియమాన్ని మొదట పాటించినా అనంతరకాలంలో ఈ నియమాన్ని సడలించారు. కాని తెలుగు శతక కర్తలు మకుట నియమాన్ని విధిగా పాటించారు. ఈ మకుట నియమం వివిధ రీతుల్లో పాటించారు.

అందులో సంబుద్ధ్యంత మకుటాల సంఖ్య ఎక్కువ. మకుటం అన్యాంకితం, ఆత్మాంకితం అని రెండు రకాలు. మకుటాల్లో కొందరు పదమకుటాన్ని, సమాసమకుటాన్ని, అర్ధపాదమకుటాన్ని, పాదమకుటాన్ని, ద్విపాదమకుటాన్ని గ్రహించారు. మరికొందరు పాదాంతంలో కాక పద్యారంభంలో మకుటాన్ని ప్రయోగించారు. చిదంబరశాస్త్రి రచించిన దారుణ శతకంలో ప్రతి పద్యారంభంలో "దారుణమా నీకు నమస్కారం" అనే మకుటమున్నది.

తెలుగు శతకాల్లో సాధారణంగా వృత్త నియమం పాటించబడుతుంది. శతకకవి చంపకమాలతోగాని, సీసంతోగాని, కందంతోగాని, ఆటవెలదితోగాని పద్యాన్ని ప్రారంభిస్తే తుదివరకు ఆ ఛందస్సునే నిర్వహిస్తాడు. ఈ వృత్త నియమాన్ని పాటించిన శతకాలే తెలుగులో అధికంగా ఉన్నాయి.

శతకాల్లోని పద్యాలన్నీ ముక్తకాల వలె ప్రత్యేక భావంతో స్వయం సంపూర్ణంగా ఉంటాయి. ఈ పద్యాలన్నిటికి సంబంధాన్ని కూర్చే కథా సూత్రం ఉండదు.

శతకాలు సంస్కృత ప్రాకృత కన్నడాది భాషల్లో ఉన్నప్పటికీ తెలుగులో వాటికి ప్రత్యేకమైన స్థానం, విస్తృత ప్రచారం ఉన్నది. ప్రతికవీ మొదట భగవదనుగ్రహప్రాప్తి కొరకు, కవితా ధారనలవర్చుకొనడానికి శతకరచనకు ప్రయత్నించడం పరిపాటి.

తెలుగు శతకాలను భక్తి శతకాలనీ, వ్యాజస్తుతి శతకాలనీ, వేదాంత శతకాలనీ, నీతిశతకాలనీ, అధిక్షేపశతకాలనీ, శృంగార శతకాలనీ, హాస్య శతకాలనీ, ప్రకీర్ణశతకాలనీ, వివిధ వస్తుకశతకాలనీ, కథనాత్మక శతకాలనీ స్థూలంగా విభజించవచ్చు.

భక్తి శతకాల్లో శైవభక్తిశతకాలు, వైష్ణవభక్తి శతకాలు ముఖ్యమైనవి.

## 14.1. శైవ భక్తి శతకాలు:

శతక ప్రక్రియకు ఆద్యులు శివకవులు. శైవమతాచార్యుడైన మల్లికార్జున పండితారాధ్యుడు (క్రీ.శ. 1160) రచించిన శివతత్త్వసారంలో అజా ! రుద్రా ! శివా ! అనే మకుటంగల 489 పద్యాలున్నాయి. శతకమనే పేరు లేకున్నా సంఖ్యానియమం పాటింపకున్నా సర్వవిధాల శివతత్త్వ సారంలోని పద్యాలు శతకాన్నే పోలి ఉంటాయి. మల్లికార్జున పండితారాధ్యుడు శివతత్త్వ సారాన్నేగాక శ్రీ గిరిమల్లికార్జున శతకాన్ని కూడ వ్రాశాడని చెప్తారు కాని అదీ అలభ్యం. లభించినంతవరకు శతకాల్లో శివతత్త్వసారమే మొదటిది.

పాల్కురికి సోమనాథుని (క్రీ.శ. 1160-1240) వృషాధిపశతకమే సర్వలక్షణ సంపన్నమైన ప్రథమాంధ్ర శతకం. వృషాధిపశతకంలో 'బసవా ! బసవా ! బసవా ! వృషాధిపా' అనే మకుటమున్నది. వీరశైవమతస్థాపకుడైన బసవని సంబోధిస్తూ, భక్త్యావేశంతో, అనర్గళమైన కవితాధారతో చెప్పబడిన శతకమిది. ఇందులో పాల్కురికి సోమన దాస్య, సఖ్య వాత్సల్య, మధురభక్తి భావాలను వివిధ రీతుల్లో వ్యక్తీకరించాడు. వివిధ శైవ భక్తుల చరిత్రలను కూడ ఇందులో పేర్కొన్నాడు.

**"నా యొడయండ, నావిభుడ, నాహృదయేశ్వర, నామనోరమా**
**నా యిలవేల్ప, నా వరద, నాగురులింగమ, నాదుజంగమా**
**నా యదినాథ, నా వరుడ, నన్నుగృపామతి బ్రోవుమయ్యదే**
**వా యమబృంద వంద్య బసవా బసవా బసవా వృషాధిపా"**

పాల్కురికి సోమన శివకవి శ్రేష్టుడు మహాపండితుడు, అష్టభాషాధురీణుడు. వృషాధిపశతకంలో అతడు సంస్కృతాంధ్ర భాషల్లోనే గాక తమిళ, కన్నడ, మహారాష్ట్ర భాషల్లోను, అచ్చ తెనుగులోను, మణి ప్రవాళశైలిలోను రచించిన పద్యాలు అతనికి గల బహుభాషా పాండిత్యానికి నిదర్శనంగా కనిపిస్తాయి.

యథావాక్కుల అన్నమయ్య (క్రీ.శ. 1242) రచించిన సర్వేశ్వర శతకం శివభక్తిని ప్రతిపాదించే ఉత్తమ శతకం. ఇందులో 142 పద్యాలున్నాయి. దీనిలో సంఖ్యానియమం పాటింపబడలేదు. యథావాక్కుల అన్నమయ్య గోదావరి జిల్లాలోని పట్టెస క్షేత్రంలోని వీరభద్రస్వామి భక్తుడు. శ్రీశైలానికిపోతూ ఈ శతకాన్ని రచించినట్లు తెలుస్తుంది.

**"అతి దక్షుండగు దక్షుడీ జగములో యాగంబు సల్లక్షణ**
**స్థితిగా జేయుచునుండి నిన్ను మదినుద్దేశింపమింజేసితా**
**హతుడయ్యెన్ మదినట్టి కార్యములు పొందైయుండునే ?కర్త స**
**మ్మతితో జేయని దుర్మదుండు మనునే ? భావింపసర్వేశ్వరా !"**

ఎంత గొప్పవాడైనా తనపైవాని అనుమతితో చేసిన పని నిర్విఘ్నంగా జరుగుతుంది. శివుని ఆజ్ఞలేకుండా అతి సమర్థుడైన దక్షుడు యజ్ఞంచేసి మరణించాడు కదా అని అర్థాంతరన్యాసాలంకారంలో అన్నమయ్య పేర్కొనడం శివుని శక్తిని, ప్రభావాన్ని నిరూపించడమే. ఇలాంటి లోకజ్ఞతతో కూడిన అంశాలతో భక్తియోగాన్ని, ముక్తి మార్గాన్ని బోధించాడు కవి. స్వతంత్రభావాలు, చక్కని అలంకారాలు కలిగిన సర్వేశ్వర శతకం మనోహరమైన శైలితో శివభక్తి పారమ్యాన్ని ప్రబోధిస్తుంది.

శైవభక్తి శతకాల్లో ధూర్జటి వ్రాసిన కాళహస్తీశ్వర శతకం అగ్రగణ్యమైంది. నిర్వ్యాజభక్తి, ఆత్మవిమర్శనం, ధారాశుద్ధి, భావనాశక్తి కాళహస్తీశ్వర శతకం విశిష్టలక్షణాలుగ చెప్పవచ్చు.

**"రాజుల్మత్తులు, వారిసేవ నరకప్రాయంబు, వారిచ్చునం**
**భోజాక్షీ చతురంత మాన తురగీభూషాదు లాత్మ వ్యధా**
**బీజంబుల్, తదపేక్షచాలు, పరితృప్తింబోందితిన్, జ్ఞానల**
**క్ష్మీ జాగ్రత్పరిణామమిమ్ము, దయతో శ్రీకాళహస్తీశ్వరా!"**

అని నిర్భయంగా రాజులను, వారిసేవను నిరసించాడు. ప్రతి పద్యంలోను ధూర్జటి లోకానుభవం, చిత్తశుద్ధి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ గుణాలే ధూర్జటి కవితకు అసాధారణమైన తేజస్సును, శక్తిని ధారా శుద్ధిని చేకూర్చాయి.

ఆయా శైవక్షేత్రాలనుబట్టి అనేకమైన శైవభక్తిశతకాలు రచింపబడినాయి. శతక కవిత్వానికి భిక్షపెట్టిన వారు శివకవులే అయినా కాళహస్తీశ్వర శతకం తర్వాత అంత ప్రసిద్ధి చెందిన శివభక్తి శతకాలు రాలేదు. కుక్కుటేశ్వర శతకం, రామలింగేశ్వర శతకం శివుని సంబోధించేవే కాని అవి నీతి ప్రధానమైన శతకాలు.

అమలాపురం సన్యాసకవి (18 శతాబ్దం) విశ్వనాథశతకం, కంచి ఏకామ్రలింగ శతకం (కర్త తెలియదు), సత్యవోలు సుందరకవి రాజశేఖరశతకం, సుబ్రహ్మణ్య శర్మ భీమేశ్వర శతకం మొదలైనవి శైవభక్తి శతకాల్లో పేర్కొనదగినవి.

## 14.2. వైష్ణవ భక్తి శతకాలు:

ఆంధ్ర దేశంలో వైష్ణవం ప్రాధాన్యం వహించిన కాలంలో విష్ణుభక్తి శతకాలు వెలువడినాయి. నారాయణుని

ఈ శతకం చక్కని భావాలు కలిగి తేట తెనుగుతో సరళమైన భాషకలిగి జనరంజకంగా ఉంటుంది.

## 14.3. దేవీస్తుతి శతకాలు:

ఆదిశక్తి స్వరూపిణులైన త్రిమూర్తుల భార్యలను స్తుతిస్తూ అనేక శతకాలు వెలువడినాయి. అందులో సరస్వతీ స్తుతి ప్రధానంగా రచింపబడిన వాటిలో వెండిగంటము, గురునాధకవి రచించిన సరస్వతీ శతకం ముఖ్యమైంది. లక్ష్మీస్తుతి ప్రధానంగా రచింపబడిన శతకాల్లో పరవస్తు మునినాథకవి వ్రాసిన లక్ష్మీశతకం ప్రశస్తమైంది. జగన్మాతను కీర్తించే శతకాల్లో దిట్టకవి రామచంద్రకవి రచించిన మహిషాసురమర్దని శతకం విశిష్టమైంది.

వివిధ దేవతలపై రచింపబడిన శతకాలు కూడ అనేకం ఉన్నాయి. ఝుం ఝూ మారుతం సుబ్బకవి శ్రీ సూర్యనారాయణ శతకం, ఘటికాద్రికవి శనైశ్చరశతకం, పిశుపాటి చిదంబరశాస్త్రి దత్తాత్రేయ శతకం, గుంటుపల్లి రామనకవి మహాగణపతి శతకం, నందివాడ వేంకటరత్నం కామదేవశతకం, మేరాల గోవిందయ్య సుబ్రహ్మణ్య శతకం, బులుసు వేంకటకవుల తిరుపతి శతకం ముఖ్యమైనవి.

బంచుపల్లి రామజోగారావు గురుశతకం, భీమరాయకవి పితృభక్తి శతకం, మాతూరి అప్పారావు మొదలి మాతృశతకం, చర్ల లక్ష్మీనారాయణ భరతమాతృశతకం, సూర్యనారాయణమూర్తి ఆంధ్రవీరకుమార శతకం మొదలైన విధంగా భక్తి శతకాలు ఆ సంఖ్యాకంగా రచింపబడినాయి.

## 14.4. వ్యాజస్తుతి శతకాలు:

ఇవి భక్తి శతకాలే కాని వీటిలోని భగవన్నుతి కొత్త మార్గాన్ని అవలంబించి ఉంటుంది. పైకి నిందగా కనిపించి పర్యవసానంలో స్తుతిగాను, పైకి స్తుతిగా కనిపించి పర్యవసానంలో నిందగను అభివ్యక్తం కావటం వ్యాజస్తుతి.

వ్యాజస్తుతి శతకాల్లో మొదట పేర్కొనదగినది గోగులపాటి కూర్మనాధుడు (క్రీ.శ. 1750) రచించిన సింహాద్రి నారసింహ శతకం క్రీ.శ. 18వ శతాబ్దంతంలో యవనులు ఆంధ్రదేశమందలి సుప్రసిద్ధ దేవాలయాలను ధ్వంసం చేయడం, మత గ్రంథాలను మంటగలపడం, స్త్రీలను చెరబట్టడం మొదలైన అత్యాచారాలను చేస్తుండేవారు. యవనసేన సింహాద్రి క్షేత్రాన్ని కొల్లగొట్టాలని ప్రయత్నించినప్పుడు కూర్మనాథకవి సింహాద్రి నారసింహుని నిందా స్తుతులచే ప్రబోధించి క్షేత్రాన్ని, ప్రజలను కాపాడమని వేడుకొన్నాడు.

**"యవనేశుధాటికి నదలి సర్వస్వమ్ము విడిచి మందిరములు వెడలువారు**
**వెడలియుదల దాచ వెరవేమిగానక నడవుల నిడుమల బడెడువారు**
**బడియు నెచ్చట కూడు బట్టగానక తమ శిశువులతో వెతజెందువారు**
**జెంది దెందముగుంద గాందిశీకత నభిమానార్థులై ఖేదమూనువారు**
**వైరి యొక్కొక్క భార్యతో నవని ప్రజలు అష్టమహిషులపై పది యాఱువేల**
**సతులతో నీవు వలసకెచ్చటి కరిగెదు, వైరివరరంహ సింహాద్రి నారసింహ"**

యవనుల దురాగతాలకు లోనైన ఆనాటి ప్రజల పరిస్థితిని కళ్లకు కట్టినట్లు తెలిపే పద్యమిది. ప్రజాదుఃఖవ్యధితమైన కవిహృదయాంతరాళం నుండి వెలువడిన ఈ పద్యాలు గొప్ప ఉరవడి, ధారాశుద్ధి కలిగి, ఉపాలంభం మిక్కిలి తీవ్రత ఆవేశపూరితమై స్వామి హృదయాన్ని సూటిగా తాకుతున్నట్లుంటాయి.

కాసుల పురుషోత్తమకవి (క్రీ.శ. 1791) ఆంధ్రనాయకశతకం మిక్కిలి ప్రసిద్ధమైంది. శ్రీకాకుళంలో వెలసిన ఆంధ్ర విష్ణువుని గురించి చెప్పిన శతకమిది.

**"నాగలి రోకలన్నకు నిచ్చి శంఖాది పంచాయుధములీవు పట్టినావు**
**తాటి టెక్కెంబుగోల్లల బెద్దకెత్తించి గరుడధ్వజంబీవు గట్టినావు**
**వెలరాని కఱవోని వలువ జ్యేష్ఠునికిచ్చి కనకాంబరమీవు గట్టినావు.**
**మద్య మగ్రజునకు మత్తిలద్రావించి జున్ను పాల్వెరుగీవు జుర్రినావు**
**తగవరివె యన్నదమ్ముల ధర్మమీవె తీర్పవలెగాని మతియెందు తీర్పగలడె**
**చిత్ర చిత్రస్వభావ దాక్షిణ్యభావహత విమత జీవ శ్రీకాకుళాంధ్రదేవ."**

పురుషోత్తమకవి రామకృష్ణాద్యవతారమూర్తుల లీలలను నిందా పూర్వకంగా ఉపాలంభించి చివరికి ఆ దేవుని నిందించిన తన తప్పు కావుమని కరుణార్ద్రరీతిలో వేడుకొన్నాడు. ఈ కవి భావనాబలం, ఉపాలంభ విధానం అత్యంత రమ్యంగా ఉంటుంది.

భల్లా పేరయ్య (క్రీ.శ. 18 వ శతాబ్దం పూర్వార్థం) రచించిన భద్రగిరి శతకం కూడ నిందాస్తుతులతో కూడినదే. గోల్కొండ వినాశనానికి ఔరంగజేబుకు తోడ్పడిన ఇబ్రహీముఖాను సేవకుడైన ధంసా అనే తురుష్కుడు భద్రాద్రిని ముట్టడించినపుడు ఆలయం అర్చకులు శ్రీరాముని విగ్రహాలను పడవలపై పోలవరం చేర్చారు. ధంసాకు భయపడి పోలవరంలో దాగిన శ్రీరాముని నిష్ఠురోక్తులతో పేరయ్యకవి ప్రబోధించిన సందర్భంలో రచింపబడిన శతకమిది.

వ్యాజస్తుతి శతకాలన్నీ చారిత్రక నేపథ్యం కలిగినట్టివే. కవి ఆవేదనకు ప్రతీకలుగా నిలిచినట్టివే. ఆ భగవంతునికూడ చైతన్యవంతం చేయగల శక్తిమంతమైనవే. కూర్మనాథకవి శతకంలోని ఉపాలంభాన్ని సహించలేక సింహాద్రి నారసింహుడు కందిరీగల రూపంలో యవనులను తరిమివేశాడట. కృష్ణా వరదలకు శిథిలమైన ఆలయాన్ని చూచి ఆవేదనతో పురుషోత్తమకవి చెప్పిన శతకం వల్ల చల్లపల్లి రాజావారి జోక్యంతో ఆలయం బాగుచేయించబడింది. భద్రగిరిశతకం ప్రేరణ వల్ల పూసపాటి విజయరామరాజు సహాయంతో శ్రీరాముని విగ్రహాలు తిరిగి భద్రగిరి చేరుకొన్నాయి.

## 14.5. వేదాంత శతకాలు:

భక్తి శతకాల తర్వాత వేదాంత శతకాలు ప్రసిద్ధి గాంచినవి. వీటిని తాత్త్విక శతకాలని కూడ అంటారు. పరమానందయతి శివముకుంద శతకం, సంపంగిమన్న శతకం, దత్తాత్రేయ శతకం వేదాంత శతకాల్లో ఉన్నత స్థానమాక్రమించినవి. 'శివముకుంద పరమానందా' అనే మకుటంతో కంద పద్యాల్లో రచింపబడిన శివముకుంద శతకంలో హరిహరాద్వైతం నిరూపింపబడినది. 'సంపగిమన్నా' మకుటంతో రచింపబడిన శతకం అద్వైత సిద్ధాంతాన్ని తెలియజేస్తుంది.

**"సన్యాసులమని శాస్త్రోపన్యాసము సేయనందుఫలమేమి మన**
**స్సన్యాసము దొరకని యాసన్యాసము కూటికన్న సంపంగిమన్నా"**

యోగాభ్యాసం మోక్షప్రాప్తికి ముఖ్యమనీ, అన్నిటికంటె మనస్సన్యాసమే మించినదని దాని వల్లనే వైరాగ్యప్రాప్తి కలుగుతుందని ప్రబోధించే శతకమిది.

తోట నరసింహకవి వ్రాసిన రామరామశతకం, పరశురామ పంతుల లింగమూర్తి మనశ్శతకం, ఆత్మరామగోవింద శతకం, మల్లనయోగి మల్లన యోగి శతకం, నారాయణ దాసకవి వ్రాసిన నిస్సంశయాత్మక శతకం భక్తివైరాగ్య తత్త్వ ప్రధానమైన శతకాలు. తాడేపల్లి పానకాల రాయకవి (18వ శతాబ్ది) మానసబోధ శతకం, చిత్త బోధశతకం రచించాడు.

**"ఇటునటుపాలు ద్రావి పరువెత్తుటకంటెను నిల్చినీరుగ్రో**

**లుట కడుమేలు మేలనెడు లోక హితోక్తి గణించి చాలమి**

**క్కుటమగుకర్మ బంధముల గాసిలకచ్యుత చేరమంటివే**

**సటబడకింకనైన మనసా హరిపాదములాశ్రయింపుమా"**

ఈ శతకంలోని దృష్టాంత రామణీయకత ప్రశంసనీయంగా ఉంటుంది. భగవచ్చింతనా పరమై వైరాగ్య బోధకమై, భక్తి భరితమై విరాజిల్లుతుందీ శతకం.

వేమన పద్యాల్లో కూడా నిగూఢమైన వేదాంత రహస్యాలు తత్త్వబోధ కనిపిస్తుంది.

## 14.6. నీతి శతకాలు:

నీతిశతకాలు లోకానుభవం ఆధారంగా లౌకిక జీవితానికి సంబంధించి ఉంటాయి. నీతి శతకాల్లో జీవిత సత్యాలు, సంఘవిమర్శ, మానవుల నైతిక వర్తనం, సత్యం, దయ, దానం, మొదలైన సుగుణాలు, లోభం, మోహం, విషయవాంఛ మొదలైన దుర్గుణాలు లోకనీతికి సంబంధించినవి ఉంటాయి. రాజనీతికి సంబంధించిన వాటిలో రాజధర్మాలు, సేవక లక్షణాలు, ప్రజారక్షణ మొదలైన అంశాలుంటాయి.

నీతి శతకాల్లో సుమతి శతకం కాలాన్ని బట్టి, గుణాన్ని బట్టి అగ్రగణ్యమైనది. బద్దెన (క్రీ.శ 13 వ శతాబ్ది) సుమతి శతకాన్ని రచించాడు.

**తనకోపమె తన శత్రువు**

**తన శాంతమె తనకు రక్ష దయ చుట్టంబౌ**

**తన సంతోషమె స్వర్గము**

**తన దుఃఖమె నరకమండ్రు తథ్యము సుమతీ !**

ఇలా అలతి అలతి పదాలతో బాలుర నుండి వృద్ధుల వరకు అశేషజనాదరణ పొందినదీ సుమతి శతకం.

సుమతి శతకం వలెనే బహుళ జనాదరణ పొందిన శతకం భాస్కర శతకం. ఇది అజ్ఞాతకర్తృకం. ఇందులోని ప్రతి పద్యమందు ఒక నీతి దానికి లోకంలోని ఒక దృష్టాంతం చెప్పబడి ఉంటుంది.

నీతి శతకాల్లో చెప్పుకోదగినవి వేంకటనరసింహ కవి రచించిన కుమారీ శతకం, కుమార శతకం, జానపాటి కామశాస్త్రి కృతమైన మానినీ శతకం మొదలైనవి.

## 14.7. అధిక్షేప శతకాలు:

కొందరు కవులు వ్యక్తి దూషణ ప్రధానమైన శతకాలను వ్రాశారు. సమకాలిక సాంఘిక, రాజకీయ వ్యవస్థలోని లోపాలు, ప్రజలు అనుభవించిన అసంతృప్తి, మానవుల నైతిక పతనం అధిక్షేప శతకాల రచనకు దోహదం చేసిన పరిస్థితులు,

అధిక్షేప శతకకర్తల్లో కవి చౌడప్ప (క్రీ.శ. 17 వ శతాబ్దం) ముఖ్యుడు, అగ్రగణ్యుడు. ఇతడు ఆత్మ సంబుద్ధి పరంగా చెప్పినదే కవి చౌడప్ప శతకం.

కూచిమంచి తిమ్మకవి భర్గ, కుక్కుటేశ్వర శతకాలను రచించాడు. వీటిలో సమకాలిక ప్రభువుల చిత్తవృత్తి, సాంఘిక దురాచారాలు, దుర్జనుల దురాగతాలు అధిక్షేపాత్మకంగా చిత్రింపబడినాయి. అడిదము సూరకవి (క్రీ.శ. 1720-1780) విజయనగర రాజు చిన విజయ రామరాజు ఆస్థానకవి. తనను అనాదరంతో చూచిన చిన విజయరామరాజు అగ్రజుడైన సీతారామరాజును అతని దుశ్చర్యలను తీవ్రంగా ఖండిస్తూ సూరకవి రామలింగేశ శతకాన్ని వ్రాశాడు.

చౌడప్ప, తిమ్మకవి, సూరకవి అడుగుజాడలలో తమను అగౌరవించిన వారిని, సమకాలీన పరిస్థితులను కలిపి అనేకమంది అధిక్షేప శతకాలను రచించారు. అందులో గువ్వల చెన్నడు అపారమైన లోకానుభవం కలిగినవాడు. ఇతడు సాంఘిక దురాచారాలను, దుర్జనుల చిత్తవృత్తిని నిశితంగా విమర్శించారు.

**కలిమిగలలోభికన్నను**
**విలసితముగ భౌదమేలు వితరణిమైనన్**
**జలచెలమ మేలుగాదా**
**కులనిధి యంబోధికన్న గువ్వలచెన్నా!**

సంపదకలిగిన లోభికంటె వితరణ కలిగిన పేదమేలు. ఎట్లంటే మంచినీటి చెలమ మేలు, ఉప్పునీటి సముద్రం కంటే అని చెప్పటంలో ఎంతో లోకానుభవం దాగి ఉన్నది.

## 14.8. శృంగార శతకాలు:

క్రీ.శ. 16 వ శతాబ్దం నాటి శృంగార కావ్యాల ప్రభావం శతకాల మీద కూడ కనిపిస్తుంది. రాధాకృష్ణుల శృంగారాన్ని పుసులూరి సోమరాజకవి (17వ శతాబ్దం) "ఇందు శతకం" అనే పేరుతో రచించాడు.

బొడ్డు లక్ష్మీనారాయణకవి హేలాపురంలో వెలసిన వేణుగోపాలునిపేర హేలాపురి శతకాన్ని రచించాడు. ఇందులో విరహణీ శృంగారం ప్రధానంగా ఉంటుంది.

గోపీనాథ వేంకటకవి బ్రహ్మానంద శతకాన్ని రచించాడు. ఇందులో కృష్ణుని క్రీడలు, గోపికల విరహం, కామశాస్త్రానుసారం వర్ణించబడినాయి. గంగాధర కవి కీరవాణి శతకాన్ని రచించాడు. చెంగల్వ రాయకవి మదనగోపాల శతకాన్ని రచించాడు. ఈ రెండు కృష్ణుని శృంగారానికి సంబంధించినవి.

## 14.9. హాస్య శతకాలు:

సామాన్య వస్తువులైన పొగచుట్ట, పకోడీ, చీపురుపుల్ల, విసనకర్ర మొదలైన వాటికి కావ్య గౌరవాన్ని కలిగించిన శతకాలివి. హాస్య వ్యంగ్య ప్రధానంగా రచించింపబడిన పొగచుట్ట శతకం (కర్త తెలియదు), పకోడీ శతకం (కర్త తెలియదు), సామినేని వేంకటాద్రికవి వ్రాసిన చీపురుపుల్ల శతకం, హరిబ్రహ్మేశ్వర కవులు రచించిన విసనకర్ర శతకం ముఖ్యమైన హాస్యశతకాలు.

వస్తు నిర్దేశం లేకుండ వివిధాంశాల మీద రచింపబడిన శతకాలు తెలుగులో అసంఖ్యాకంగా ఉన్నాయి. కథనాత్మక

శతకాలున్నాయి. రామాయణ భారతభాగవతాదుల కథలను గ్రహించి రచించిన శతకాలున్నాయి. భువనగిరి లక్ష్మీకాంతమ్మ వ్రాసిన భారతకృష్ణ శతకం, వంగూరి ముద్దునరసకవి వ్రాసిన ప్రసన్న రాఘవశతకం, తుర్లపాటి పురుషోత్తమ శర్మ వ్రాసిన భాగవత ప్రథమస్కంధ శతకం మొదలైనవి పౌరాణిక కథా సంబంధ శతకాలు. మండపాక పార్వతీశ్వరశాస్త్రి వ్రాసిన హరిహరేశ్వర శతకం, కొక్కొండ వేంకటరత్నం పంతులు వ్రాసిన బిల్వేశ్వర శతకం ఆత్మకథా రూపంలో వెలువడిన శతకాలు.

తెలుగు శతకం వస్తువులోను, రచనా విధానంలోను, విశిష్ట లక్షణాలను సంతరించుకొని కవి ఆత్మీయ భావాలకు వాహికగా అపురూపమైన ప్రక్రియగా తెలుగు సాహిత్య చరిత్రలో ఉన్నతమైన స్థానాన్ని ఆక్రమించింది.

## 14.10. సారాంశము:

సంస్కృతీ, ప్రాకృత భాషల్లోని శతక ప్రక్రియ కొన్ని విశిష్ట లక్షణాలను సంతరించుకొని తెలుగులో ప్రత్యేక ప్రక్రియగా రూపుదిద్దుకొంది. శతకాలను భక్తి శతకాలని, వ్యాజస్తుతి శతకాలని నీతి శతకాలని, అధిక్షేప శతకాలని, శృంగార శతకాలని, విభజించవచ్చు. సుమతీ శతకం, దాశరధీ శతకం వంటి కొన్ని శతకాలలోని పద్యాలు ఆంధ్ర దేశంలో ఆబాల గోపాలానికి కంఠతోవచ్చు అని అంటే, శతక ప్రక్రియకున్న పలుకుబడి ఏమిటో ఊహించుకోవచ్చు.

## 14.11. నమూనా ప్రశ్నలు:

1) శతక ప్రక్రియ ఆవిర్భావాన్ని చర్చించి భక్తి శతకాలపై ఒక వ్యాసాన్ని వ్రాయండి?

2) నీతి, అధిక్షేప, శృంగార శతకాలపై వ్యాసాన్ని వ్రాయండి?

3) హాస్య, వ్యాజ స్తుతి శతకాలపై సోదాహరణమైన వ్యాసాన్ని వ్రాయండి?

## 14.12. ఆధార గ్రంథాలు:

1) ఆరుద్ర: సమగ్ర ఆంధ్ర చరిత్రము

2) డా॥ జి.నాగయ్య: తెలుగు సాహిత్య సమీక్ష

**- డా॥ కె. కుసుమాబాయి**

# M.A. TELUGU :: 4th SEMESTER :: PAPER-III

## LITERARY CRITICISM

## సంప్రదాయ సాహిత్య విమర్శ

## మాదిరి ప్రశ్నాపత్రం

---

**సమయం: 3 గంటలు** **మార్కులు: 70**

**ఈ క్రింది ప్రశ్నలలో ఐదింటికి సమాధానాలు రాయండి. అన్నింటికి మార్కులు సమానం. 5 × 14 =70 మార్కులు.**

1. విమర్శ స్వరూప స్వభావాలను వివరించండి?
2. కావ్య ప్రయోజనాలను తెలిపి కావ్యహేతువులను విశ్లేషించండి?
3. లలిత కళల గురించి రాయండి?
4. రసనిష్ఠ – వాదాలు విశ్లేషించండి?
5. ధ్వని భేదాలు వివరించండి?
6. శతక సాహిత్యం గురించి రాయండి?
7. యక్షగానం లక్షణాలు సోదాహరణంగా వివరించండి?
8. దశరూపకాల గురించి రాయండి?
9. నాటక లక్షణాలు తెలుపండి?
10. ట్రాజెడి ఆవిర్భావ వికాసాలను వివరించండి?